VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్
శనివారం 02.05.2026

సంపుటి: 07 సంచిక: 327
పేజీలు: 12 వెల: రూ. 5/

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH

Velthuru Newspaper



## మొజ్తబా ఆరోగ్యంపై పుకార్లు నమ్మొద్దు

- వెస్ట్రన్ మీడియా ప్రచారాన్ని కొట్టిపారేసిన ఇరాన్
- బాంబు దాడి నుంచి ఖమేనీ తప్పించుకున్నారన్న మంత్రి
- ఆన ప్రత్యక్ష పర్యవేక్షణలోనే దేశ పాలన, చర్చలు
- భారత్‌లోని ఇరాన్ ప్రతినిధి సైతం ఖమేనీ క్షేమమని ధృవీకరణ

# అన్నదాతను అడవి పాలు చేస్తారా?

- రేవంత్ సర్కార్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం
- పంట నష్టపరిహారం రూ.5 వేల కోట్లకు రూ.260 కోట్లే ఇచ్చారన్న బండి
- పౌరసరఫరాల సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టి
- రూ.లక్ష కోట్ల భారం మోపారని విమర్శలు

హైదరాబాద్ వెలుతురు మే 1:
రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు మండుటెండల్లో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను మిల్లర్లు, దళారులు నిలువునా ముంచుతున్నా సర్కార్ చోద్యం చూస్తోందని ధ్వజమెత్తారు. వడ్లకు ఇస్తామన్న బోనస్ హామీ ఏమైందని, గత రబీ ..మిగతా 2లో



# ఇరాన్‌తో యుద్ధం ముగిసింది



- ట్రంప్ సర్కార్ సంచలన ప్రకటన
- సెనెట్ వేదికగా వెల్లడించిన రక్షణ మంత్రి
- నాటో మిత్రదేశాలకు షాక్
- కాంగ్రెస్ అనుమతి అవసరం లేదని వ్యాఖ్యలు
- సెనెట్ ఓటింగ్‌లో ట్రంప్ సర్కారు విజయం
- 50 ఓట్లతో తీర్మానం నెగ్గుబాటు
- వ్యూహాత్మకంగా వ్యవహరించిన వైట్ హౌస్
- నాటో మిత్రదేశాలపై ట్రంప్ ఆగ్రహం

పశ్చిమాసియా వెలుతురు మే 01:
పశ్చిమాసియాలో గత కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెర దించుతూ అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇరాన్‌తో యుద్ధం ఇప్పటికే ముగిసిందని, కాల్పుల విరమణ ఒప్పందం నిరవధికంగా అమలులో ఉందని వెల్లడించింది. మరోవైపు, యుద్ధం సమయంలో తనకు సహకరించని నాటో మిత్రదేశాలపై అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటలీ, స్పెయిన్ వంటి దేశాల నుంచి అమెరికా సైన్యాన్ని వెనక్కి పిలిపించే అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ప్రకటించి అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారు. ..మిగతా 2లో



## గ్యాస్ ధరల పెంపు దుర్మార్గపు నిర్ణయం

- కేంద్రంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం
- కమర్షియల్ సిలిండర్‌పై రూ.993 భారం
- సుమారు వెయ్యి రూపాయల పెంపు అన్యాయం
- చిన్న వ్యాపారులు, హోటళ్లపై కోలుకోలేని దెబ్బ
- ఒకేసారి 35 శాతం పెరిగిన భారం
- ఎన్నికలు ముగియగానే అసలు రంగు బయటపడింది

హైదరాబాద్ వెలుతురు మే 01:
వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను భారీగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రం అనుసరిస్తున్న తీరు సామాన్యుడి నడ్డి విరిచేలా ఉందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పేదల ప్రయోజనాలను గాలికొదిలేసి, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని ఆయన విమర్శించారు. గ్యాస్ ధరల పెంపుతో సామాన్యుడి బతుకు భారంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ..మిగతా 2లో



## గుర్తింపు ఎన్నికలు విలీనంపై

# సమగ్ర కార్యాచరణతో రండి

- పీఆర్సీ అంశాన్ని మేం పరిష్కరిస్తాం....
- గాజులరామారంలో 100, బహదూర్‌గూడలో 150 ఎకరాల్లో బస్ టెర్మినళ్లు
- ఒక డ్రైవర్‌నూ ఉద్యోగం నుంచి తొలగించం...
- ఉద్యోగులు, మేనేజ్‌మెంట్ మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలి..
- ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- సమ్మె కాలంలో వేతనాల చెల్లింపు, కేసుల ఎత్తివేతకు ఆదేశం...

హైదరాబాద్ వెలుతురు మే 01:
ఆర్టీసీ మనుగడ, గౌరవాన్ని పెంపొందించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై అన్ని సంఘాల నాయకులు సమావేశమై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. పీఆర్సీ అంశాన్ని తాము పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ఉన్నతాధికారులతో ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై ఏవిధంగా ముందుకు పోవాలనే దానిపై సంఘాల నాయకులు సమావేశమై ప్రభుత్వం ఎదుట ఆప్షన్లు ఉంచాలని ..మిగతా 2లో



## కాంగ్రెస్ కూల్చివేతలు..
# కేంద్రం బాదుడు

### మే డే వేడుకల్లో కేటీఆర్ తీవ్ర విమర్శలు

- రిటైర్డ్ ఉద్యోగులు వరద బాధితులా?
- ప్రభుత్వ వైఖరిపై నిలదీసిన కేటీఆర్
- రాష్ట్రంలో 120 మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు
- సర్కార్ మౌనం దారుణమని ఆగ్రహం



## మార్క్ ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులతో పంటల కొనుగోళ్లపై మంత్రి సమీక్ష



## శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

- తెలంగాణ కొత్త డీజీపీ సీవీ ఆనంద్
- బాధ్యతల స్వీకరించిన పోలీస్ బాస్
- టెక్నాలజీతో నేరగాళ్లకు చెక్
- పోలీసింగ్‌లో ఆధునిక పోకడలు
- డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం
- ఈగల్ టీమ్స్' సేవలు విస్తృతం
- ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై కీలక వ్యాఖ్యలు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సాహసోపేతమైన ఆపరేషన్లు



## జూన్2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

న్యాయపరమైన చిక్కుల్లేకుండా ఇళ్లస్థలాలు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



## అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా గుట్టు రట్టు

- ముంబయిలో రూ.1,745 కోట్ల కొకైన్ సీజ్
- అంతర్జాతీయ ముఠాను పట్టుకున్న ఎన్‌సీబీ
- 'బాటమ్-టు-టాప్' విధానం సక్సెస్
- ఎన్‌సీబీ బృందంపై అమిత్ షా ప్రశంసల జల్లు
- తుర్కియే నుంచి భారత్‌కు దావూద్ అనుచరుడు సలీం డోలా తరలింపు

## బీఆర్ఎస్‌ది ఉనికి కోసమే పోరాటం

కేసీఆర్, కిషన్ రెడ్డి మధ్య లోపాయికారి ఒప్పందం

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు



## ప్రజలకు కేంద్రం ఇచ్చిన 'ఎన్నికల బిల్లు'

- గ్యాస్ ధరల పెంపుపై రాహుల్ గాంధీ నిప్పులు
- మూడు నెలల్లోనే 81 శాతం పెంచారని ఆగ్రహం
- చిరు వ్యాపారుల వంటగదులపై భారీ భారం
- ఇది కేవలం 'ఎన్నికల బిల్లు' మాత్రమేనన్న రాహుల్
- గ్యాస్ తర్వాత పెట్రోల్, డీజిల్ వంతు వస్తుందని హెచ్చరిక
- ప్రజలకు కేంద్రం వెన్నుపోటు పొడిచిందన్న డీకే శివకుమార్
- మే డే వేళ మోదీ 'విషపు' బహుమతి ఇచ్చారన్న బృందా కారత్
- అంబానీ, అదానీల కోసమేనా సబ్సిడీలు అని ప్రశ్నించిన సీపీఎం



# అన్నదాతను అడవి పాలు చేస్తారా?

**(మొదటి పేజీ తరువాయి)**
సీజన్ తరహాలోనే ఈసారి కూడా అన్నదాతలకు మొండిచేయి చూపుతారా అని బండి సంజయ్ ప్రశ్నించారు.రాష్ట్రంలో పత్తి, మొక్కజొన్న రైతులకు కనీస మద్దతు ధర దక్కకుండా దళారులకు ప్రభుత్వం కొమ్ము కాస్తోందని ఆయన ఆరోపించారు. అకాల వర్షాలతో సుమారు 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే, ఎకరాకు రూ. 10 వేల చొప్పున ఇవ్వాల్సిన పరిహారాన్ని ఎగ్గొట్టి కేవలం రూ. 260 కోట్లతో చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రభుత్వం కేవలం కరప్షన్, కలెక్షన్లు, ల్యాండ్ సెటిల్‌మెంట్లపైనే దృష్టి పెట్టిందని, రైతుల కన్నీటి వెతలను పట్టించుకునే తీరిక ముఖ్యమంత్రికి లేదని దుయ్యబట్టారు. వడగాల్పులతో జనం అల్లాడుతున్నా సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఊసే లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రైతు వ్యతిరేక విధానాలను వీడి, అన్నదాతలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బండి సంజయ్ హెచ్చరించారు.

# మొజ్తబా ఆరోగ్యంపై పుకార్లు నమ్మొద్దు

ఇరాన్ వెలుతురు మే 01:
ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా సయ్యద్ మొజ్తబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితిపై గత కొన్ని రోజులుగా అంతర్జాతీయ మీడియాలో వస్తున్న కథనాలను ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. తమ నాయకుడు క్షేమంగా ఉన్నారని, పాలనా వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని స్పష్టం చేసింది. పశ్చిమ దేశాలు ఉద్దేశపూర్వకంగానే ఇరాన్‌లో అశాంతిని సృష్టించేందుకు ఇటువంటి తప్పుడు ప్రచారాలను తెరపైకి తెస్తున్నాయని మండిపడింది. ఈ మేరకు ఇరాన్ అంతర్జాతీయ వ్యవహారాల ఉప మంత్రి అయతొల్లా మొహ్సెన్ ఖోమీ కీలక ప్రకటన విడుదల చేశారు.

**శత్రువుల ఎత్తుగడలను చిత్తు చేస్తాం**
మొజ్తబా ఖమేనీ ఎందుకు బహిరంగంగా కనిపించడం లేదు? ఆయన ఆడియో లేదా వీడియో సందేశాలు ఎందుకు రావడం లేదు? అన్న ప్రశ్నల వెనుక శత్రువుల కుతంత్రం ఉందని అయతొల్లా మొహ్సెన్ ఖోమీ విమర్శించారు. "మా నాయకుడి పరిస్థితిపై మమ్మల్ని నోరు విప్పేలా చేసి, లోగుట్టు తెలుసుకోవాలని పశ్చిమ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. కానీ దైవ సంకల్పంతో ఆయన సురక్షితంగా ఉన్నారు. శత్రువుల లక్ష్యాలు నెరవేరనివ్వం" అని ఆయన తేల్చి చెప్పారు. ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఈ కథనాన్ని ప్రముఖంగా ప్రచురించింది.

**మృత్యువును జయించిన నాయకుడు**
ఫిబ్రవరి 28న జరిగిన భీకర బాంబు దాడి సమయంలో మొజ్తబా ఖమేనీ అదే భవనంలో ఉన్నారని మంత్రి ఖోమీ సంచలన విషయాన్ని బయటపెట్టారు. ఆ దాడుల్లో పలువురు అమరులయ్యారని, పేలుడు సంభవించడానికి కొన్ని నిమిషాల ముందే ఖమేనీ దైవవశాత్తూ బయటకు వెళ్లారని తెలిపారు. ఆ ప్రమాదంలో ఆయనకు కొన్ని గాయాలైనప్పటికీ, వాటి నుంచి వేగంగా కోలుకుంటున్నారని చెప్పారు. "ప్రస్తుతం ఆయన ప్రాణాలను కాపాడటమే మాకు అత్యంత ముఖ్యం. ఆయన సంపూర్ణ స్పృహలో ఉన్నారు. సైనిక కార్యకలాపాలు, చర్చల బృందాలకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు" అని వివరించారు.

**భారత్ నుంచి కూడా మద్దతు**
భారత్‌లోని ఇరాన్ సుప్రీం నేత డిప్యూటీ ప్రతినిధి మొహమ్మద్ హుస్సేన్ జియాయినియా కూడా ఏప్రిల్ 28న ఇదే విషయాన్ని ధృవీకరించారు. ఖమేనీ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని, ఆయన క్షేమంగా ఉన్నారనే సమాచారం తమకు అందిందని ఏఎన్ఐ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అంతర్జాతీయంగా వస్తున్న పుకార్లకు చెక్ పెట్టేలా ఇరాన్ రాయబార కార్యాలయాలు ఈ సమాచారాన్ని ప్రపంచవ్యాప్తంగా చేరవేస్తున్నాయి.

**తీవ్ర ఆంక్షల మధ్య చికిత్స**
గత ఫిబ్రవరిలో ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ నివాసంపై జరిగిన వైమానిక దాడుల్లో ఆయన మరణించగా, అదే సమయంలో మొజ్తబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారని న్యూయార్క్ టైమ్స్ వంటి అంతర్జాతీయ పత్రికలు కథనాలు ఇచ్చాయి. ఆ దాడిలో ఆయన భార్య, కుమారుడు కూడా ప్రాణాలు కోల్పోయారని సమాచారం. అప్పటి నుంచి ఆయనను కలిసేందుకు భద్రతా బలగాలు కఠిన ఆంక్షలు విధించాయి. కేవలం అత్యంత విశ్వసనీయమైన వైద్య సిబ్బంది మాత్రమే ఆయనకు సేవలు అందిస్తున్నారని, భద్రతా కారణాల దృష్ట్యా ఆయనను బయటి ప్రపంచానికి దూరంగా ఉంచినట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి పరిస్థితి మొత్తం ఖమేనీ అదుపులోనే ఉందని, త్వరలోనే ఆయన ప్రజల ముందుకు వచ్చే అవకాశం ఉందని ఇరాన్ అధికార వర్గాలు సంకేతాలిస్తున్నాయి. పశ్చిమ దేశాల ప్రచారాన్ని తిప్పికొడుతూ ఇరాన్ ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు టెహ్రాన్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది.

# బీఆర్ఎస్‌ది ఉనికి కోసమే పోరాటం

- **కేసీఆర్, కిషన్ రెడ్డి మధ్య లోపాయికారి ఒప్పందం**
- **-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు**
- **ఫోన్ ట్యాపింగ్‌లో హరీష్ రావు పాత్రపై సవాల్**
- **మే నెలలోనే కార్పొరేషన్ చైర్మన్ పదవుల భర్తీ**

హైదరాబాద్ వెలుతురు మే 1: గాంధీ భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేడుకల్లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. పదేళ్ల పాలనలో ప్రజలను వంచించిన కేసీఆర్ కుటుంబం, ఇప్పుడు ఉనికిని కాపాడుకునేందుకే పాకులాడుతోందని విమర్శించారు. కేవలం వాటాల పంపకాల్లో తలెత్తిన విభేదాల నుంచే కవిత కొత్త పార్టీ (కుంపటి) పుట్టిందని, దీనివల్లే కేసీఆర్ మళ్లీ బయటకు రాక తప్పని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎన్ని డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచిందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై స్పందిస్తూ.. హీరోయిన్ల ఫోన్లను సైతం ట్యాపింగ్ చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని, తమకు అటువంటి అవసరం లేదని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌లో హరీష్‌రావు పాత్రపై వస్తున్న ఆరోపణలను ఆయన నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. కాళేశ్వరం అవినీతిపై కిషన్ రెడ్డి ఎందుకు విచారణ జరిపించడం లేదో చెప్పాలని, వారిద్దరి మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని ఆరోపించారు. ఇక పార్టీ కార్యకర్తలకు గుడ్ న్యూస్ చెబుతూ.. మే నెలలోనే కార్పొరేషన్ చైర్మన్ పదవులను, ఇతర నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. దీనిపై మరో రెండు మూడు రోజుల్లోనే స్పష్టత రానుందని వెల్లడించారు.



# గుర్తింపు ఎన్నికలు విలీనంపై సమగ్ర కార్యాచరణతో రండి

**(మొదటి పేజీ తరువాయి)**
సూచించారు. ఒకవేళ యూనియన్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే ఏ యూనియన్‌కు ఆ యూనియన్ తమ ఆప్షన్లు ఇస్తే కామన్‌గా ఉన్న వాటికి ఆమోదం తెలిపి.. భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిపై చర్చిద్దామని సీఎం అన్నారు.
ఆర్టీసీ బకాయిలు తమ హయాంలోని కావని.. కానీ వాటిని చెల్లించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల నిధులను వాడుకుందని సీఎం గుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి అంతా కలిసిరావాలని, భావోద్వేగాలు, రాజకీయాల ప్రభావాలకు లోనైతే సంస్థకు నష్టం వాటిల్లుతుందని సీఎం అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వం వేర్వేరనే భావన తమకెప్పుడూ లేదన్నారు. 2006లో జడ్పీటీసీ సభ్యునిగా గెలిచిన్పటి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, అధ్యక్షునిగా ఉన్న సమయలో ఆర్టీసీ కార్మికులు చేసిన పోరాటాల్లో పాలుపంచుకున్నానని సీఎం గుర్తు చేశారు. సింగరేణి, విద్యుత్ కార్మికులతో పాటు ఆర్టీసీ కార్మికులు బలంగా కోరుకున్నందునే తాము అధికారంలోకి వచ్చామని సీఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో నియామకాలు చేపట్టడంతో పాటు బస్సుల సంఖ్యను పెంచామని, కారుణ్య నియామకాలు చేప్టటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని.. నెలా నెలా చెల్లింపులతో ఆర్టీసీ ఆదాయం పెరిగిందని సీఎం అన్నారు. పని భారం పెరిగినా క్షేత్ర స్థాయి సిబ్బంది సహనంతో పని చేస్తుండడంతో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యం కోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బస్ టెర్మినళ్లు నిర్మించడానికి ఆర్టీసీకి గాజులరామారంలో వంద ఎకరాలు కేటాయించామని, బహదూర్‌గూడ (శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో)లో 150 ఎకరాలు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఆర్టీసీని సమున్నత స్థానంలో నిలపాలనే లక్ష్యంతోనే ఈ టెర్మినళ్ల నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల నుంచి డిమాండ్ లేకపోయినా తామే స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. ఆర్టీసీలో డీజిల్‌కు ఏటా రూ.2 వేల కోట్లు వ్యయం చేస్తున్నారని.. ఆ వ్యయం తగ్గింపునకే తాము ఈవీల వైపు మొగ్గు చూపుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గించుకోవాలని, దీనికి పక్కా ప్రణాళిక అవసరమని సీఎం అన్నారు. 1000 ఈవీ బస్సులు కొనుగోలు చేసి మెట్రో, ఎంఎంటీఎస్‌తో అనుసంధానం చేసి లాస్ట్ మైల్ కనెక్టివిటీకి కృషి చేస్తామని సీఎం తెలిపారు. అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులను రీకన్‌స్ట్రక్షన్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సంస్థను బలోపేతం చేసుకుని నిలబెట్టుకోవడానికి కార్మికులు సహకరించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఆర్టీసీలో ఒక్క డ్రైవర్‌ను తొలగించమని ముఖ్యమంత్రి తెలిపారు. ఆర్టీసీ కార్మికులు, మేనేజ్‌మెంట్ మధ్య గ్యాప్ రాకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. డిపో మేనేజర్లు, ఈడీ, ఎండీ స్థాయి అధికారులు తరచూ కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై సుహృద్భావ వాతావరణంలో మాట్లాడుకుంటే సగం సమస్యలు పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులతో మూడు నెలలకోసారి సమావేశం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ నాగిరెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అనేక ఇబ్బందులున్నా ఉద్యోగులు, కార్మికులు సమస్యల పరిష్కారానికి తాము పెద్దపీట వేస్తున్నామని సీఎం తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల చెల్లింపులను రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను 100 శాతం పరిష్కరిస్తామని.. కార్మికులకు అండగా ప్రభుత్వం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. చిన్న చిన్న స్పర్ధలతో సంస్థకు నష్టం వాటిల్లే పనులు చేయకూడదని.. సంస్థ మనుగడ సాగిస్తేనే అందరికీ మేలు జరుగుతుందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. సమ్మె కాలంలో వేతనం, కేసుల ఎత్తివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, ఎమ్మెల్యే లు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కేఆర్ నాగరాజు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఏ.ఆర్.రెడ్డి, థామస్ రెడ్డి (తెలంగాణ మజ్దూర్ యూనియన్), అశ్వత్థామ రెడ్డి, శంకర్ (తెలంగాణ మజ్దూర్ యూనియన్ (రి)), వీరాంజనేయులు, వి.ఎస్.రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఎస్.బాబు, ఈ.వెంకన్న (ఎంప్లాయిస్ యూనియన్), పి.కమల్ రెడ్డి, ఎండీ మౌలానా (నేషనల్ మజ్దూర్ యూనియన్), ఎంకే బోస్, బి.యాదగిరి (కార్మిక పరిషత్), జి.అబ్రహం, మొగుళ్ల రాజిరెడ్డి (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్), రాజిరెడ్డి, బి.యాదయ్య (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (రి)), బి.మునిరాములు, కె.యాదయ్య (బహుజన కార్మిక యూనియన్), కె.సత్యనారాయణ, ఎండీ అక్బర్ అలీ (ఆర్టీసీ వర్కర్స్ యూనియన్), కె.మనోహర్‌రావు, ఈ.స్వామి కుమార్ (కార్మిక సంఘ్), పున్న హరికిషన్, గోవింద్ (సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్), డి.వి.కె.రావు, కె.హనుమంతు ముదిరాజ్ (తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్), దువ్వాసీ యాదయ్య, సుద్దాల సురేష్ (బహుజన్ వర్కర్స్ యూనియన్) తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌తో యుద్ధం ముగిసింది

**(మొదటి పేజీ తరువాయి)**
కాంగ్రెస్ అనుమతి గండం గడిచింది అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ సెనెట్‌లో మాట్లాడుతూ ఇరాన్‌పై చేపట్టిన సైనిక చర్య ఏప్రిల్ మొదటి వారంలోనే ముగిసిందని స్పష్టం చేశారు. 1973 యుద్ధ అధికారాల తీర్మానం ప్రకారం.. ఏ దేశంపైనైనా 60 రోజులకు మించి యుద్ధం కొనసాగించాలంటే అమెరికన్ కాంగ్రెస్ అనుమతి తప్పనిసరి. అయితే, ఇరాన్ యుద్ధం ఫిబ్రవరి 28న ప్రారంభమై ఏప్రిల్ 7కే ముగిసినందున, ఈ నిబంధన తమకు వర్తించదని ప్రభుత్వం వాదించింది. సెనెట్‌లో జరిగిన ఓటింగ్‌లో 5047 ఓట్ల తేడాతో ప్రభుత్వం నెగ్గడంతో, యుద్ధ నిర్ణయాధికారాలు అధ్యక్షుడికే ఉండాలనే ప్రతిపాదనకు బలం చేకూరింది.

**మే 1 డెడ్‌లైన్.. చట్టపరమైన చిక్కులు**
ట్రంప్ ప్రభుత్వం మార్చి 2న యుద్ధ సమాచారాన్ని కాంగ్రెస్‌కు అందించింది. దీని ప్రకారం 60 రోజుల గడువు ఈ శుక్రవారం (మే 1)తో ముగుస్తుంది. ఈ లోపు యుద్ధం ముగిసిందని ప్రకటించడం ద్వారా ట్రంప్ సర్కారు చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకుంది. ఒకవేళ యుద్ధం కొనసాగించాల్సి వస్తే కాంగ్రెస్ అనుమతి కోసం వెళ్లాల్సి వచ్చేది, అక్కడ డెమొక్రాట్ల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయ్యే అవకాశం ఉండేది. కాబట్టి గడువు ముగిసే రోజే 'యుద్ధం ఆగిపోయింది' అని ప్రకటించడం ట్రంప్ వ్యూహకర్తల చాణక్యంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**సొంత పార్టీ నుంచే విమర్శలు**
ప్రభుత్వ నిర్ణయంపై అధికార రిపబ్లికన్ పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సీనియర్ సెనెటర్ సుసాన్ కొలిన్స్ మాట్లాడుతూ.. యుద్ధ డెడ్‌లైన్ అనేది కేవలం సలహా మాత్రమే కాదని, అది రాజ్యాంగబద్ధమైన అవసరమని గుర్తుచేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను కొనసాగించాలంటే దాని లక్ష్యాలేమిటో, ఆ ఘర్షణను ముగించే వ్యూహం ఏమిటో కాంగ్రెస్‌కు వివరించాల్సిన బాధ్యత అధ్యక్షుడిపై ఉందని ఆమె స్పష్టం చేశారు. ఆమెతో పాటు మరో రిపబ్లికన్ సెనెటర్ కూడా యుద్ధానికి వ్యతిరేకంగా ఓటు వేయడం గమనార్హం.

**నాటో మిత్రులకు ట్రంప్ హెచ్చరిక**
మరోవైపు నాటో కూటమిలోని మిత్రదేశాలైన ఇటలీ, స్పెయిన్‌ల వైఖరిపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇరాన్‌తో యుద్ధం జరుగుతున్నప్పుడు ఈ దేశాలు మాకు కనీసం సహకరించలేదు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమయ్యారు. స్పెయిన్ తీరు మరీ దారుణం. అలాంటప్పుడు మా సైనికులను అక్కడ ఎందుకు ఉంచాలి?" అని ట్రంప్ నిలదీశారు. ఇప్పటికే జర్మనీ నుంచి 36 వేల మంది సైనికులను వెనక్కి పిలిపించే అంశాన్ని పరిశీలిస్తున్న ట్రంప్, ఇప్పుడు ఇటలీ (12,662 మంది), స్పెయిన్ (3,814 మంది) నుంచి కూడా సేనలను ఉపసంహరిస్తానని ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.
ప్రస్తుత పరిణామాలు గమనిస్తుంటే, అమెరికా తన 'అమెరికా ఫస్ట్' విధానాన్ని మరింత దూకుడుగా అమలు చేస్తోందని స్పష్టమవుతోంది. మిత్రదేశాలతో సంబంధాల కంటే సొంత ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ ట్రంప్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు నాటో కూటమి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

# కాంగ్రెస్ కూల్చివేతలు.. కేంద్రం బాదుడు

హైదరాబాద్ వెలుతురు మే 01:
తెలంగాణలో ప్రస్తుతం కార్మిక వ్యతిరేక పాలన సాగుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ అటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఇటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ హయాంలో కార్మిక, ఉద్యోగ మిత్ర సర్కార్‌గా ఉన్న తెలంగాణ.. నేడు కాంగ్రెస్ హయాంలో వారిని వేధించే అడ్డాగా మారిందని మండిపడ్డారు.

**ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంఈఈwది కాంగ్రెస్ బాధితులు**
రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన బెనిఫిట్స్ విషయంలో మంత్రుల జీతాల్లో కోత వేసి ఇస్తామని ప్రభుత్వం చెప్పడంపై ఆయన మండిపడ్డారు. "ఉద్యోగులు ఏమైనా వరద బాధితులా? వారి హక్కుగా రావాల్సిన ప్రయోజనాల కోసం మంత్రుల దాతృత్వం అవసరమా?" అని ప్రశ్నించారు. సఫాయి కార్మికుల శ్రమను గుర్తించడంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని, ప్రస్తుత సర్కార్ పూర్తిస్థాయిలో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ధ్వజమెత్తారు.

**ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై స్పందన కరువు**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సుమారు 120 మంది ఆటో డ్రైవర్లు బలవన్మరణానికి పాల్పడ్డారని కేటీఆర్ గుర్తుచేశారు. ఉపాధి కోల్పోయి వీధిన పడిన ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని ఆక్షేపించారు. వలస కార్మికుల పట్ల కూడా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, గతంలో కేసీఆర్ వారిని 'కడుపులో పెట్టుకుని' చూసుకుంటే, ఇప్పుడు రేవంత్ రెడ్డి వారి ఇళ్లపైకి బుల్డోజర్లు పంపిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలన అంటే కూల్చివేతలు, ఎగవేతలు, పేల్చివేతలు మాత్రమేనని ఎద్దేవా చేశారు.

**మే డే వేళ కేంద్రం భారీ బాదుడు**
వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను ఒకేసారి రూ. 1000 వరకు పెంచి ప్రధాని మోదీ కార్మికులకు చేదువార్త అందించారని కేటీఆర్ విమర్శించారు. గత 80 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు ఇంత భారీ పెంపును ఎప్పుడూ చూడలేదని ఆయన అన్నారు. "ప్రధాని గతంలో నిరుద్యోగులను పకోడీలు వేసుకోమన్నారు.. కానీ ఇప్పుడు గ్యాస్ ధరలు చూస్తే ఆ పకోడీలు కూడా వేసుకోలేని పరిస్థితి వచ్చింది" అని ఎద్దేవా చేశారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ముగియగానే ధరలు పెంచడం బీజేపీకి అలవాటుగా మారిందని దుయ్యబట్టారు.

**బాధితులకు అందని సాయం**
సిగాచి పరిశ్రమ ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు రూ. కోటి ఇస్తామని చెప్పి ముఖ్యమంత్రి మాట తప్పారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అవినీతి వల్లే ఎస్సెల్బీసీ సొరంగం కుప్పకూలిందని, అక్కడ ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోతే వారి మృతదేహాలను కూడా వెలికితీయలేని దౌర్భాగ్యస్థితిలో ప్రభుత్వం ఉందని ఆక్షేపించారు.

# శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

హైదరాబాద్ వెలుతురు మే 01:
తెలంగాణ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయంలో తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తానని, మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా సరికొత్త సాంకేతికతను వాడుకుంటూ నేరగాళ్లకు చెక్ పెడతామని స్పష్టం చేశారు.



**సాంకేతిక సవాళ్లు - పోలీసుల వ్యూహాలు**
నేరగాళ్లు కొత్త కొత్త టెక్నాలజీని వాడుతూ మోసాలకు పాల్పడుతున్నారని, ఇది పోలీసులకు ఒక సవాలుగా మారిందని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. "నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే దేశంలోనే మేటిగా ఉన్నారు. అయితే నేరగాళ్ల ఎత్తుగడలు మారుతున్నాయి. అందుకే శాంతిభద్రతల సమస్య తలెత్తక ముందే అప్రమత్తంగా ఉండే వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం" అని ఆయన అన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

**మాదకద్రవ్యాల ముఠాలపై ఉక్కుపాదం**
రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని డీజీపీ తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా మాదకద్రవ్యాల ముఠాలు కొత్త దారులు వెతుకుతున్నాయని, వీటిని అణచివేసేందుకు 'ఈగల్ టీమ్స్' అద్భుతమైన కృషి చేస్తున్నాయని కొనియాడారు. డ్రగ్స్ సప్లయ్ చైన్‌ను దెబ్బతీయడంతో పాటు, యువత ఈ వ్యసనాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు కూడా చేపడతామని ఆయన వివరించారు.

**ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందడుగు**
సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ప్రస్తుతం తుది దశకు చేరుకుందని డీజీపీ వెల్లడించారు. గతంలో హైదరాబాద్ సీపీగా పనిచేసిన అనుభవంతో ఈ కేసు పూర్వాపరాలపై తనకు పూర్తి అవగాహన ఉందని చెప్పారు. ప్రస్తుతం సిట్ విచారణ చేస్తోందని, త్వరలోనే కేసును సమగ్రంగా సమీక్షించి కోర్టులో తుది ఛార్జిషీట్ దాఖలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బాధ్యులెవరైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని తేల్చిచెప్పారు.

**కుంట్లూరు నుంచి పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు**
రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ సమీపంలోని కుంట్లూరు గ్రామంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన సీవీ ఆనంద్, తన కష్టంతో ఈ స్థాయికి చేరుకున్నారు. తండ్రి దామోదర్ రెడ్డి ప్రభుత్వ అధికారి కావడంతో చిన్నతనం నుంచే ఆయనకు పాలనా అంశాలపై పట్టు ఏర్పడింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, నిజాం కాలేజీ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించిన ఆయన 1991లో ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే ఆయన, అట్టడుగు స్థాయి నుంచి వచ్చిన అనుభవంతో క్షేత్రస్థాయి సమస్యలపై మంచి అవగాహన కలిగి ఉన్నారు.

**సాహసాలకు కేరాఫ్ అడ్రస్.. సంస్కరణల ఆద్యుడు**
సీవీ ఆనంద్ తన సర్వీసులో అత్యంత క్లిష్టమైన మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పదేళ్ల పాటు పనిచేశారు. ప్రాణాలకు తెగించి అనేక ఆపరేషన్లలో పాల్గొన్నందుకు గాను 2002లో ఆయనను రాష్ట్రపతి గ్యాలెంటరీ మెడల్ వరించింది. కేవలం లా అండ్ ఆర్డర్ మాత్రమే కాకుండా, హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో ఆయన తెచ్చిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు, ఈచలాన్, స్పీడ్ గన్ వ్యవస్థలు దేశవ్యాప్త గుర్తింపు పొందాయి.

**మహిళా భద్రత - షీ టీమ్స్ రూపశిల్పి**
సైబరాబాద్ కమిషనర్‌గా పనిచేసిన కాలంలో ఐటీ కారిడార్‌లో మహిళలకు భద్రత కల్పించేందుకు ఆయన ప్రవేశపెట్టిన 'షీ టీమ్స్', 'షీ షటిల్స్' విజయవంతమయ్యాయి. అలాగే సిబ్బంది సంక్షేమంపై కూడా ఆయన ప్రత్యేక శ్రద్ధ కనబరిచేవారు. ఎండలో పనిచేసే కానిస్టేబుళ్లకు సన్ గ్లాసెస్ పంపిణీ చేయడం వంటి నిర్ణయాలు ఆయనకు సిబ్బందిలో మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. సీనియారిటీ ప్రాతిపదికన యూపీఎస్సీ పంపిన జాబితాలో మొదటి పేరుగా ఉన్న సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం ఎంపిక చేయడం పట్ల పోలీసు వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఎవరికీ రాసిచ్చిన జాగీరు కాదు

- **కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలపై డాక్టర్ రేఖ బోయలపల్లి ధ్వజం**

హైదరాబాద్ వెలుతురు మే 01:

"లెగసీ నాకే రాసిపెట్టింది, నేనే కంటిన్యూ చేస్తా" అంటూ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉన్నాయని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ రేఖ బోయలపల్లి తీవ్రంగా ఖండించారు. అధికారం అంటే ఒక కుటుంబం రాసిపెట్టుకున్న దస్తావేజు కాదని, అది ప్రజలు ఇచ్చే భిక్ష అని ఆమె గుర్తు చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రేఖ బోయలపల్లి మాట్లాడుతూ..

**వారసత్వం అంటే పదవులు కాదు - త్యాగాలు:**

"తెలంగాణ రాష్ట్రం వెయ్యి మంది అమరవీరుల బలిదానాల మీద, సోనియా గాంధీ గారు ఇచ్చిన మాట మీద ఏర్పడింది. ఇది ఒక కుటుంబం అనుభవించడానికి రాసిచ్చిన ఆస్తి కాదు. 'లెగసీ' గురించి మాట్లాడే కవిత గారు, తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను, నిరుద్యోగుల ఆవేదనను ఎందుకు విస్మరిస్తున్నారు?" అని ప్రశ్నించారు.

**ప్రజాస్వామ్యమా? రాజరికమా?:***

"నాకే రాసిపెట్టింది" అనడం కవిత గారి అహంకారానికి నిదర్శనం. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు కల్పించిన ఓటు హక్కుతో సామాన్యుడు కూడా పాలకుడయ్యే అవకాశం ఉంది. కానీ, బీఆర్ఎస్ నాయకులు ఇంకా రాజరికపు పోకడల్లోనే ఉండటం దురదృష్టకరం.

**సామాజిక న్యాయం ఎక్కడ?:**

ఒకే కుటుంబం చుట్టూ అధికారం తిరగడాన్ని వారసత్వం అనరు, దానిని ఫ్యూడల్ మనస్తత్వం అంటారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే స్థానిక సంస్థల్లో 42% బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ అట్టడుగు వర్గాలకు రాజకీయ వారసత్వాన్ని పంచుతోంది. అసలైన వారసత్వం అంటే సామాజిక న్యాయం అందించడం.

**ప్రజల తీర్పును గౌరవించండి:**

గత ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు వారసత్వ రాజకీయాలకు, కుటుంబ పాలనకు చరమగీతం పాడారు. ప్రజల తీర్పును గౌరవించకుండా ఇంకా "లెగసీ" అంటూ పాత పల్లవినే అందుకోవడం హాస్యాస్పదమని ఆమె ఎద్దేవా చేశారు.

తెలంగాణ సంపదను, అధికారాన్ని ఒకే కుటుంబం చేతుల్లో ఉంచాలని చూస్తే ప్రజలు ఊరుకోరని, కాంగ్రెస్ ప్రభుత్వం అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా 'ప్రజా పాలన' కొనసాగిస్తుందని డాక్టర్ రేఖ బోయలపల్లి స్పష్టం చేశారు.



డాక్టర్ రేఖ బోయలపల్లి
ఉపాధ్యక్షురాలు,
తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్.




## టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారి చేతుల మీదుగా అవార్డు అందుకున్న శ్రీజ్యోతి భీంభరత్

- **కార్మిక హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తా!**
- **శ్రీజ్యోతి భీమ్ భరత్ రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మరియు కార్మిక విభాగం గౌరవ అధ్యక్షురాలు.**

హైదరాబాద్ వెలుతురు మే 01:

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్మిక సంఘం ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షులు సంజీవ రెడ్డి మరియు టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు R ప్రకాష్ గౌడ్ గారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన భారీ సమావేశం లో పలువురు రాష్ట్ర స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రసంగించారు.

ఈ క్రమం లో రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మరియు జిల్లా కార్మిక విభాగం గౌరవ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ చేసిన కార్మిక సంక్షేమ పథకాల అవగాహనా కార్యక్రమాలకు, కార్మికుల, యాజమాన్యాల మధ్య కార్మిక సమస్యలు, అందులో ముఖ్యంగా మహిళా కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాల అవగాహనకు , సాధనకు చేసిన కృషికి గాను ఈ సమావేశం లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మరియు తెలంగాణ ప్రభుత్వ గౌరవ సలహాదారు , కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హనుమంతరావు గార్ల చేతుల మీదుగా సన్మాన సత్కారాన్ని అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో తనకు ప్రోత్సాహం అందించిన రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు ఆర్. ప్రకాష్ గౌడ్, ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి గార్లకు శ్రీజ్యోతి భీమ్ భరత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ లో కార్మికుల సమస్యలతో పాటు, మహిళా సమస్యల పై కూడా వారికి అవగాహన కల్పిస్తూ ప్రభుత్వానికి , కార్మికులకు మధ్య వారధిగా పని చేస్తానని పత్రికా ముఖంగా తెలిపారు.

# ఆయుష్ మంత్రిత్వశాఖ

## మరో 50 రోజుల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం2026

- **యోగా మహోత్సవానికి నేటి నుంచే తెలంగాణ సన్నద్ధం**
- **అత్యధిక యోగాభ్యాసకులతో భుజంగాసనం ద్వారా 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 'లో నమోదుకు చారిత్రక ప్రయత్నం**
- **కన్హా శాంతి వనం,**

హైదరాబాద్ వెలుతురు మే 01, 2026:

కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ (ఎండీఎన్ఐవై) 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి (ఐడీవై2026) సిద్ధమవుతోంది. ఈ మేరకు తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలోగల కన్హా శాంతి వనంలో 2026 మే 2 నుంచి 50 రోజులపాటు 'యోగా మహోత్సవ్2026'కు శ్రీకారం చుడుతుంది. హైదరాబాద్ సమీపంలోని ప్రపంచ ప్రసిద్ధ 'హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సెంటర్'కు నెలవైన కన్హా శాంతి వనంలోని ప్రశాంత ప్రాంగణం మహా క్రతువుకు ఆతిథ్యం ఇస్తుంది.

ఈ కార్యక్రమం నేటి ఉదయం 6:00 గంటల నుంచి ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా సార్వత్రిక యోగా విధివిధానాలు (సీవైపీ) అనుసరించే ఔత్సాహిక యోగాభ్యాసకులు ఈ మహా యజ్ఞంలో భారీగా పాల్గొంటారని అంచనా.

ఔత్సాహికులందరూ సామూహికంగా భుజంగాసన భంగిమను ప్రదర్శించడం ఈ కార్యక్రమ ప్రధాన ఆకర్షణ. 'ఐడీవై'నాడు ఈ ప్రదర్శన ద్వారా ఆసియా




బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించే చారిత్రక ప్రయత్నంలో భాగంగా వీరంతా 2వ తేదీనుంచి ఏకకాలంలోసమన్వయంతో సాధన చేస్తారు.

గౌరవనీయులైన కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి, కేంద్ర ఆయుష్ శాఖ (స్వతంత్ర బాధ్యతగల), ఆరోగ్యకుటుంబ సంక్షేమ శాఖల సహాయ మంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్ సహా హార్ట్‌ఫుల్‌నెస్ అధ్యక్షులు కమలేష్ డి.పటేల్ (దాజీ) ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఈ సందర్భంగా శ్రీ ప్రతాప రావు జాదవ్ యోగా మహోత్సవం గురించి వివరిస్తూ "రాబోయే 50 రోజుల ఈ ప్రస్థానాన్ని ఒక శక్తిమంతమైన సామూహిక సంకల్పంగా మలచుకోవాలని ప్రతి ఒక్కరికీ నా వినతి. యోగాభ్యాసాన్ని ఒక్క రోజుకే పరిమితం చేయరాదు... దైనందిన జీవనంలో అనుక్షణం మన ప్రతి శ్వాసలోనూ దాన్నొక భాగం చేసుకోవాలి. ఆరోగ్యకర కాయం, ప్రశాంత చిత్తం, శక్తియుతసుసంపన్న భారత్‌ను సాకారం చేసే దిశగా మనమంతా సమష్టిగా ఉద్యమిద్దాం" అని పిలుపునిచ్చారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేష్ కోటెచా, సంయుక్త కార్యదర్శి శ్రీమతి మోనాలిసా దాష్ సహా ఆ విభాగంలోని సీనియర్ అధికారులు, యోగా గురువులు సహా ఆయుష్ విధానాలను అనుసరించే ఆధునిక వైద్య నిపుణులు, దేశవ్యాప్తంగాగల యోగాభ్యాసకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

### స్వర్గీయ నాదెండ్ల భాస్కర్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించిన

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



హైదరాబాద్ వెలుతురు మే 01:

ఇటీవల పరమపదించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయవేత్త శ్రీ నాదెండ్ల భాస్కరరావు గారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

జూబ్లీహిల్స్ లోని వారి నివాసానికి వెళ్లి కుమారుడు సీనియర్ రాజకీయ వేత్త నాదేండ్ల మనోహర్ తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు..

నాదెండ్ల భాస్కరరావు 1984లో కొద్ది కాలం పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారని,. సుదీర్ఘ కాలం పాటు శాసనసభ్యుడిగా, మంత్రిగా ప్రజా సేవలో ఉన్న ఆయన రాజకీయాల్లో తనదైన ముద్ర వేసారని. వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతు సంక్షేమానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. భాస్కర రావు గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థించారు..



# రవీంద్రభారతిలో ఘనంగా మేడే వేడుకలు

- **హాజరైన మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు**

హైదరాబాద్, వెలుతురు మే 01:

తరాలు మారుతున్నా కార్మికుల తలరాతలు మారడం లేదని, యాజమాన్యాలు వారి పట్ల ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎంపీ గడ్డం వంశీ తదితరులతో కలిసి మంత్రి జూపల్లి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ..



సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు ఎన్ని చేసినా తక్కువేనన్నారు. ఏ రంగంలోనైనా శ్రమించే వ్యక్తిని తక్కువ చేసి చూడకూడదని, చేసే పనిని బట్టి గౌరవాన్ని నిర్ణయించవద్దని, కార్మికులను కుటుంబ సభ్యుల్లా భావించి అండగా నిలవాలి అని పేర్కొన్నారు. కేవలం చట్టాలు చేస్తే సరిపోదని, ప్రతి వ్యక్తిలోనూ, సంస్థలోనూ మానవీయ కోణంలో మార్పు రావాలని ఆకాంక్షించారు.


కార్మిక శాఖకు కేటాయించిన నిధులు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉన్న అర్హులైన కార్మికులందరికీ చేరేలా చూడాలని మంత్రి వివేక్ వెంకటస్వామికి ఆయన సూచించారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కార్మిక శాఖ మంత్రికి ఈ సందర్భంగా జూపల్లి కృతజ్ఞతలు తెలిపారు.

**జూన్ 2న 'ప్రభాతభేరి'**

సామాజిక రుగ్మతలను రూపుమాపడం ద్వారా సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకురావడమే లక్ష్యంగా జూన్ 2న 'ప్రభాతభేరి' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ దిశగా ఇప్పటికే సన్నహాలు వేగవంతం చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సెక్రటరీ దాసరి హరిచందన, కమిషనర్ పమేలా సత్పతి, కనీస వేతన సలహా మండలి చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్, వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# ॥జగద్గురు శ్రీ కంచి పరమాచార్య స్వాముల జయంతి॥



## ప్రసన్నకుమార్ శర్మ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి. జయ జయ శంకర హర హర శంకర

భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన, సనాతన ధర్మానికి జీవంత రూపంగా భావించబడిన జగద్గురు కంచి పరమాచార్య (శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వాములు) గారి జయంతి సందర్భంగా ఆయన మహోన్నత జీవితం, ఉపదేశాలు, సేవలను స్మరించుకుంటూ భక్తజనులు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

- **జననం – బాల్యం – ఆధ్యాత్మిక ప్రస్థానం**

శ్రీ పరమాచార్య గారు 1894 మే 20వ తేదీన తమిళనాడులోని విల్లుపురం లో జన్మించారు. బాల్యంలో స్వామినాథన్ అనే పేరుతో పిలువబడిన ఆయన చిన్న వయస్సులోనే అసాధారణ మేధస్సు, ధార్మిక చింతన, వినయంతో అందరినీ ఆకట్టుకున్నారు.
1907లో, కేవలం 13 సంవత్సరాల వయస్సులోనే ఆయన కాంచీ కామకోటి పీఠం యొక్క 68వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించడం భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో అరుదైన ఘట్టంగా నిలిచింది.

- **ఆధ్యాత్మిక సేవలు – పాదయాత్రలు – ధర్మ ప్రచారం**

పరమాచార్య గారు దాదాపు ఎనిమిది దశాబ్దాలపాటు పీఠాధిపత్య బాధ్యతలు నిర్వర్తిస్తూ దేశమంతటా పాదయాత్రలు చేశారు. గ్రామాలు, పట్టణాలు తిరుగుతూ వేద ధర్మాన్ని ప్రజల్లో విస్తరించారు. సాధారణ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను ఆలకించి మార్గనిర్దేశం చేయడం ఆయన ప్రత్యేకత.
వేదాలు, శాస్త్రాలు, సంస్కృత భాష పరిరక్షణకు ఆయన చేసిన కృషి అపారమైనది. వేద పాఠశాలలు స్థాపన, పండితులకు ప్రోత్సాహం, ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం వంటి కార్యక్రమాల ద్వారా భారతీయ సంస్కృతిని నిలబెట్టారు.

- **సాదాసీదా జీవితం – ఉన్నత ఆలోచనలు**

శ్రీపరమాచార్యగారిజీవనవిధానంఅత్యంతసరళమైనది.తక్కువఅవసరాలతోజీవిస్తూ,అత్యున్నతఆధ్యాత్మికస్థాయినిసాధించినమహానుభావుడుఆయన.
"సరళ జీవనం - ఉన్నత ఆలోచనలు" అనే సిద్ధాంతాన్ని ఆచరణలో చూపించారు.
అహింస, సత్యం, సేవ, క్షమ, సహనం వంటి విలువలను ఆయన ప్రజలకు బోధించారు. అన్ని మతాల పట్ల గౌరవ భావన కలిగి ఉండాలని సూచించారు.

- **సమాజ సేవ – మార్గదర్శకత్వం**

పరమాచార్య గారు కేవలం ఆధ్యాత్మిక గురువే కాకుండా సమాజ సంస్కర్త కూడా. సామాజిక సమానత్వం, నీతి, నైతిక విలువలపై ఆయన చేసిన బోధనలు అనేక తరాలకు మార్గదర్శకంగా నిలిచాయి.
ఆయన ఆశీస్సులతో అనేక విద్యా, ధార్మిక, సేవా కార్యక్రమాలు అభివృద్ధి చెందాయి. ఆయన సన్నిధిలోకి వచ్చిన ప్రతి వ్యక్తి తన జీవితంలో మార్పు పొందినట్లు భావించారు.

- **బ్రహ్మలీనత – శాశ్వత వారసత్వం**

1994 జనవరి 8న శ్రీ పరమాచార్య గారు బ్రహ్మలీనమయ్యారు. అయినప్పటికీ ఆయన బోధనలు, ఆలోచనలు, ధర్మ మార్గదర్శకత్వం నేటికీ కోట్లాది మంది హృదయాల్లో జీవిస్తుంది.

- **ముగింపు సందేశం**

కంచి పరమాచార్య గారి జయంతి సందర్భంగా, ఆయన చూపిన ధర్మ మార్గాన్ని మనం అనుసరించడం ద్వారా వ్యక్తిగతంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా ఎదగగలుగుతాము.
ఆయన జీవితం మనకు శాంతి, సహనం, సేవా భావం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుంది.
"ధర్మం నిలిస్తే సమాజం నిలుస్తుంది" అనే సందేశాన్ని అందించిన పరమాచార్య గారికి శత కోటి వందనాలు



ప్రసన్నకుమార్ శర్మ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి.

# ఈ జీవనతరంగాలలో ఆ దేవుని చదరంగంలో !

జీవితాన్ని తరంగాలతో పోల్చడం కొత్తేమీ కాకపోవచ్చు, కానీ జీవనతరంగాలు అన్న పదంలో ఒక రకమైన ఆర్తి ఉంది. సముద్ర తీరాన నిలబడి గమనిస్తే, ఏ అల కూడా మరో అలలా ఉండదు. ఒకటి నెమ్మదిగా పాదాలను తాకి వెళ్తుంది, మరొకటి ఉవ్వెత్తున లేచి భయపెడుతుంది. మన జీవితం కూడా సరిగ్గా ఇంతే! ఒకరోజు సంతోషపు జల్లు కురిస్తే, మరుసటి రోజే దుఃఖపు సుడిగుండం పలకరిస్తుంది.అయితే, ఇక్కడ మనం గమనించాల్సిన ఒక అద్భుతమైన సత్యం ఉంది. అలలు ఎన్ని వచ్చినా సముద్రం మాత్రం కదలదు. పరిస్థితులు అనేవి అలలైతే, మన ఆత్మ ఆ మహా సముద్రం వంటిది. కష్టసుఖాల తాకిడికి పైపైన అలజడి కలిగినా, అంతరాంతరాల్లో మనం ఆ చైతన్య స్వరూపులమే అని ఈ కవితా చరణం మనకు సున్నితంగా గుర్తుచేస్తుంది. తరంగం అనేది అశాశ్వతం, కానీ జలం శాశ్వతం. ఈ సత్యాన్ని గ్రహించిననాడు, జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లు మనల్ని అంతగా గాయపరచలేవు.ఇక రెండో రూపకం మరింత గంభీరమైనది దేవుని చదరంగం . చదరంగం అంటేనే ఎత్తులు, పైఎత్తులు, వ్యూహాలు మరియు ప్రతివ్యూహాల సమాహారం. ఈ ఆటలో ప్రతి పావుకు ఒక ప్రత్యేక శక్తి ఉంటుంది. గుర్రం ఒకలా దూకితే, ఏనుగు మరోలా కదులుతుంది. కానీ, ఏ పావు కూడా తనంతట తాను కదలలేదు. వెనుక ఉండి నడిపించే ఒక చేయి , ఒక మెదడు ఉంటాయి.

మనం తరచుగా నా జీవితం నా ఇష్టం, నేనే నా భవిష్యత్తును రాసుకుంటాను అని విర్రవీగుతుంటాం. కానీ, ఒక్కసారి ఆలోచించండి మనం ఎక్కడ పుట్టాలి, ఎవరికి పుట్టాలి, ఏ కాలంలో ఉండాలి అన్నది మన నిర్ణయమా? కాదు. ఆ చదరంగం బోర్డు మీద మనం ఎక్కడ నిలబడాలి అనేది ఆ పరమాత్మ నిర్ణయిస్తాడు. మనకు తెలిసింది కేవలం మన తదుపరి అడుగు మాత్రమే, కానీ ఆ ఆటగాడికి పూర్తి ఆట మీద పట్టు ఉంటుంది. మనం ఎందుకు ఓడిపోతున్నామో, ఎందుకు వెనక్కి తగ్గాల్సి వస్తుందో ఆ క్షణాన మనకు అర్థం కాకపోవచ్చు. కానీ ఆ గ్రేట్ గ్రాండ్ మాస్టర్ దృష్టిలో అది ఒక పెద్ద విజయానికి నాంది కావచ్చు.ఈ చరణం మనల్ని ఒక చిక్కుప్రశ్నలో పడేస్తుంది అంతా దేవుడే ఆడిస్తుంటే మన ప్రమేయం ఏముంది? ఇక్కడే అసలైన తాత్వికత దాగి ఉంది. చదరంగంలో పావు కదలకపోతే ఆట ముందుకు సాగదు. అంటే, మనం నిమిత్త మాత్రులం అయినప్పటికీ, క్రియాశీలం గా ఉండాలి. దేవుడు దారి చూపిస్తాడు, కానీ నడవాల్సింది మనమే.తరంగాలు ప్రకృతి సిద్ధం, కానీ ఆ అలల మీద ప్రయాణించే పడవను ఎలా నడపాలన్నది మన నైపుణ్యం. లోకం నిరంతరం మారుతూ ఉంటుంది (తరంగాలు), కానీ ధర్మం అనే చదరంగం పలక ఎప్పుడూ స్థిరంగా ఉంటుంది. చదరంగంలో ఒక చిన్న పావును కోల్పోవడం అనేది రాణిని గెలవడానికి వేసే ఎత్తుగడ కావచ్చు. అలాగే, జీవితంలో మనం కోల్పోయేవి మనల్ని మరిన్ని గొప్ప విజయాలకు సిద్ధం చేస్తాయి. తెలుగు వారి రక్తంలోనే భక్తి, తర్కం కలిసిపోయి ఉంటాయి. వేమన పద్యాల నుండి అన్నమయ్య సంకీర్తనల వరకు అందరూ చెప్పింది ఇదే అంతా నీవే అని. ఈ జీవనతరంగాలు అనే మాట వినగానే సామాన్యుడి నుండి పండితుడి వరకు అందరికీ ఒకే రకమైన అనుభూతి కలుగుతుంది. ఎందుకంటే ఇది కేవలం భాష కాదు, ఇది మన సంస్కృతిలోని ఒక జీవన సూత్రం. నిమిత్తమాత్రం భవ సవ్యసాచి అన్న భగవద్గీత సారాన్ని ఈ చిన్న చరణం అతి సరళంగా మన గుండెల్లోకి చేరవేస్తుంది.ఆధునిక కాలంలో మనం ఒత్తిడితో, ఆందోళనతో సతమతమవుతున్నాం.



రేపు ఏమవుతుందో? అన్న భయం మనల్ని వెంటాడుతోంది. ఇలాంటి సమయంలో ఈ చదరంగపు రూపకం ఒక గొప్ప ఔషధంగా పనిచేస్తుంది. మనం ఆ దేవుని చేతిలో పావులమని నమ్మినప్పుడు, మన భారం తగ్గిపోతుంది. దీనినే ఆధ్యాత్మిక పరిభాషలో శరణాగతి అంటారు. శరణాగతి అంటే చేతులు ఎత్తేయడం కాదు, ఆ సర్వేశ్వరుని మీద అచంచలమైన విశ్వాసం ఉంచడం. ఆయన నన్ను నడిపిస్తున్నాడు, ఆయన వ్యూహం తప్పు కాబోదు అని నమ్మినప్పుడు మనిషికి కొండంత ధైర్యం వస్తుంది. అలలు ముంచెత్తుతున్నప్పుడు భయపడకుండా, ఆ అలల వెనుక ఉన్న సముద్రుడిని స్మరించుకోవడమే జీవన కళ.
కేవలం ఆధ్యాత్మికంగానే కాకుండా, మానసిక శాస్త్ర పరంగా కూడా ఈ దృక్పథం ఎంతో అవసరం. మన జీవితానికి ఒక అర్థం (Meaning) ఉందన్న స్పృహ మనిషిని ఆత్మహత్యల నుండి, నిరాశ నుండి కాపాడుతుంది. నేను ఒంటరిని కాను, ఈ విశ్వంలోని ఒక మహత్తర ప్రణాళికలో నేను కూడా ఒక ముఖ్యమైన పాత్రను అని అనుకోవడం వల్ల కలిగే మానసిక ప్రశాంతత అమూల్యమైనది. కష్టాలు ఎదురైనప్పుడు అది ఒక శిక్ష అని భావించకుండా, చదరంగంలో ఒక మలుపు అని భావిస్తే మన ఆలోచనా తీరులో విప్లవాత్మకమైన మార్పు వస్తుంది.ఈ చరణం ఇంత ప్రభావాన్ని చూపడానికి కారణం అందులోని పదాల ఎంపిక. కవి ఎంతటి దార్శనికుడైతే తప్ప ఇలాంటి పద ప్రయోగాలు చేయలేరు!జీవనతరంగాలు,ఇందులో ఒక లయ ఉంది, ఒక నిరంతర ప్రవాహం ఉంది. దేవుని చదరంగం ,ఇందులో ఒక క్రమశిక్షణ ఉంది, ఒక గమ్యం ఉంది. ఈ రెండింటినీ కలపడం ద్వారా జీవితంలోని అనిశ్చితిని (Uncertainty) మరియు దైవ సంకల్పంలోని నిశ్చితత్వాన్ని (Certainty) ఒకే చోట ఆవిష్కరించారు.చివరగా, ఈ జీవనతరంగాలలో ఆ దేవుని చదరంగంలో మనం నేర్చుకోవాల్సిన పాఠం ఒక్కటే జీవితాన్ని ఒక ఆటగా చూడండి, కానీ బాధ్యతగా ఆడండి. అలలు వస్తుంటాయి, పోతుంటాయి. గెలుపోటములు దైవ నిర్ణయమే కావచ్చు, కానీ ఆ ఆటలో భాగమవ్వడం మన అదృష్టం. ఆ మహాశక్తి స్పర్శ మనపై ఉన్నంత వరకు మనం ఎప్పటికీ ఓడిపోము.జీవితం అనే చదరంగంలో మన అడుగులను ఆ దేవుడికి అంకితం చేద్దాం. అలల తాకిడికి తలవంచకుండా, ఆ అలల మీద ప్రయాణిస్తూ గమ్యాన్ని చేరుకుందాం. ఎందుకంటే, ఈ ఆటలో మనం కేవలం ఆటగాళ్ళమే కాదు, ఆ పరమాత్మకు అత్యంత ప్రియమైన పావులం కూడా! ఈ నమ్మకమే మనల్ని చీకటి నుండి వెలుగులోకి, అశాంతి నుండి అనంతమైన శాంతిలోకి నడిపిస్తుంది



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## బాలానగర్ పారిశ్రామిక వాడలో ఘనంగా మేడే వేడుకలు..

- **కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ నేతల స్పష్టం..**

కూకట్ పల్లి, మే 1 వెలుతురు:



కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ పారిశ్రామిక వాడలో మేడే కార్మికుల దినోత్సవాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల ప్రాంతంలో ఎర్ర జెండాలు ఎగురవేసి కార్మికుల ఐక్యతను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు కామ్రేడ్ బిన్ సుదర్శన్, మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికుల హక్కుల కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుల స్ఫూర్తితో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులను కట్టుబానిసలుగా మార్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యాల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ, కార్మికుల సమస్యలను విస్మరిస్తోందని విమర్శించారు. కార్మికులు సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని పక్కనబెట్టి 12 నుంచి 16 గంటల పనిదినాలను అమలు చేయాలని ప్రయత్నించడం దుర్మార్గమని పేర్కొన్నారు. దేశంలో యుద్ధ పరిస్థితులను కారణంగా చూపుతూ ప్రజలను మోసం చేస్తున్నారని, మేడే రోజునే గ్యాస్ ధరలు పెంచడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశముందని హెచ్చరించారు. ఈ పెరుగుదలలు కార్మికులు, వ్యవసాయ కూలీలపై తీవ్ర భారం మోపుతున్నాయని అన్నారు. దేశంలో ఆర్థిక సంక్షోభం నెలకొంటోందని, కేంద్ర ప్రభుత్వం దేశాన్ని వెనుకబాటుతన దిశగా నడిపిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. అఖిలపక్షాలను కలుపుకుని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం. శంకర్, ఏ. విజయ, పి. శంకర్, చైతన్య, సబియా, మంజుల, బి. రాము, హరి కృష్ణ, అంజి, మల్లేష్, యాదవ రెడ్డి, రాజు, నాగేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి రామాలయంలో వైభవంగా శ్రీ గరుడ, హనుమద్ మూర్తుల ప్రతిష్ఠ..

- **చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా కుంభ ప్రోక్షణ... తరలివచ్చిన భక్తజనం**

కూకట్ పల్లి మే 1 వెలుతురు:









చారిత్రక నేపథ్యం ఉన్న కూకట్‌పల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం మరో అద్భుత ఘట్టానికి వేదికైంది. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన 27 అడుగుల ఏకశిలా శ్రీ గరుడ, హనుమద్ మూర్తుల స్థాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి అమృత హస్తాలతో కుంభ ప్రోక్షణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించబడింది.

**ఆధ్యాత్మిక శోభతో పులకించిన ప్రాంగణం..**

గత నెల 22వ తేదీ నుంచి ఆలయ వద్ద కొనసాగుతున్న యజ్ఞ యాగాదులు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం శాంతి పాఠం, మూలమంత్ర హవనాలు, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం చిన్న జీయర్ స్వామి గరుడ, హనుమద్ మూర్తులకు కుంభ ప్రోక్షణ గావించి, భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ అద్భుత మూర్తుల స్థాపనతో కూకట్‌పల్లి రామాలయానికి మరింత ఆధ్యాత్మిక వైభవం చేకూరింది. స్వామివారి సేవలో తరించే గరుడ, హనుమంతుల ఇతివృత్తం భక్తులకు స్ఫూర్తిదాయకం అన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులకు, ఆలయ కమిటీ సభ్యులకు స్వామివారు మంగళాశాసనాలు అందజేశారు.

**440 ఏళ్ల నాటి ఆలయ పునర్నిర్మాణం: ఎమ్మెల్యే మాధవరం..**

స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ 440 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయాన్ని అందరి సహకారంతో పునర్నిర్మించుకోవడం తమ అదృష్టమని పేర్కొన్నారు. 27 అడుగుల ఏకశిలా విగ్రహాల ప్రతిష్ఠాపన చిన్న జీయర్ స్వామి వారి చేతుల మీదుగా జరగడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆ సీతారామచంద్రులను ప్రార్థించినట్లు తెలిపారు.

**కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం****

విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవం, పట్టాభిషేకం కన్నుల పండువగా జరిగాయి. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**ప్రముఖుల హాజరు:**

ఈ ఆధ్యాత్మిక వేడుకలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, రామాలయ మాజీ చైర్మన్ నాయినేని శ్రీనివాస రావు (తులసి రావు), మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు, బిఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, పండాల సతీష్ గౌడ్, పగుడాల బాబురావు, ఆవుల రవీందర్ రెడ్డి, నాయినేని సూర్యరావు, కారంగుల రాజేశ్వరరావు సహా ఆలయ కమిటీ సభ్యులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

---

అంతర్జాతీయ కార్మికుల దినోత్సవ వేడుకలలో పాల్గొన్న

## మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ .



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 01:

అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మే 1 పురస్కరించుకొని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కొలుకుల జగన్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ప్రాణ త్యాగాల వలన ఏర్పడిన కార్మికుల హక్కుల చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయమైన కార్మికుల హక్కుల కోసం ప్రశ్నించాల్సిన అవసరం ప్రతి కార్మికులపై ఉందని తెలిపారు .ఈ కార్యక్రమంలో కొలుకుల జైహింద్,పాపయ్య గౌడ్, మల్లారెడ్డి, హనుమంతు, పాపిరెడ్డి, యాదగిరి,సిహెచ్ దాసు, బ్రహ్మానందం చారి, మనోజ్, ఎర్ర సైదులు,నరసింహారెడ్డి, బసవేశ్వర్,వెంకటేష్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలో మేడే సందర్భంగా ఎగిరిన ఎర్రజెండాలు

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 01:

141 వ మే డే సందర్భంగా నేడు కుత్బుల్లాపూర్ మండలంలోని అన్ని ప్రాంతాలలో సిపిఐ మరియు ఏఐటియుసి ఆధ్వర్యంలో అరుణ పతాకని మే డే ని ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది.

లెనిన్ నగర్,శ్రీనివాస్ నగర్, మక్దుమ్నగర్,బీరప్ప నగర్, అంజయ్య నగర్, జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్, రాజీవ్ గృహకల్ప, రాంకీ, గుబురు గుట్ట, గిరీనగర్,గాంధీ నగర్,రంగారెడ్డి నగర్, ఐడిపిఎల్ ఆటో స్టాండ్,ఈఎస్ఐ హాస్పిటల్, షాపూర్ నగర్ హమాలీ అడ్డ, షాపూర్ నగర్ పొట్లూరి నాగేశ్వరరావు భవన్, ప్రీమియర్ కంపెనీ, కేకులే,సత్య ఫ్యాబ్రికేషన్, తదితర ప్రాంతాలలో మేడే సందర్భంగా ఎర్రజెండాలను ఎగురవేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పాల్గొని ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారని రోజురోజుకు పెరుగుతున్న ధరలు నిరుద్యోగం సమస్యల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం కమ్యూనిస్టు పార్టీనే అని భావిస్తూ కమ్యూనిస్టు పార్టీ వైపు చూస్తున్నారని దానికి అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీ



కార్యకర్తలు మరియు ఏఐటియుసి నాయకత్వం పనిచేయాలని అప్పుడు మనం కోరుకునే సమసమాజం ఏర్పడుతుందని అన్నారు. మే డే సందర్భంగా చికాగొ అమరవీరుల స్ఫూర్తిని ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న సందర్భంలో మరోసారి కార్మికులంతా ఏకమై కార్మిక రాజ్యం కోసం పోరాటం చేయాలని కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమాలకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు స్వామి నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్ రావు నాయకత్వం వహించగా ప్రజానాట్యమండలి కళాకారులు పాటలు పాడి ఉత్తేజ నింపడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసురత్నం, మహిళా సమైక్య అధ్యక్షురాలు హైమావతి,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షు లు ప్రవీణ్ మండల అధ్యక్ష కార్యదర్శులు బాబు భాస్కర్ కృష్ణ, యువజన సమైక్య అధ్యక్షులు సంతోష్ రెడ్డి, నాయకులు సదానంద్, మాజీ కౌన్సిలర్ నర్సయ్య, వీరస్వామి, సంతోష్, సుధాకర్, సహదేవరెడ్డి, సామెల్, ముసలయ్య, కీర్తి,నరసింహ రెడ్డి,సుంగిరెడ్డి, శ్రీనివాస్, సామెల్,ముసలయ్య, నరసయ్య, మధు, రాజు, ఇమామ్, యాదగిరి, జావేద్,జహంగీర్, ఆదిల్, చందు, పూర్ణచందర్, యాదగిరి,ప్రకాష్, దుర్గాప్రసాద్, భీమేష్, బక్కరి, మల్లేష్, శ్రీనివాస్, మజ్జి గౌరీ,రమేష్,కృష్ణ కమలమ్మ చంద్రావతి జ్యోతి లతోపాటు వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

# కార్మికుల గౌరవమే దేశాభివృద్ధి పునాది

- **మేడే వేడుకల్లో కార్మికులకు జనసేన ఘన సత్కారం**

కూకట్ పల్లి మే 1 వెలుతురు:



అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా శ్రమజీవుల కష్టానికి గౌరవం తెలియజేస్తూ కూకట్ పల్లి, మోతీనగర్ లో ఘనంగా శుక్రవారం మే డే వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎస్బీఐ బిల్డింగ్ ఎదుట ఉన్న ఈసేవ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమం కార్మికులకు అంకితమై, ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. జనసేన నాయకుడు దుట్టా రవీంద్రనాథ్ ఠాగూర్ ఆహ్వానం మేరకు, జనసేన పార్టీ సైబరాబాద్ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జీహెచ్ఎంసీ కార్మికులను ఘనంగా సత్కరించారు. వారి సేవలను గుర్తిస్తూ చీరలు, పండ్లు పంపిణీ చేసి కార్మికుల పట్ల తమ కృతజ్ఞతను తెలిపారు. ప్రత్యేక అతిథులుగా హాజరైన డ్రైవ్ సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యనిర్వాహకులు పర్చూరు వెంకటరావు, రిటైర్డ్ పోలీస్ అధికారి వెంకటదాసు కార్మికులకు అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ, దేశ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని, వారి కష్టానికి గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మే డే అనేది కేవలం పండుగ మాత్రమే కాకుండా, కార్మికుల హక్కులు, గౌరవం, సమానత్వం కోసం జరిగిన పోరాటాలకు ప్రతీక అని అన్నారు. జనసేన పార్టీ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కలిగినీడి ప్రసాద్, పోలెబోయిన శ్రీనివాస్, సుబ్బారావు, పడాల ప్రసాద్, శేషు కుమారి, సాయి ప్రియ, సాయి వాసవి, మండల కాళేశ్వరరావు, ఎనుముల రాంబాబు, చలమశెట్టి విశ్వేశ్వరరావు, పి. సైదులు, పి. కృష్ణ చౌదరి, కే. సుదర్శన్ రెడ్డి, రావుల సీనయ్య చారి, కే. రమణ చారి, పి. మోహన్ ముదిరాజ్, కే. మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

---

# కూకట్ పల్లిలో అంగరంగ వైభవంగా ఆధ్యాత్మిక మహోత్సవం...

- **భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా రామాయణ మహా యజ్ఞం ముగింపు..**
- **చిన్న జియర్ స్వామి చేతుల మీదుగా మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం**

కూకట్ పల్లి, మే 1 వెలుతురు:





శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో భక్తి పారవశ వాతావరణంలో నిర్వహించిన శ్రీ రామాయణ మహా యజ్ఞం కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ గరుడ, హనుమద్ మూర్తుల స్థాపన ప్రయుక్తంగా నిర్వహించిన పాంచాహ్నిక అష్టకుండాత్మక యజ్ఞంలో భాగంగా, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జియర్ స్వామి ఏప్రిల్ 30 రాత్రి దేవాలయానికి విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకుని భక్తులకు ఆధ్యాత్మిక సందేశాలతో ప్రవచనం అందించారు.మహోత్సవాల చివరి రోజు అయిన మే 1న చిన్న జియర్ స్వామి కరకములచే మహా పూర్ణాహుతి నిర్వహించగా, అనంతరం శ్రీ గరుడ, హనుమద్ మూర్తుల మహా కుంభాభిషేకం వైభవంగా జరిగింది. అలాగే శ్రీ సీతారాముల శాంతి కళ్యాణం, పట్టాభిషేకం కార్యక్రమాలు కూడా శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ శ్రీనివాసరావు (తులసిరావు) దంపతులతో కలిసి మాజీ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరై, యజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

## శక్తితో మన సమాజాన్ని నిర్మించే కార్మికుల కఠోర శ్రమతో జరుపునే వేడుక మేడే : కార్మిక నాయకులు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద.



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 01:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ డి.పోచంపల్లిలోని ఆల్కాలి మెటల్స్ లో మేడే కార్యక్రమాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ కార్మిక విభాగం అద్వర్యంలో నిర్వహించిన యూనియన్ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి కార్మిక విభాగం సలహాదారులు, బీఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే, కెపి వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మే డే అనేది తమ శక్తితో మన సమాజాన్ని నిర్మించే కార్మికుల కఠోర శ్రమ, అంకితభావం మరియు త్యాగాలకు జరుపుకునే వేడుక. పరిశ్రమలు కార్మికుల హక్కులను గౌరవించాలని, న్యాయమైన వేతనాలను అందించాలన్నారు. ఈ సందర్భంగా కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్కలి మెటల్స్ యూనియన్ నూతన అధ్యక్షులు & మాజీ కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్లు బి. మహేందర్, ఎండి. సిద్దిక్, కె.వీరాస్వామి, ఉపాధ్యక్షులు నరేష్ చారి, సతీష్, కోశాధికారి బాలరాజు, జాయింట్ సెక్రటరీ లో బసవ చారి, శీను, యూనియన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, కోల సాయి యాదవ్, పాక్స్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, డైరెక్టర్ జీతయ్య, సీనియర్ నాయకులు కోర్వి రాము, వార్డు ప్రెసిడెంట్ సుదర్శన్, నాయకులు వేణు గౌడ్, శ్రీకాంత్ యాదవ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**వివేకానంద నగర్ లో ఘనంగా మే డే వేడుకలు..**



- **కార్మికులకు శాలువాలతో సన్మానం, ఐక్యత సందేశం**

కూకట్ పల్లి మే 1 వెలుతురు:

శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని రామకృష్ణ వీధిలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురంధర్ రెడ్డి, కార్యదర్శి ఆర్. రామచంద్ర రావు ఆధ్వర్యంలో కాలనీవాసులు, వెల్ఫేర్ కమిటీ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ వేడుకలకు మున్సిపల్ కార్మికుడు జవాన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కార్మికులతో కలిసి కేక్ కట్ చేయించి, స్వీట్లు పంచిపెట్టడం ద్వారా వారికి గౌరవం తెలిపారు.

ఈ సందర్భంగా అధ్యక్షుడు పురంధర్ రెడ్డి మాట్లాడుతూ, తమ కాలనీలో ప్రతి ఏడాది సుమారు 50 మంది కార్మికులను శాలువాలతో సన్మానించి, వారి సమక్షంలో మే డే వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. కార్మికులను తమ సోదర సోదరీమణులుగా భావిస్తూ, కాలనీ అభివృద్ధికి వారితో కలిసి పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కార్మికులు రమేష్ నాయక్, విజయ్, అప్పలరాజు, శ్రీనివాస్, మహిళా కార్మికులు అనసూయమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే కమిటీ సభ్యులు సూర్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, సునీల్ పటేల్, కిషోర్, జలంధర్ రెడ్డి, శ్రీధర్, నరేందర్ రెడ్డి, మూర్తి, టైగర్ పురుషోత్తం తదితరులు పాల్గొని కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జగద్గిరిగుట్ట కాకతీయ హైస్కూల్లో పదవ తరగతి 2026 పరీక్ష ఫలితాల్లో ప్రభంజనం..

కూకట్ పల్లి, మే 01 వెలుతురు:



పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఎప్పుడూ ముందుండి తనకంటూ ఒక ప్రత్యేక సత్తా చాటిన జగద్గిరిగుట్ట కాకతీయ టెక్నో స్కూల్లో ఈ సారి చరిత్రలో మొదటిసారి గా 583 మార్కులు సాధించి తన ప్రతిభను చాటిన విద్యార్థిని దొగిపర్తి దేదీప్య. ఈ సందర్భంగా ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను స్కూల్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ప్రథమ స్థానంలో నిలిచి 583 మార్కులు సాధించిన దోగిపర్తి దేదీప్య ను వారి తల్లిదండ్రులు దోగిపర్తి శ్రీనివాస్ నాగమణిలను, ద్వితీయ స్థానంలో నిలిచి 561 మార్కులు సాధించిన పద్దాని వెన్నెల వారి తల్లిదండ్రులు పద్దాని జనార్ధన్ నిర్మలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ మాట్లాడుతూ నిరంతరం అధ్యాపకుల కఠోర శ్రమ విద్యార్థుల కృషి పట్టుదల తల్లిదండ్రుల ప్రోత్సాహం అందరి సమిష్టి కృషి వల్ల ఈ ఫలితాలు వచ్చాయని అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వీరితోపాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు పూర్తిస్థాయి ఉత్తీర్ణత శాతం సాధించినందుకు అధ్యాపకులకు విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానంలో నిలుస్తారని భవిష్యత్తులో సాధించే ఘనవిజయాలు వారిని సమాజంలో ఉన్నత స్థానంలో నిలబడతాయని అటువంటి భవిష్యత్తు వారికి రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ పి తిరుపతి రావు,ఎ రామేశ్వర్ రావు, పి.సురేష్, ఎస్ శ్రీధర్, రవీంద్ర బాబు, ప్రిన్సిపాల్ కె.ఎస్. ఎన్.మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ టి.పరమేశ్వరి, పి.కవిత ఎం.దుర్గా భవాని, మేరీ,విజయలక్ష్మి, ఆనంద్ మదిలెట్టి, సింధూర్ ప్రబంధన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రమజీవుల సంక్షేమమే సమాజ సమృద్ధికి మార్గం

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 01:



అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం 129 సూరారం డివిజన్ నెహ్రూ నగర్ లో శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో కమిటీ చైర్మన్ మరియు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కార్మిక యూనియన్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటైన కార్మిక సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన లెటర్ హెడ్ ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రమజీవుల సంక్షేమమే సమాజ సమృద్ధికి మార్గమని, అందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో సలహాదారులు, మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, సలహాదారులు & డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, అధ్యక్షులు బి. కిరణ్ సాగర్, ఉపాధ్యక్షులు విటల్ యాదవ్, నాగరాజు, ప్రధాన కార్యదర్శి బాపూజీ, రాజు సాగర్, కోశాధికారి దుర్గయ్య, సయ్యద్ అక్బర్, ఈ.సహదేవ్, నాయకులు సిద్ధిక్, ఫిరోజ్, అఖిల్, నవీన్, దశరథ్, ప్రశాంత్, ముకుందం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలి



- **సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులుగా యరుకల యతీశ్వర్ గౌడ్ ఎన్నిక**
- **తెలంగాణ సర్పంచ్ ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ, గౌరవ అధ్యక్షులు యాదయ్య గౌడ్ వెల్లడి**

హైదరాబాద్ వెలుతురు మే 01:

స్థానిక సంస్థల ద్వారా ఎన్నికయ్యే ఎమ్మెల్సీ ఎన్నికలలో గ్రామ సర్పంచ్ లకు కూడా ఓటు హక్కు కల్పించాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ,గౌరవ అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్.

నేడు హైదరాబాదులో జరిగిన తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి సుర్వి యాదయ్య గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా సర్పంచ్ ల హక్కుల కోసం పోరాడుతున్న యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల్ రాఘవాపురం గ్రామ సర్పంచ్ అయినా ఎరుకల యతీశ్వర గౌడ్ ను తెలంగాణ సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సుర్వి యాదయ్య గౌడ్ ప్రకటించారు

ఈ సందర్భంగా సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ద్వారా ఎన్నుకోబడే శాసనమండలి సభ్యుల ఓటు హక్కు విషయంలో ఎంపీటీసీ, జడ్పిటిసి లకు ఓటు హక్కు కల్పించి గ్రామ సర్పంచులకు కల్పించకపోవడం చాలా అన్యాయం అన్నారు అదేవిధంగా సర్పంచుల గౌరవ వేతనం కూడా 50 వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు

గ్రామ సర్పంచ్ల వద్ద పనిచేసే గ్రామపంచాయతీ స్వీపర్ కు 10 వేల నుండి 15వేల వరకు ఇస్తున్న ప్రభుత్వం సర్పంచులకు మాత్రం 6500 రూపాయలు మాత్రమే ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని యాదయ్య గౌడ్ ప్రశ్నించారు,

తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన ఎరుకల యతీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఎంతో విశ్వాసంతో రాష్ట్ర బాధ్యతలు నాపై ఉంచినందుకు రాష్ట్ర సర్పంచులకు ధన్యవాదాలు తెలిపారు ఇదే సమయంలో ప్రజలతో ప్రత్యక్షంగా ఎన్నికైన గ్రామ సర్పంచులకు, పరోక్షంగా ఎన్నికైన ఉపసర్పంచ్ లకు జాయింట్ చెక్ పవర్ కల్పించడం చాలా దారుణమని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ చెక్ కవర్ ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు, సర్పంచుల హక్కుల కోసం భవిష్యత్తులో రాజీ లేకుండా పోరాటం చేస్తానని యతేశ్వర్ గౌడ్ తెలిపారు కాగా నూతనంగా సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షునిగా ఎన్నికైన యతేశ్వర్ గౌడ్ ను సర్పంచ్ సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార సమితి అధ్యక్షులు బత్తిని రాజు గౌడ్, మాజీ సర్పంచ్ల సంఘం రాష్ట సలహాదారులు ఘనగాని మల్లేష్, గొడుగు మహేష్ యాదవ్, తాటికొండ విక్రం, మహేష్ మేరు, ప్రవీణ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా ఆరుట్ల గ్రామంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు



మంచాల వెలుతురు మే 01:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మార బుగ్గ రాములు మండల కమిటీ సభ్యులు పుల్లగల్ల గోపాల్ గార్లు మాట్లా డుతూ కార్మికులు తన హక్కుల కోసం1886లో చికాగో నగరంలో మే 1న జరిగిన పోరాటంలో తుటాలకు బలై క్షతగాత్రులై వారి చొక్కాలను రక్తం మాడుగులో నుండి ఎగురావేసినదే ఈ ఎర్ర జెండా అన్నారు కార్మికుల హక్కులను ఈ ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. పోరాటాల ద్వా రానే తన హక్కులను సాధించుకోవాలి అని అన్నారు ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయ కులు జోగు శేఖర్ మాజీ కోఅప్షన్ సభ్యులు యూసఫ్ అలీ నూకం రవి బోయపల్లి అంజయ్య బ డ్డు విజయ్ అనుపాటి గణేష్ అనంగాళ్ల అశోక్ సాతిరి నర్సింగ్ రావు చిందం బీరప్ప ఎర్పుల వీ రేష్ జోగు పాపయ్య, కొండిగారి శంకరయ్య సాతిరి సత్తయ్య, చిందం బుచ్చయ్య లాలగారి యా దయ్య, తిమ్మాగాళ్ల గాలయ్య చీమర్ల ము త్తయ్య ఎర్పుల వినోద్ అనుపాటి యాదయ్య జోగు వి నోద్, చీమర్ల చింటూ ఓరుగంటి దర్శన్ మరియు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడపడుచు వివాహానికి ఆర్థిక సహాయం అందించిన

## బండలేమూర్ గ్రామ మాజీ సర్పంచ్ పాతులోత్ మంగ శ్రీనివాస్ నాయక్

మంచాల వెలుతురు మే 01:



మంచాల మండలం బండలేమూర్ గ్రామానికి చెందిన సభవట్ రవి జ్యోతి దంపతులకుమార్తె లా వణ్య వివాహానికి బండలేమూర్ గ్రామమాజీ సర్పంచ్ మంగ శ్రీనివాస్ నాయక్ 10,000 రూపాయలు ఆర్థిక సహాయంచేశారు సందర్భంగా సపవాట్ రవిజ్యోతి మాట్లాడుతూ ఈకాలంలో కష్టసుఖాల్లో ఉన్న ఎవరు కన్నెత్తి చూడని రోజుల్లో మాపేదింటి పెళ్లికి మా ఇంటికి వచ్చిఒకఅన్నల ఒక మా మ గా వచ్చిమాకు సహాయం చేయడం చాలా సంతోషకరం పదవులతో పార్టీలతో సంబంధం లేకుండా ప్రజాసేవ చేసే నాయకుడిల ప్రజలబాధలు తెలుసుకొని వారికి అండగా నిలబడుతూ మా వివాహానికి కూడా ఒకమామ స్థానంలో ఉండి మాకుసహాయం చేసినందుకు ఆభగవంతుడు వారి కి అన్నివిధాల మాలాంటి పేదప్రజలకు సహాయపడే విధంగా వారికి వారి కుటుంబానికి ఆశీర్వా దం ఉండాలని అన్నారుగత 1012 సంవత్సరాల నుండి ప్రజాసేవలో ఉంటూ నిరుపేద ప్రజ ల ను ఆదుకుంటూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం మన గ్రామానికి మంచాల మండలానికె కాకుం డా మన రంగారెడ్డి జిల్లా లోనే ఎవ్వరూ చేయని విధంగా పేదప్రజలను ఆదుకోవడంలో మాజీ గ్రా మ సర్పంచ్ మంగ శ్రీనివాస్ గారు ఆర్థిక సహాయం చేయడం మా గ్రామఅదృష్టంగా భావిస్తున్నాం అని అన్నారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ కంటెస్టెంట్ అభ్యర్థి జనార్ధన్ 1వ వార్డు స భ్యురాలు శిరీష చందు 5వవార్డు సభ్యుడు జక్కలి సాలయ్య కాంగ్రెస్ బీసీసెల్ నాయకులు వట్టి నరసింహ తుల్జాభవాని యూత్ సలహాదారులు లింగస్వామి కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాం జీ నాయక్ కాంగ్రెస్ నాయకులు రవి పిసితండా యువనాయకులు కుటుంబసభ్యులు తదితర లు పాల్గొన్నారు

### కాట్రాజు అనిల్,హర్షిణి నూతన దంపతులను ఆశీర్వదించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



దామరచర్ల వెలుతురు మే 01:

నల్గొండ జిల్లా దామరచర్ల మండలం తెట్టకుంట గ్రామానికి చెందిన కాట్రాజు శ్రీనివాస్, లక్ష్మీ దంపతుల కుమారుడు అనిల్ వివాహము మిర్యాలగూడ పట్టణానికి చెందిన అలుగుబెల్లి మట్టయ్య వినోదల కూతురు హర్షిని వివాహం పట్టణంలోని స్థానిక ఏఆర్సి ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమానికి బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కేశవపురం మాజీ సర్పంచ్ ఆడావత్ సైదా నాయక్ బంటు వెంకటేశ్వర్లు తో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# డాక్టర్ చిలుకు స్వామికి శ్రమశక్తి అవార్డు

- **రవీంద్ర భారతిలో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా అవార్డును ప్రధానం**

హైదరాబాద్ వెలుతురు మే 01:

మే డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డులలో భాగంగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సోసైటీ అధ్యక్షునిగా సేవలు అందజేస్తున్న చిలుకు స్వామి కి రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ప్రధానం చేసింది. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఈ అవార్డును ప్రధానం చేశారు. ఆలేరు మండలం షారాజిపేట గ్రామ నివాసి అయిన స్వామి ఒకవైపు రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూనే గ్రామంలో ఎయిడ్స్ పట్ల అవగాహన రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ గ్రామ యువకులను చైతన్య పరుస్తున్నారు. వీరిసేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వ కార్మిక శాఖ మేడే సందర్భంగా శ్రమశక్తి అవార్డుకును అందజేశారు. చిలుక స్వామికి ఈ గౌరవము లభించడం పట్ల పలువురు రైల్వే ఉద్యోగులు, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



## వాస శ్రీలత రవీందర్ గుప్తా కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న శ్రీలతతో కలిసి చదివిన పూర్వ విద్యార్థుల బ్యాచ్ గ్రామస్తులు



మంచాల వెలుతురు మే 01:

మంచాల మండలం హైదరాబాద్ కర్మన్ ఘాట్ లో ఉన్న శ్రీలక్ష్మికన్వె న్షన్ హాల్లో జరిగిన వాస శ్రీ లత రవీందర్ గుప్తా కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులు భార్గవి అమర్ నాథ్ గుప్త ను ఆశీర్వదించిన ఆరుట్ల గ్రామంలో శ్రీలతతో కలిసి చదివిన పూర్వ విద్యార్థులు వైయస్సా ర్ మాధగోని జంగయ్య గౌడ్ నాగరాజుశర్మ పాండాల జంగయ్యగౌడ్ గోగిరెడ్డి మోహన్ రెడ్డి అంతటి శేఖర్ గౌడ్ సుంకరి కేశవులు గౌడ్ ఝాన్సీ వెంకట్ లక్ష్మి ప్రశాంతి ఆరుట్ల గ్రామస్తులు వెంకటేష్ గౌడ్ పాండాల యాదయ్యగౌడ్ మారగోని శ్రీనివాస్ గౌడ్ పాండాల జగన్ గౌడ్ పాండాల శేఖర్ గౌడ్ పాండాల ప్రసాద్ గౌడ్ తదితరులుపాల్గొన్నారు

## గ్రేటర్ హైదరాబాద్ బి గ్రేడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షునికి

# శ్రమ శక్తి అవార్డుతో ఘన సన్మానం





హైదరాబాద్ వెలుతురు మే 01:

మేడే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన శ్రమశక్తి అవార్డు గ్రహీతలను వివిధ కార్మిక సంఘాలు, సంస్థల ప్రతినిధులు ఘనంగా సన్మానిస్తున్నారు. భవన నిర్మాణ, సింగరేణి, రైల్వే వంటి వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలందించిన కార్మికులు, నాయకులను అభినందిస్తూ, వారి సేవలను కొనియాడుతున్నారు. తెలంగాణ బి గ్రేడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ తరపు నుండి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు పొదిల గోవర్ధన్ కూ రాష్ట్ర ప్రభుత్వం చే శ్రమ శక్తి అవార్డు ప్రధానం చేసినారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వివిధ అంశాల పైన సుదీర్ఘమైన సెమినార్లు నిర్వహించి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లనుఉత్తేజపరిచినందుకు పరిచినందుకు ప్రభుత్వం గుర్తించి శ్రమ శక్తి అవార్డు ఇచ్చినందుకు ప్రత్యేకమైన అభినందనలు ఈ అవార్డును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా అందుకున్నందుకు గర్వంగా ఉందని అవార్డు గ్రహీత పొదుల గోవర్ధన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదగిరి. ప్రధాన కార్యదర్శి నేమాల బెనర్జీ. తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ జేఏసీ కార్యదర్శి రాజు మహారాజు. ప్రైవేటు ఉద్యోగుల సంఘం నాయకులు. వెంకన్న. శ్రీనివాస్ రావు బి వెంకటేశ్వర్లు. ఆకుల రవి. బాలకృష్ణారెడ్డి. భూపాల్ రెడ్డి. చింతపట్ల సుధాకర్. వెంకట్ రెడ్డి రాజు రెడ్డి నర్సిరెడ్డి. నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులను పున పరిశీలించాలి : తపస్

మెదక్ టౌన్ వెలుతురు మే 01:

మెదక్ కలెక్టర్ ఆఫీసులో మెడికల్ బోర్డు మంజూరు చేసిన మెడికల్ బిల్లులను పున పరిశీలించాలని తపస్ మెదక్ జిల్లా శాఖ అడిషనల్ కలెక్టర్ నగేష్ గారిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, జాల సిద్ధు మాట్లాడుతూ ఇటీవల మెదక్ జిల్లా మెడికల్ బోర్డు విడుదల చేసిన బిల్లులు ఉద్యోగ ఉపాధ్యాయులు వారు అప్లై చేసుకున్నదానికంటే చాలా తక్కువ మొత్తం మంజూరయ్యాయని, శివంపేట మండలంలోని ఒక ఉపాధ్యాయురాలు 49,700 రూపాయల గాను, 5000 మంజూరు, పాపన్నపేట మండలంలోని ఒక ఉపాధ్యాయురాలికి 28,359 రూపాయల గాను,3400 మంజూరు, కొల్చారం మండలంలోని ఒక ఉపాధ్యాయుడు 30,346 రూపాయల గాను, 3400 మంజూరు, రామాయంపేట మండలంలో ఉపాధ్యాయురాలికి 29,942 రూపాయల గాను, కేవలం 2720 రూపాయలు అయ్యాయని వారన్నారు. ఈ విధంగా అనేకమంది ఉపాధ్యాయులకు తక్కువ బిల్లులు మంజూరు అయ్యాయని, ఈ బిల్లుల మంజూరుకు కారణమైనటువంటి అధికారులను పిలిచి, ఆ మెడికల్ బిల్లులన్నింటిని పునః పరిశీలించాలని వారు అదనపు కలెక్టర్ గారిని కోరడం జరిగింది.ఈ కార్య క్రమంలో తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్, సురేందర్,గుజ్జరి రవి, ఆంజనేయులు,ప్రసాద్ రెడ్డి, శ్రీహరి,సుభాష్, బిక్షపతి, నరేందర్, లక్ష్మీనారాయణ, కిషన్,రమేష్, రాజు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు



# హనుమాన్ హిందూ సమ్మేళన సమితి( ఆదర్శ్ నగర్ బస్తి) ఆధ్వర్యంలో ఘనంగా హిందూ సమ్మేళనం






కరీంనగర్ వెలుతురు మే 01:

కరీంనగర్ పట్టణం (ఆదర్శ్ నగర్ బస్తి )హనుమాన్ హిందూ సమ్మేళన సమితి ఆద్వర్యంలో నిర్వహించిన హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. హిందూ సమ్మేళనం కార్య నిర్వహణ సమితి అధ్యక్షులు మెతుకు కనుకయ్య ప్రధాన కార్యదర్శి కస్తూరి సుధాకర్ ,మహిళ వక్త భోయిని జయప్రద మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి హిందువులంతా కృషి చేయాలన్నారు. హిందూ సమాజం ఐక్యతతో ముందు కొనసాగాలన్నారు. భారతీయ సంస్కృతి లో మహిళ శక్తి కి ఎంతో ప్రాధాన్యత ఉందని , మహిళ గొప్పతనం గురించి మాటల్లో వర్ణించలేమన్నారు. ప్రధాన వక్త ఆదరణీయ కొంపల రాజన్న హిందూ సమాజంపై జరుగుతున్న దాడిని, వాటిని ఎలా ఎదుర్కొవాలనే విషయాలపై , హిందూ ఐక్యత గురించి వివరించారు. ప్రధాన అర్చకులు విశ్వపతి శర్మ దేవాలయం గొప్పతనం గురించి హిందూ సంస్కృతి గురించి వివరించారు,

అధ్యక్షుడు మెతుకు కనుకయ్య మాట్లాడుతూ హిందూ సమాజ సంఘటిత శక్తి కోసమే మనం హిందూ సమ్మేళనాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. హిందువులు గుడికి వెళ్ళే ఆవశ్యకత ను తెలియజేస్తూ మాట్లాడారు. కార్యక్రమ అనంతరం మహిళలకు గాజులు, పసుపు కుంకుమ ను ఈ సందర్భంగా సమితి అందజేసింది.

### పోచారం శ్రీలక్ష్మి నరసింహ్మాస్వామి వారి కల్యాణానికి హాజరయిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం వెలుతురు మే 01:

ఇబ్రహీంపట్నం మండలం పోచారంగ్రామంలోని శ్రీలక్ష్మి నరసింహ్మాస్వామివారి కళ్యాణం సందర్భంగా ఆలయకమిటీ ఆహ్వానంమేరకు స్వామివారి కళ్యాణమహోత్సవంలోఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిగారు హాజరయ్యారు ఈమేరకు నరసింహ స్వామివారికి ఎమ్మెల్యేగారు ప్రత్యేక పూజలునిర్వహించారు నియోజకవర్గంలొ ప్రతిదేవాలయాన్ని అభివృద్ధి చేస్తానని ఈ సందర్భం గా ఎమ్మెల్యేగారు హామీఇచ్చారు ఈకార్యక్రమంలో దేవాలయం కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు తదితరులుపాల్గొన్నారు

## ఫీజు రియంబర్స్మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొర్రీలు పెట్టడం సరికాదు

- **రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 7 వెనక్కి తీసుకోవాలని డిప్యూటీ సీఎం మరియు ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్కని కలిసి విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్**

హైదరాబాద్ వెలుతురు మే 01:

రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు చెల్లించవలసిన ఫీజుల విషయంలో ప్రతిసారి రాష్ట్ర ప్రభుత్వం కొర్రీలు పెట్టడం సరికాదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు 10,000 కోట్ల ఫీజులు చెల్లించకపోవడంతో గత నాలుగు ఐదు సంవత్సరాలుగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం సరైన వాదనలు వినిపించకపోవడంతో హైకోర్టు విద్యార్థుల దగ్గర నుండి ఫీజులు వసూలు చేసుకోమని చెప్తున్నాయని విద్యార్థులే ఫీజులు కడితే మరి ప్రభుత్వాలు ఉన్నవి దేనికని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2026 2027 విద్యా సంవత్సరం నుండి విద్యార్థుల ఖాతాలోకి ఫీజులు జమ చేస్తామని జీవో నెంబర్ 7 తీసుకువచ్చిందని ఈ జీవో వల్ల విద్యార్థులకే ఇబ్బందులని అడ్మిషన్లు పొందిన విద్యార్థులు నేరుగా కాలేజీలోకి వెళితే కాలేజీలో ఫీజులు మొత్తం కడితేనే కాలేజీలో జాయిన్ చేసుకుంటామని కాలేజీ యాజమాన్యాలు చెప్తాయని ఎలాగూ ప్రభుత్వం విద్యార్థుల ఖాతాలోనే ఫీజులు జమ చేస్తా అంటుంది కాబట్టి మీరు ఫీజు మొత్తం కట్టి కాలేజీకి రండి అని కాలేజీలు చెప్తే విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంటుందన్నారు. అదేదో విద్యార్థుల ఖాతాలోకి వేసే బదులు కాలేజీ యాజమాన్యాలకి ఇస్తే సరిపోతుందిగా అని లింగం గౌడ్ ప్రశ్నించారు. దీనికి డిప్యూటీ సీఎం స్పందిస్తూ అతి త్వరలోనే అన్ని విద్యార్థి సంఘాలు ప్రజా సంఘాలతో ఒక సమావేశం ఏర్పాటు చేస్తామని బీసీ నాయకులకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య వెంకన్న యాదవ్ ఎస్పీ నాయుడు దోనేటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు



# ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు అండగా ఉంటాం

- **ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ**

**యాదగిరిగుట్ట, మే 01 వెలుతురు న్యూస్:**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్టలో నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల జిల్లా స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాలు అందేలా కృషి చేస్తామని అన్నారు . వారి సమస్యలపై ఎప్పటికప్పుడు అసెంబ్లీలో మాట్లాడి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని అన్నారు . ఫీల్డ్ అసిస్టెంట్లకు అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం పేరును మార్చి పథకం ఉద్దేశాన్ని నీరు గార్చే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ



ఉపాధి హామీ పథకాన్ని అలాగే ఉంచాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు అన్ని విధాలుగా న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు అతి తక్కువ వేతనాలు ఉన్నాయని, వారికి వేతనాలు పెంచేందుకు మంచి పే స్కేల్ లభించేలా కృషి చేస్తామని అన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. గత 20 సంవత్సరాలుగా ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించేందుకు తగిన విధంగా కృషి చేస్తామని అన్నారు. మంత్రి సీతక్క సహకారంతో ఫీల్డ్ అసిస్టెంట్లకు 5జి మొబైల్ లు అందించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా వారికి అన్ని విధాలుగా జీవన భద్రత కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆరోగ్య భద్రత కోసం కార్పొరేట్ స్థాయిలో వారికి వైద్య సదుపాయాలు అందేలా ఆరోగ్య భీమాను ఏర్పాటు చేస్తామని అన్నారు . ఫీల్డ్ అసిస్టెంట్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు వారి సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ మేరకు వారి సమస్యలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రభుత్వ విప్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం కాంగ్రెస్ నేతలు గుండ్లపల్లి భరత్ గౌడ్ , కానుగు బాలరాజు గౌడ్ , ఎరుకల హిమేందర్ గౌడ్ , ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు బబ్బూరి శంకర్ గౌడ్ , ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధీరావత్ బిచ్చా నాయక్ , సంఘం నేతలు కంకల సిద్దిరాజు , బి రవి, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి, బైరగోని రమేష్, బాల్ రెడ్డి , తాళ్లపల్లి ప్రభాకర్ , లింగా నాయక్, సుప్రజ , నరేందర్ , వెంకటేష్ , వాణి, బాల లక్ష్మి , సునీత, ఉపేందర్ వివిధ మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బి. ఆర్. ఎస్.కార్మిక విభాగం ఆధ్వర్యంలో ఘనంగా మే డే

**మోత్కూర్, మే 1,( వెలుతురు న్యూస్ )**

శుక్రవారం నాడు మోత్కూర్ లో మేడే కార్మిక దినోత్సవం సందర్భంగా BRS కార్మిక విభాగం ఆధ్వర్యం లో పాత బస్టాండ్ వద్ద,పోతయగడ్డ వద్ద BRS కార్మిక విభాగం నాయకులు జంగ సతీష్ ,కూరెళ్ళ నాగరాజు BRSKV జెండా ఎగరవేయడం జరిగినది.ఈ సందర్భంగా నాయకులు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిరంతరం



పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పోన్నె బోయిన రమేష్ ,పట్టణ పార్టీ అధ్యక్షులు జంగ శ్రీను ,మాజీ మార్కెట్ చైర్మన్ తీపి రెడ్డి మేఘా రెడ్డి ,మున్సిపల్ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్ ,మాజీ రైతుబంధు సమితి మండల అధ్యక్షులు కొండ సోమల్లు , కౌన్సిలర్ సుల్తాన్ స్వామి, డి. వి. ఎం. ఎస్.జిల్లా నాయకులు దాసరి తిరుమలేష్ ,చేగోని సత్యం గౌడ్, నాయకులు పురుగుల మల్లయ్య ,చేతరాశి వెంకన్న, కంచర్ల క్రాంత్ కుమార్ రెడ్డి మొరిగాలశ్రీను, దాదే సాబ్,జంగ శివ ,బందెల శీను,కూరెళ్ల రమేష్ ,చుక్క అశోక్ ,దాసరి నవీన్ ,దాసరి ఎలంధర్ ,చెడిపల్లి ఆనంద్ ,కూరెళ్ళ సైదులు,ఉప్పల రమేష్,బుర్ర వెంకన్న,దాసరి నరేష్,జంగ సురేష్,కూరెళ్ళ సురేష్,గజ్జెల మల్లిఖార్జున,కందుకూరి సురేందర్,మరాఠీ స్వామి తదితరులు పాల్గొన్నారు

# మేడే స్ఫూర్తితో కార్మిక వర్గ పోరాటాలు ఉధృతం చెయ్యాలి

- **కార్మికుల కష్టమే దేశాభివృద్ధికి పునాది**
- **గుండు వెంకటనర్సు (సిపిఎం పార్టీ మండల కార్యదర్శి)**

**మోత్కూర్, మే 1,(వెలుతురు న్యూస్ )::**

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చెయ్యాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున మేడే



సందర్భంగా మోత్కూర్ మండలం రాగిబావి గ్రామంలో జెండా ఆవిష్కరణ జరిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ.... కార్మికులు రక్తం దారపోసి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల పట్ల అత్యంత క్రూరంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. దశాబ్దల పోరాటఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో కార్పొరేట్లకు మేలుచేసే విధంగా 4 లేబర్ కోడ్లను తీసుకరావడం దుర్మార్గం అని అన్నారు. 8 గంటల పనిదినం స్థానంలో 12 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా కార్మికులకు తిరిగి 1886 నాటి బానిసత్వ కాలంలోకి నెట్టి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టీ కరణ, ఔట్ సోర్సింగ్, ఫిక్సిడ్ టర్మ ఎంప్లాయ్మెంట్ వంటి పేర్లతో కార్మికుల శ్రమ దోపిడీకి చట్టభద్దత చేస్తున్నారని అన్నారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం మేడే స్ఫూర్తితో పోరాటలను ఉదృతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పానుగుల రమేష్, సీనియర్ నాయకులు ఎన్నం వెంకట్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ పానుగుల లక్ష్మి, మెండు శేఖర్ రెడ్డి, నారబోయిన వెంకటమ్మ, కక్కరేణి నర్సయ్య, రాంపాక రాములు, ఎలుగు పాపిరెడ్డి, పానుగుల నవీన్, గోపి పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- **ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

**యాదగిరిగుట్ట, మే 0 1 వెలుతురు న్యూస్:**

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు శుక్రవారం యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు బీర్ల అయిలయ్య కు ఘన స్వాగతం



పలికారు. అనంతరం ఆయన ఆర్టీసీ కార్మికులను సన్మానించారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, కార్మికులే సమాజ నిర్మాణానికి పునాది అని తెలిపారు. వారి కష్టపడే తత్వం వల్లనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మొన్నటి ఆర్టీసీ కార్మికుల సమ్మెలో ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ గారికి ఘనంగా నివాళులు అర్పించారు,ఆర్టీసీ కార్మికులు ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని కొనియాడుతూ, వారి సేవలు ఎప్పటికీ గుర్తుండేలా ఉంటాయని అన్నారు. దేశ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకంగా ఉంటుందని వ్యవసాయం పరిశ్రమలు నిర్మాణ రంగంలో వారి సేవలు గొప్పవారు కార్మికుడి దేశానికి వెన్నుముక అనే భావనతో ఈరోజు కార్మికుల దినోత్సవం జరుపుకోవడం సంతోషం అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్ ఆర్టీసీ కార్మిక సంఘం నేతలు టి మురళి ఎస్ వెంకటేష్ సోకం వెంకటేష్ మంగ లక్ష్మీబాయి ఎల్లయ్య నారాయణ తదితరులతోపాటు ఆర్టీసీ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గుట్టలో ఘనంగా వైవి సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు

- **టిటిడి లోకల్ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యులు, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు వడ్లోజు వెంకటేష్ ఆధ్వర్యంలో వేడుకల నిర్వహణ**
- **పెద్ద ఎత్తున అన్నదానం, మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ**

**యాదగిరిగుట్ట మే 0 1 వెలుతురు న్యూస్:**

టిటిడి లోకల్ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యులు, వైఎస్ఆర్సిపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వడ్లోజు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి 66వ జన్మదిన వేడుకలను యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా వైకుంఠ ద్వారం వద్ద కేక్ కట్ చేసి అభిమానులు నాయకులు స్థానికులకు స్వీట్లు





పంపిణీ చేశారు. బాణాసంచా కాల్చి పెద్ద ఎత్తున వైవి సుబ్బారెడ్డి జన్మదిన వేడుకల సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్లోజు వెంకటేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహించారు మహిళలకు సుమారు 500 చీరలను పంపిణీ చేశారు. అనంతరం సుమారు వెయ్యి మందికి పైగా అన్నదానం నిర్వహించారు . ఈ సందర్భంగా టిటిడి లోకల్ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యులు వైయస్సార్సిపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వడ్లోజువెంకటేష్ మాట్లాడుతూ టిటిడి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా యాదగిరిగుట్టలో ఘనంగా ఆయన పుట్టిన రోజు వేడుకలు నిర్వహించామని అన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు సాధించి ప్రజలకు సేవ చేయాలని యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని ప్రార్థించామని అన్నారు . వై వి సుబ్బారెడ్డి పేరున యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించామని అన్నారు. సుమారు 60 వేల రూపాయల విలువైన మోదుగు సమిధులను స్వామివారి ఆలయంలో యజ్ఞ యాగాదుల నిమిత్తం వైవి సుబ్బారెడ్డి పేరున ఏపీ మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి పేరున అందజేశామని అన్నారు. ప్రతి సంవత్సరం వైవి సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు . అదే మాదిరిగా ఈసారి కూడా ఆయన 66వ పుట్టిన రోజును ఘనంగా యాదగిరిగుట్టలో నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా వైకుంఠ ద్వారం వద్ద నిర్వహించిన వై వి సుబ్బారెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో స్థానికులు మహిళలు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున మహిళలు హాజరై చీరలను అందుకున్నారు అన్నదానం కార్యక్రమానికి స్థానికులు యాత్రికులు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో వైకుంఠ ద్వారం వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు స్థానికులు ప్రజలు వైఎస్ఆర్సిపి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గుండాలలో ఘనంగా మేడే ఉత్సవాలు

**గుండాల మే 01(వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని వివిధ గ్రామాలతో పాటు గుండాల మండల కేంద్రంలో మేడే సందర్భంగా కార్మిక కర్షకులతోపాటు ఏఐటీయూసీ సిఐటియు హమాలి గ్రామపంచాయతీ కార్మికులు భవన నిర్మాణ కార్మికులు సిపిఐ సిపిఎం నాయకులు జెండా ఆవిష్కరణ చేశారు.వారు మాట్లాడారు మేడే ఉత్సవాలు 12 గంటల పనిని ఎనిమిది గంటలకు సవరించిన రోజు కార్మికుల హక్కుల దినంగా నిర్వహించుకోవడం జరిగిందని అన్నారు విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఎల్లం గోపాల్ జెండా ను ఆవిష్కరించారు. విద్యుత్ శాఖ ఏఈ అంబాల నరసింహ. సిపిఐ జిల్లా నాయకుడు కుసుమని హరిచంద్ర . మండల కార్యదర్శి అనంతుల రామచం



ద్రు. సిపిఎం మండల కార్యదర్శి మద్యపురం రాజు. ఎస్ ఎల్ ఐ నరసయ్య. నరసింహారెడ్డి. బిక్షపతి. శివ. శ్రీను. సోమన్న. దశరథ .రాములు. గ్రామపంచాయతీ కార్మికుల మండల నాయకులు ఇటికాల పరశురాములు. అల్లం శెట్టి రాములు. సి బోర్న్ అనపర్తి రాములు. అనపర్తి శ్రీరాములు. శిరిపురం ఎల్లయ్య ఎర్ర సీమోన్ అనపర్తి కిష్టయ్య వనపర్తి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# పంచ పల్లములతో పూజలు అందుకున్న మోత్కూర్ పెద్దమ్మ తల్లి

**మోత్కూరు, మే 1 (వెలుతురు న్యూస్ ) :**

వైశాఖ పౌర్ణమి పవిత్ర దినాన్ని పురస్కరించుకుని మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ పెద్దమ్మ తల్లి అమ్మవారు పంచ పల్లములతో శుక్రవారం భక్తులచే పూజలు అందుకున్నారు. ఆలయ అర్చకులు పారునంది లక్ష్మణమూర్తి శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశాఖ పౌర్ణమి, స్వాతి నక్షత్రంతో కూడిన శుక్రవారం అయినందున ఈరోజు పంచ పల్లములతో అనగా... రాగి, మేడి, మారేడు, జువ్వి, మామిడి ఆకులతో పెద్దమ్మతల్లిని ప్రత్యేకంగా అందంగా అలంకరించి పూజలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం ఆలయంలో కుంకుమార్చన పూజలు మహిళలతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం భక్తులకు మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన గాదెనబోయిన నాగరాజు, హేమలత దంపతులు భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఎడ్ల పద్మ, అబ్బయ్య, బుంగపట్ల సత్యనారాయణ, గాదెన బోయిన లక్ష్మీ తేజ, గాదేన బోయిన సాయి నక్షత్ర, సోమలక్ష్మి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఉదయ సముద్రం కాలువ పనులను తక్షణమే పూర్తి చేయాలి

- **పాల్వాయి స్రవంతి.**

**మునుగోడు, మే 1 (వెలుతురు ):**

మునుగోడు నియోజకవర్గ రైతుల దశాబ్దాల కలలను సాకారం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఉదయ సముద్రం ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి తక్షణ ఉపశమనం కల్పించాలని కోరారు. ఉదయ సముద్రం ప్రాజెక్టు నుంచి మునుగోడు మండలంలోని గ్రామాలకు రావాల్సిన కాలువ పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలన్నారు.ఈ పనులు పూర్తైతే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు.అలాగే పలివెల చెక్ డ్యామ్ నుంచి మునుగోడు పెద్ద చెరువుకు



వచ్చే కాలువ పనులను కూడా తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కాలువ పూర్తయితే సుమారు ఎనిమిది గ్రామాల రైతులకు పుష్కలంగా సాగునీరు అందుతుందని తెలిపారు .ఈ నెలలోనే పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి మునుగోడు అన్నదాతలకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మేడే స్ఫూర్తితో ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

- **ఎంఎల్సీ నెల్లికంటి సత్యం.**

**మునుగోడు, మే 1 (వెలుతురు):**

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మేడే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మిల్లు కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, మార్కెట్ కార్మికులు, చిరు వ్యాపారులు, సెంట్రింగ్ వర్కర్లు పతాకాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల పనిదినం, కార్మిక హక్కులు ఎన్నో చారిత్రాత్మక పోరాటాల ఫలితమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చి శ్రామికులను బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు శక్తులకు అప్పగిస్తూ దేశ సంపదను దోచిపెడుతోందన్నారు.

గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల భారంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ప్రతి కార్మికుడు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చాపల శ్రీను,గురజా రామచంద్రం, బోలుగూరి నరసింహ, వెంకటేశ్వర్లు, సత్యమ్మ,బెల్లం శివయ్య తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్ కమిటీ ప్రాంగణంలో మే డే కార్యక్రమం

- **కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు**
- **హాజరైన సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కం మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి.సబిత**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 01:**

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణం రామన్నపేట కేంద్రంలో మండల న్యాయ సేవ అధికార సంస్థ రామన్నపేట ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా సీనియర్ సివిల్ జడ్జి కం రామన్నపేట మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.సబిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులు, ఉచిత న్యాయ సహాయం ప్రాముఖ్యత, మరియు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూలీలు మరియు రోజువారీ వేతన కార్మికుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని, వాటిపై సంబంధిత వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులకు తగిన సూచనలు చేయడమైనది. కార్మికులు తెలియజేసిన సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ లు కునూరు శ్రీనివాస్, యదాసు యాదయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్వైజర్ ఎం.రమేష్, మార్కెట్ డైరెక్టర్ జి. నాగేందర్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కూలీలు మరియు రోజువారీ వేతన కార్మికులు పాల్గొన్నారు.



## ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు




**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 01:**

మండల కేంద్రంలోని తహసిల్దార్ ఆఫీస్ ముందు ఉన్న సిపిఐ పట్టణ కమిటీ జెండాను సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ,సివిల్ సప్లై హమాలీ యూనియన్ జెండాను గోరిగ శంకరయ్య, శివరాత్రి సమ్మయ్య, తాపీ మేస్త్రి వర్కర్స్ యూనియన్ జెండాను దుర్యోధన్, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రామన్నపేట బ్రాంచ్ నందు జె రాణి,కొమ్మాయిగూడెం గ్రామంలో లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ జెండాను బత్తుల సత్తయ్య, గోపగోని అశోక్ గౌడ్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ మాట్లాడుతూ చికాగో నగరంలో పుట్టిన కార్మిక సంఘం ఏఐటీయూసీ అని, కార్మికుల హక్కుల కోసం అవసరాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసి సాధించినటువంటి యూనియన్ ఎఐటియుసి అని, సమాజాభివృద్ధికి కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమని కార్మికుల హక్కులను కాపాడాలని వారికి తగిన గౌరవం ఇవ్వాలని పిలుపునిచ్చారు. దేశంలో వివిధ సంఘాలను నిర్మించి వారి హక్కుల కోసం పోరాడి, కార్మికుల 16 గంటల పని దినాన్ని ఎనిమిది గంటల పని దినానికి ప్రపంచవ్యాప్తంగా ఉద్యమాన్ని చేసినటువంటి సంఘం ఏఐటీయూసీ అని,అనేకమంది కార్మికుల రక్తంలో తడిసిన జెండా ఎర్రజెండా అని అన్నారు. దేశ అభివృద్ధికి కార్మికుల శ్రమ బలమని ప్రతి నిర్మాణంలో కార్మికుల చెమట దాగి ఉంటుందని కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని కాంక్షిస్తూ బాల కార్మికత్వాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగాపురం యాదయ్య, ఎర్ర రమేష్ గౌడ్, సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, బాలగోని మల్లయ్య, భగవంతు, జగన్నాథ పంతులు, వీరమల్ల ముత్తయ్య,సంగిశెట్టి పాండు,రచ్చ దయాకర్, నంగునూరు యాదయ్య, దండుగుల రాములు,కళ్లెం యాదయ్య, సుదర్శన్, ఊట్కూరి కృష్ణ, కొమ్ము రామలింగయ్య, సతీష్,శ్రీనివాస్, షాజియా, సుశీల, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేడే అమరుల స్ఫూర్తితో పోరాడాలి.

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 01:**



చికాగో అమరుల స్ఫూర్తితో మోడీ ప్రభుత్వం అవలబించే కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటిత ఉద్యమాలు నిర్మించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జండా ఆవిష్కరణ, ర్యాలీలు నిర్వహించి ఎర్ర చొక్కాలు ధరించి ఉత్సాహపూరితంగా మే డే ఉత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యాలయంలో జండా ఆవిష్కరణ చేసి మాట్లాడుతూ అధిక పని గంటల భారాన్ని తగ్గించి కార్మికుల శ్రమను దోచుకుంటున్న విధానానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అసువులు బాసిన అమరుల త్యాగస్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా మేడే ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని. కార్మికులు లేనిదే ప్రగతి లేదని కార్మికుల శ్రమను దోచుకుంటున్న పెట్టుబడిదారీ వ్యవస్థ దానికి కొమ్ముగాస్తున్న పాలకవర్గాలకు వ్యతిరేకంగా కార్మికులు సంఘటితంగా ఉద్యమించి హక్కులను సాధించాలని, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాశి నాలుగు లేబర్ కోట్ల రూపంలో నూతన విధానాన్ని తీసుకొచ్చి కార్పొరేట్లకు తివాచీ పరుస్తుందని అన్నారు. జాతి సంపదను ఆదాని అంబానీ అమెరికాకు తాకట్టు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుతుందని హెద్దేవా చేశారు. పోరాటాల ద్వారానే దోపిడీ విధానానికి చరమగీతం పాడాలని మేడే స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు మనం ఉపేందర్, బల్గూరి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందుల హనుమంతు, సిఐటియు మండల కన్వీనర్ గొరిగె సోములు, నాయకులు గాదె నరేందర్, గన్నెబోయిన విజయభాస్కర్, మీర్ ఖాజా అలీ ,బావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్, వేముల సైదులు, ఎండి రషీద్,తొలుపులూరి శ్రీనివాస్,మునికుంట్ల లెనిన్,అప్పం సురేందర్,మేడి ముకుంద, పల్లె సత్యం, బావండ్లపల్లి సత్యం, బోళ్ల వెంకన్న, ఆముద ఆంజనేయులు,పాలం అంజయ్య, కుందూరు వెంకటేష్, తరిగొప్పుల వెంకట్ రెడ్డి,పెండెం బ్రాహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో విద్యకు కొత్త మైలురాయి – వుడ్ రాక్ వరల్డ్ స్కూల్ ప్రారంభం

- **సినీనటి నిధి అగర్వాల్, డైరెక్టర్ హరీష్ శంకర్, రాజకీయ ప్రముఖుల సందడి...**

**జహీరాబాద్ వెలుతురు మే 01:**





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం విద్యా రంగంలో మరో ముందడుగు వేసింది. పట్టణంలోని హైవేపై ఉన్న భారత్ బగీచా వెంచర్‌లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన వుడ్ రాక్ వరల్డ్ స్కూల్ నేడు అట్టహాసంగా ప్రారంభమైంది. ఆధునిక విద్యా ప్రమాణాలు, విశాలమైన భవనాలు, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, ప్లే ఏరియాలు, సాంకేతిక సదుపాయాలతో ఈ పాఠశాల ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కొణింటి మాణిక్ రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మున్సిపల్ ఛైర్మన్ మొహమ్మద్ యూనుస్, వైస్ ఛైర్మన్ శిరీషారెడ్డి, సినీ నటి నిధి అగర్వాల్, ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పూజా కార్యక్రమాల నడుమ రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించిన అనంతరం అతిథులు మాట్లాడుతతూ...ఇలాంటి అత్యాధునిక విద్యాసంస్థలు గ్రామీణ, పట్టణ విద్యార్థులకు సమాన అవకాశాలను కల్పిస్తాయని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యతో పాటు విలువల బోధన కూడా ఎంతో అవసరమని, ఈ పాఠశాల విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జహీరాబాద్ ప్రజలు ఈ సంస్థపై విశ్వాసం ఉంచారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా విద్యా ప్రమాణాలు ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సినీ నటి నిధి అగర్వాల్ మాట్లాడుతూ...విద్యార్థులు తమ కలలను సాధించడానికి కష్టపడి చదవాలని, ఈ పాఠశాల అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించారు. దర్శకుడు హరీష్ శంకర్ కూడా విద్యతో పాటు సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను స్కూల్ యాజమాన్యం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించింది. ఈ వేడుకలో సంస్థ డైరెక్టర్లు సర్దార్ భాషా, సుధీష్ణ, ప్రిన్సిపల్ వినీల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అంగన్వాడీ సేవల్లో డిజిటల్ దిశగా ముందడుగు

- **టీచర్లకు స్మార్ట్ ఫోన్లు అందజేసిన ఎమ్మెల్యే మాణిక్ రావు.**

**జహీరాబాద్ వెలుతురు మే 01:**





గ్రామీణ స్థాయిలో అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా, వేగవంతంగా ప్రజలకు చేరవేయాలనే లక్ష్యంతో జహీరాబాద్ నియోజకవర్గంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో పనిచేస్తున్న అంగన్వాడీ సిబ్బంది ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, గర్భిణీ స్త్రీల సంక్షేమం వంటి అంశాల్లో సమయానికి సమాచారం సేకరణ, నివేదికలు పంపిణీ, సేవల అమలు వంటి కార్యక్రమాలు స్మార్ట్ ఫోన్ల ద్వారా మరింత సులభతరం వుతాయని తెలిపారు. సాంకేతికత వినియోగం వల్ల అంగన్వాడీ కేంద్రాల పనితీరు పారదర్శకంగా మారడంతో పాటు సేవల నాణ్యత కూడా మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అందజేసిన డిజిటల్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతంగా అమలు చేయాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిం, మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు అబ్దుల్లా, గౌస్ గౌరీ, జాకీర్, దీపక్, విశ్వేశ్వర్, ప్రవీణ్, నాయకులు అక్బర్, ఫయాజ్ పాల్గొన్నారు. అలాగే CDPO సుశీల, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్ కుమార్, రాధమ్మ, సునీత బాయి, సద్గుణ, అనిత, నీరజ గ్రేస్, పవన్, శ్రీశైలం శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

## జహీరాబాద్‌లో ఘనంగా మేడే వేడుకలు

- **మున్సిపల్ కార్యాలయం ముందు జెండా ఆవిష్కరణ....**

**జహీరాబాద్ వెలుతురు మే 01:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో శుక్రవారం మేడే (కార్మికుల దినోత్సవం) వేడుకలను ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ముందు యూనియన్ అధ్యక్షులు కే. నర్సింహులు మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్, పెయింటర్స్ వర్కర్స్ యూనియన్, ఆర్సీసీ సెంట్రింగ్ యూనియన్, భవన నిర్మాణ కార్మిక సంఘాలు తదితర అనుబంధ సంఘాలు పాల్గొన్నాయి. మున్సిపల్ కార్యాలయం నుండి ప్రారంభమైన భారీ ర్యాలీ హైవే రోడ్డుమీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు, అక్కడి నుంచి బ్లాక్ రోడ్, సుభాష్ గంజ్ మార్గంగా సాగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఎంప్లాయిస్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే. నర్సింహులు మాట్లాడుతూ మేడే కార్మికులకు పండుగలాంటిదని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు తమ హక్కుల కోసం చేసిన పోరాటాల ఫలితంగా ఈ రోజు ప్రాముఖ్యత పొందిందన్నారు. అమెరికాలోని చికాగో నగరంలో కార్మికుల పోరాటాల సందర్భంగా అమరులైన కార్మికుల త్యాగాలను స్మరించుకుంటూ మేడేను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికుల హక్కుల కోసం జరిగిన పోరాటాల ఫలితంగానే పని గంటలు, వేతనాలు, హక్కులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ, కార్మికులు ఐక్యతతో పోరాడాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాల అమలు, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం ఉద్యమాలు కొనసాగించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను తీవ్రంగా విమర్శిస్తూ, కార్మికుల భవిష్యత్తును రక్షించేందుకు పోరాటాలు ఆగకూడదన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రాజు, అజయ్, సురేష్, దత్తు, వీరన్న, గౌస్, నరేష్, నిరంజన్ రెడ్డి, షఫీ, అశోక్, కృష్ణ, కుమార్, శ్రీకాంత్, పి. రాజు, పి. సురేష్, ముజీబ్, ముక్తార్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ PF, ESI చెల్లించాలి – మున్సిపల్ కార్మికుల సమ్మె ప్రారంభం

- **ఎండల నేపథ్యంలో ఒక్క పూట డ్యూటీ అమలు చేయాలని డిమాండ్...**
- **సేఫ్టీ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి...**

**జహీరాబాద్ వెలుతురు మే 01:**



మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నేటి నుండి సమ్మె బాట పట్టారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సమ్మెలో ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న పిఎఫ్, ఈఎస్ఐ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ—పిఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులు ఆలస్యమవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు, మనోవేదనను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. అదేవిధంగా కార్మికులకు అందాల్సిన సబ్బులు, నూనెలు, యూనిఫామ్‌లు, షూస్ వంటి ప్రాథమిక సౌకర్యాలు మరియు భద్రతా పరికరాలను అందించాలని డిమాండ్ చేశారు. మండుతున్న ఎండల దృష్ట్యా కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఒక్క పూట డ్యూటీ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం, అధికారులు స్పందించే వరకు సమ్మె కొనసాగుతుందని యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు యూనియన్ నాయకులు సంజీవ్, మోహన్, యశోదమ్మ, సిద్ధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బొల్లారం డివిజన్‌లో ఘనంగా మే డే వేడుకలు





- **1000 మంది కార్మికులకు రూ.5 లక్షల భీమా కార్డుల పంపిణీ ప్రారంభం**
- **కార్మికుల కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిందే మే డే : కాట శ్రీనివాస్ గౌడ్**

**బొల్లారం వెలుతురు మే 01:**

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా బొల్లారం డివిజన్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదటగా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన ఆయన, అనంతరం కార్మిక నాయకుడు వరప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జెండాను ఆవిష్కరించారు. తరువాత జరిగిన సమావేశంలో పాల్గొని సుమారు 1000 మంది కార్మికులకు రూ.5 లక్షల విలువైన ఇన్సూరెన్స్ భీమా కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి రెండు పడక గదుల ఇల్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఐడియా బొల్లారం పట్టణంలో మేడే ఉత్సవాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వర ప్రసాద్ రెడ్డి, చంద్ర రెడ్డి లు ఇచ్చిన ఆరు లక్షలు సొంత నిధులతో రూపొందించిన భీమా కార్డులు పంపిణీ చేశారు ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకొని క్రమబద్ధీకరణకు డబ్బులు చెల్లించిన వారికి న్యాయం జరిగేటట్టు మంత్రులతో మాట్లాడుతామని చెప్పారు. ఐడిఏ బొల్లారానికి మంజూరైన ఈఎస్ఐ డిస్పెన్సరీ ప్రస్తుతం బాచుపల్లి లో నడుస్తుందని దాన్ని బొల్లారానికి తెస్తామన్నారు. అగ్నిమాపక శాఖలో మంజూరైన మూడు ఎకరాల స్థలాన్ని కొందరు కబ్జా చేశారని వాటిలో పూల్చివేతలు చేయించా మని చెప్పారు. అదే స్థలాన్ని అగ్నిమాపక శాఖ కు మంజూరు చేసే విధంగా మంత్రులతో మాట్లాడుతామన్నారు. హరిత ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాల మేరకు కాలుష్య ప్రభావిత గ్రామాల్లో ఉచిత తాగునీరు అందించేట్టు జలమండలి అధికారులకు వినతిపత్రం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్మికులు, ఆటో యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులకు సీఎం 'మే డే' కానుక

- సమ్మె కాలపు వేతనాలు, కేసుల రద్దుకు గ్రీన్ సిగ్నల్
- సంస్థ బలోపేతమే లక్ష్యమన్న సీఎం రేవంత్ రెడ్డి
- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన 14 ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు
- సమ్మె కాలపు 3 రోజుల జీతం చెల్లింపునకు ముఖ్యమంత్రి అంగీకారం
- కార్మికులపై ఉన్న పాత కేసులన్నీ ఎత్తివేయాలని అధికారులకు ఆదేశం
- శంషాబాద్‌లో 150 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ టర్మినల్
- ఆర్టీసీకి మరో రూ. 1000 కోట్ల బకాయిల విడుదల చేస్తామన్న సీఎం
- 1000 కొత్త ఈవీ బస్సుల కొనుగోలు.. మెట్రోతో అనుసంధానం
- మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి రూ.8 వేల కోట్ల భరోసా
- డ్రైవర్ల కోత ఉండదు.. ఈవీ బస్సులతో డీజిల్ ఖర్చుకు చెక్



**హైదరాబాద్ వెలుతురు మే 01:**
తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సుదీర్ఘ కాలపు నిరీక్షణకు తెరదించుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో 14 ప్రధాన కార్మిక సంఘాల ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం.. గతంలో మూడు రోజుల పాటు జరిగిన సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను విడుదల చేయాలని, అలాగే కార్మికులపై ఉన్న పోలీసు కేసులను తక్షణమే ఎత్తివేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల కార్మిక లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

**నేను వేరు.. మీరు వేరు కాదు: ముఖ్యమంత్రి**

ఆర్టీసీ కార్మిక సంఘాలతో జరిగిన భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆత్మీయంగా మాట్లాడారు. "నేను వేరు, మీరు వేరు అన్న భావన నాకు ఎప్పుడూ లేదు. అందరం కలిస్తేనే ప్రభుత్వం. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని ఆర్టీసీ కార్మికులు బలంగా కోరుకున్నారు, మీ పోరాటాల్లో మేము కూడా భాగస్వామ్యం అయ్యాం" అని గుర్తుచేశారు. కార్మికుల పట్టుదల వల్లే ఆర్టీసీ నేడు దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలిచిందని కొనియాడారు. సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపైనే ఉందని, రాజకీయ ప్రభావాలకు లోనైతే సంస్థ నష్టపోతుందని హితవు పలికారు.

**అంతర్జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాలు**

ఆర్టీసీని మరింత ఆధునీకరించే దిశగా ప్రభుత్వం భారీ ప్రణాళికలు రూపొందిస్తోందని సీఎం తెలిపారు. శంషాబాద్ ప్రాంతంలో 150 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ టర్మినల్‌ను నిర్మిస్తామని, అలాగే గాజులరామారంలో మరో టర్మినల్ కోసం 100 ఎకరాలు కేటాయించామని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యార్థం 1000 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి, వాటిని మెట్రో రైలు సర్వీసులతో అనుసంధానం చేస్తామన్నారు. దీనివల్ల ఆర్టీసీపై ఏటా పడుతున్న రూ. 2000 కోట్ల డీజిల్ భారం తగ్గుతుందని, ఆ ఆదాయాన్ని సంస్థ ప్రగతికి వాడుకోవచ్చని సూచించారు.

**బకాయిల చెల్లింపు.. కారుణ్య నియామకాలు**

గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను తమ ప్రభుత్వం క్లియర్ చేస్తోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి రూ. 1000 కోట్ల బకాయిలను విడుదల చేశామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల ప్రక్రియను కూడా వేగవంతం చేశామన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించినప్పటి నుండి ప్రభుత్వం సుమారు రూ. 8 వేల కోట్లను ఆర్టీసీకి అందజేసిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని వివరించారు.

**యూనియన్ల ఎన్నికలు.. పీఆర్సీపై చర్చిద్దాం**

ఆర్టీసీలో యూనియన్ల గుర్తింపు, విలీనం వంటి అంశాలపై కార్మిక సంఘాలే ఒక స్పష్టమైన ప్రణాళికతో రావాలని సీఎం కోరారు. పీఆర్సీ వంటి ఆర్థిక అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ముందు ఆప్షన్లు ఉంచాలని, అధికారులకు, కార్మికులకు మధ్య ఎటువంటి అగాధం ఉండకూడదని సూచించారు. ఆర్టీసీలో ఒక్క డ్రైవర్‌ను కూడా తొలగించే ప్రసక్తి లేదని, సంస్థ మనుగడకు కార్మికుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆదేశాలు**

సమ్మె కాలపు వేతనాలు, కేసుల ఎత్తివేతపై కార్మిక సంఘాల విన్నపానికి సీఎం తక్షణమే స్పందించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిలను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ ఠాగూర్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంతో ఆర్టీసీ కార్మికుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# పాయకరావుపేట అభివృద్ధికి బాటలు



- రామచంద్రపురం పర్యటనలో హోం మంత్రి అనిత
- - ప్రజలకు అభివృద్ధిపై హామీల జల్లు
- - నియోజకవర్గంలో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ
- - ఇంటింటికీ వెళ్లి స్వయంగా పింఛన్ల పంపిణీ

**పాయకరావుపేట వెలుతురు మే 01::**

పాయకరావుపేట నియోజకవర్గంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. కోటవురట్ల మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చేరుకున్న ఆమెకు గ్రామస్థులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి స్వయంగా పింఛన్లను పంపిణీ చేసిన మంత్రి, గ్రామ ప్రజలతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ పర్యటనలో భాగంగా సుంకుపురు గ్రామంలో జరుగుతున్న గంగమ్మ తల్లి పండగలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**గ్రామ ప్రగతికి కూటమిసర్కార్ అంకితం**

అనంతరం జరిగిన బహిరంగ సభలో హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, ఇప్పుడు తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గ రూపురేఖలు మారుస్తున్నామని చెప్పారు. రామచంద్రపురం గ్రామంలోనే సుమారు కోటి 16 లక్షల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు ఆమె వెల్లడించారు. 201419 మధ్య తాము శంకుస్థాపన చేసిన పందూర్ బ్రిడ్జిని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, ఇప్పుడు మళ్లీ తామే చొరవ తీసుకుని పూర్తి చేశామని గుర్తుచేశారు.

**రాజకీయ గుర్తింపు.. ఎన్టీఆర్ స్ఫూర్తి**

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా తనకు రెండోసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్‌లకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తన నియోజకవర్గంలో ఆరాధ్య దైవం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శ్రామిక శక్తికి వందనం చేస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థకు కార్మికులు, కర్షకులే నిజమైన పునాదులని ఆమె కొనియాడారు.

**సంక్షేమంలో ఏపీ నంబర్ వన్**

దేశంలోనే అత్యధికంగా పింఛన్లు అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని మంత్రి అనిత గర్వంగా ప్రకటించారు. లబ్ధిదారులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా నేరుగా ఇంటికే వెళ్లి పింఛన్ అందించే విధానం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం (NREGS) కింద రూ. 40 కోట్లు, రోడ్లు మరియు భవనాల శాఖ ద్వారా మరో రూ. 40 కోట్ల నిధులతో రహదారుల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.

పారిశ్రామిక హబ్‌గా పాయకరావుపేట రాబోయే రోజుల్లో పాయకరావుపేట నియోజకవర్గం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందబోతోందని హోంమంత్రి ధీమా వ్యక్తం చేశారు. కొత్త పరిశ్రమల రాకతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ముఖ్యంగా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ఈ ప్రాంతాన్నే మార్చేస్తుందని, కోటవురట్ల మండలంలో కూడా మరిన్ని పరిశ్రమలు తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల్లో సామాజిక భద్రతతో పాటు ఆర్థిక అభివృద్ధి సాధించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆమె పునరుద్ఘాటించారు.

# దేశంలోనే మొట్టమొదటి.. పురాతన శాస్త్రాల ఆధారిత "దోష నివారణ" యాప్

- 5000 ఏళ్ల పురాతన బృహత్ పరాశర హోర శాస్త్రం ఆధారంగా "దోష నివారణ" యాప్ ను రూపొందించిన హైదరాబాద్‌కు చెందిన ఆజా ఆస్ట్రోటెక్ సంస్థ
- పరాశర మహర్షి రచించిన ప్రాచీన వేద జ్యోతిష్య సూత్రాలను విశ్లేషించి, వాటిని ఆధునిక సాఫ్ట్‌వేర్ ఇంజిన్‌గా రూపొందించిన సంస్థ
- సాంకేతికత, పురాణాల మేళవింపుతో .. ప్రతీ ఒక్కరి దోషాలు, సమస్యలు గుర్తించి, పరిష్కరించే అద్భుతమైన అప్లికేషన్ ప్రారంభం
- ఒక్క అప్లికేషన్ తో, మనిషిని వేధిస్తున్న అనేక అవరోధాలను గుర్తించడమే కాదు, తక్షణ పరిష్కారాలు అందించడం ఆ యాప్ ప్రత్యేకత
- వివాహాలు, గృహప్రవేశాలు వంటి 19 కీలక కార్యక్రమాలకు ముహుర్తాలకు సహాయ









**సహకారాలు అందించే "దోష నివారణ" యాప్**

**హైదరాబాద్ వెలుతురు మే 01:**

AI యుగంలోనూ సమస్త మానవాళికి ఉపయోగపడేలా ఓ అద్భుతమైన యాప్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటిదాకా వచ్చిన అనేక అప్లికేషన్లు కేవలం టెక్నాలజీ మీద ఆధారపడగా.. తొలిసారిగా AI తో పాటు, పురాతన శాస్త్రాల ఆధారంగా పనిచేసే సరికొత్త యాప్ విడుదలైంది. దేశంలోనే మొట్టమొదటి సారిగా.. ఒక్క అప్లికేషన్ తో, మనిషిని వేధిస్తున్న అనేక అవరోధాలను గుర్తించడమే కాదు, తక్షణ పరిష్కారాలు అందించడం ఆ యాప్ ప్రత్యేకత. ఈ యాప్ ను రూపొందించింది ఎవరో కాదు.. మన హైదరాబాదీలే. హైదరాబాద్‌కు చెందిన ఆజా ఆస్ట్రోటెక్ కంపెనీ 5000 ఏళ్ల పురాతన బృహత్ పరాశర హోర శాస్త్రం ఆధారంగా "దోష నివారణ" యాప్‌ను ప్రారంభించింది. సమస్యలు మరియు దోషాలను గుర్తించి, బృహత్ పరాశర హోర శాస్త్రం సూత్రాల ప్రకారం సమర్థవంతమైన పరిష్కార మార్గాలను అందించే వేద ఆధారిత అప్లికేషన్ ఇది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఫీనిక్స్ గ్రూప్ డైరెక్టర్ బడిగా శ్రీకాంత్, రిటైర్డ్ జిల్లా జడ్జి హేమంత్ కుమార్ దింత్యాల, అలాగే టీహబ్ మాజీ సీఈఓ శ్రీనివాస్ రావు మహంకాళి కలిసి ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఇది పూర్తిగా బృహత్ పరాశర హోర శాస్త్రం ప్రాథమిక సూత్రాలపై రూపొందించిన ప్రత్యేక డిజిటల్ ప్లాట్‌ఫామ్ అని తెలిపారు కంపెనీ సీఈఓ ఫణిరాజ్ జలిగామా. "ప్రస్తుత అప్లికేషన్లు ఎక్కువగా AI పద్ధతుల ఆధారంగా రూపొందుతున్నాయి. కానీ మా సాఫ్ట్‌వేర్ వ్యవస్థ పూర్తిగా భిన్నంగా ఉంటుంది. కేవలం సాంకేతికతతో అంచనా వేసే AIకి బదులుగా, పరాశర మహర్షి రచించిన ప్రాచీన వేద జ్యోతిష్య సూత్రాలను విశ్లేషించి, వాటిని ఆధునిక సాఫ్ట్‌వేర్ ఇంజిన్‌గా రూపొందించాం" అని చెప్పారు. ఈ అప్లికేషన్ వినియోగదారుడి జనన సమయానికి సంబంధించిన గ్రహస్థితులను విశ్లేషించి "కాస్మిక్ బ్లూ ప్రింట్"ను రూపొందిస్తుంది. యోగాలు, దోషాలు, సరైన పరిహారాలు, వ్యక్తిగత రిపోర్టులు మరియు ముహూర్త సేవలను అందించడం దీని ప్రధాన లక్ష్యం. ఈ వ్యవస్థ వివాహాలు, గృహప్రవేశాలు, కొత్త ఉద్యోగంలో చేరడం వంటి ముఖ్య సందర్భాలతో పాటు సిసెక్షన్ ప్రసవాలు లేదా ప్రణాళికాబద్ధ శస్త్రచికిత్సల కోసం కూడా శుభ ముహూర్తాలను సూచించగలదు. భారతీయ ప్రవాసులకు సులభంగా అందుబాటులో ఉండేలా ఈ యాప్‌ను ప్రస్తుతం తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రారంభించినట్లు ఫణిరాజ్ తెలిపారు. జూన్ నెలలో మరో 11 భారతీయ భాషల్లో కూడా ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ అప్లికేషన్ మీ స్మార్ట్ ఫోన్ లో ఉంటే, ప్రతి ఇంట్లో ఒక నిపుణుడైన జ్యోతిష్యుడు ఉన్నట్టే అని యాప్ రూపకర్తలు తెలిపారు.

# కార్మికులే దేశ ప్రగతి చక్రాలు

- అందరికీ అండగా ఉంటామన్న 'కూటమి' సర్కార్
- - రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా మే డే వేడుకలు
- - శ్రామిక లోకానికి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

**అమరావతి వెలుతురు మే 01:**





నవ్యాంధ్రలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. శ్రమనే నమ్ముకున్న శ్రామిక లోకం ఏకమై మే డే వేడుకలను ఉత్సాహంగా జరుపుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా మంత్రులు, ప్రజాప్రతినిధులు కార్మిక లోకానికి శుభాకాంక్షలు తెలుపుతూ, వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పల్లె నుంచి పట్నం వరకు ఎర్రజెండాలు రెపరెపలాడగా, కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కార్యక్రమాలు జరిగాయి.

**కార్మికులే దేశ పురోగతికి ఆధారం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వృత్తి ఏదైనా శ్రమించే ప్రతి మనిషికి సమాన గౌరవం ఇవ్వడమే తమ ప్రభుత్వ కర్తవ్యమని అన్నారు. దేశ ఆర్థిక పురోగతికి రైతులు, రైతు కూలీల శ్రమశక్తే వెన్నెముక అని పేర్కొన్నారు. కార్మికులు, కర్షకులు కలిసి నడిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని, వారి సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తుందని భరోసా ఇచ్చారు. చారిత్రాత్మకమైన ఈ దినోత్సవం శ్రామిక వర్గ హక్కులను గుర్తించే పండుగ అని అభివర్ణించారు.

**శ్రామికులకు నూతన గౌరవం - పవన్ కల్యాణ్**

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దేశ ప్రగతిని నడిపించే రథచక్రాలతో కార్మికులను పోల్చారు. ముఖ్యంగా అసంఘటిత రంగం, ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారి గౌరవాన్ని పెంచేలా 'కూలీలు' అనే పదాన్ని 'శ్రామికులు'గా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. వారి కుటుంబాలకు భరోసా ఇచ్చేలా పరిహార మొత్తాన్ని కూడా పెంచామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మ్యాజిక్ డ్రెయిన్స్, ఫారంపాండ్స్ వంటి కార్యక్రమాలపై రూపొందించిన ప్రత్యేక వీడియోను పవన్ విడుదల చేశారు. ఇందులో ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధు, నటుడు నాని వంటి వారు పాల్గొనడం విశేషం.

**మంత్రి నిమ్మల రిక్షా ప్రయాణం**

పాలకొల్లులో జరిగిన వేడుకల్లో మంత్రి నిమ్మల రామానాయుడు వినూత్నంగా పాల్గొన్నారు. కార్మికులతో మమేకమవుతూ మండుటెండలో సుమారు 4 కిలోమీటర్ల మేర ఆయనే స్వయంగా రిక్షా తొక్కి ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఏటా కార్మికులతో కలిసి ఇలా ప్రయాణించడం తనకు ఎంతో ఆనందాన్నిస్తుందని చెప్పారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో కార్మిక రంగం చిన్నాభిన్నమైందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే మళ్లీ కార్మికులకు మంచి రోజులు వచ్చాయని ఆయన విమర్శించారు.

**లోకేశ్ సందేశం: శ్రమతోనే అభివృద్ధి**


మంత్రి నారా లోకేశ్ శ్రమజీవులకు అభినందనలు తెలుపుతూ.. శ్రామికుడు లేనిదే ఈ ప్రపంచమే లేదని వ్యాఖ్యానించారు. కార్మికులు సమాజంలో తల ఎత్తుకుని గౌరవంగా జీవించాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని, అందుకోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. మరోవైపు మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల కళ్లలో ఆనందం చూసే వరకు ప్రభుత్వం విశ్రమించదని స్పష్టం చేశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ కూడా కార్మికుల ఆరోగ్య భద్రతపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.

**హక్కుల రక్షణ కోసం నినాదం**

అనకాపల్లి, కర్నూలు జిల్లాల్లో కార్మిక సంఘాలు భారీ ర్యాలీలు నిర్వహించాయి. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను రద్దు చేస్తూ కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదని సీఐటీయూ, సీపీఎం నేతలు అభిప్రాయపడ్డారు. సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి, కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి కార్మిక వర్గమంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కర్నూలులో సుందరయ్య విగ్రహానికి నివాళులర్పించి, కార్మిక చట్టాలను నీరుగార్చే ప్రయత్నాలను అడ్డుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. మొత్తానికి ఏపీ వ్యాప్తంగా మే డే వేడుకలు శ్రామిక గర్జనలతో, ప్రభుత్వ హామీలతో ఘనంగా ముగిశాయి.

# అనంతబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై ఉత్కంఠ

**విజయవాడ వెలుతురు మే 01:**



తన మాజీ డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సాక్షులను బెదిరించి బెయిల్ నిబంధనలను ఉల్లంఘించారన్న ఆరోపణలపై ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌పై రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టులో వాదనలు పూర్తయ్యాయి. ఈ మేరకు న్యాయమూర్తి తీర్పును ఈ నెల 6వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో సాక్షుల బెదిరింపుల కేసులో ప్రస్తుతం జైలులో ఉన్న అనంతబాబు దాఖలు చేసిన కొత్త బెయిల్ పిటిషన్‌పై కూడా కోర్టు విచారణ జరిపింది.

**సాక్షులను బెదిరించారన్న పోలీసుల వాదన**

ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో సాక్షులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారని పోలీసులు న్యాయస్థానానికి విన్నవించారు. తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే చంపి శవాలు కూడా దొరకకుండా చేస్తానంటూ వాట్సప్ వీడియో కాల్స్ ద్వారా ఆయన హెచ్చరించారని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ (స్పెషల్ పీపీ) ముప్పాళ్ల సుబ్బారావు కోర్టులో వాదించారు. సాక్షులకు డబ్బు ఆశ చూపి ప్రలోభపెట్టడమే కాకుండా, మాట వినని వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ఆయన బయట ఉంటే విచారణ సజావుగా సాగదని బెయిల్ రద్దు చేయాలని కోరారు.

**నిబంధనల ఉల్లంఘనపై విచారణ**

గతంలో సుబ్రమణ్యం హత్య కేసులో 218 రోజుల పాటు రిమాండ్‌లో ఉన్న అనంతబాబుకు సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే, సాక్షులను బెదిరించడం ద్వారా ఆయన ఆ షరతులను ఉల్లంఘించారని పోలీసులు రాజమహేంద్రవరం కోర్టును ఆశ్రయించారు. ఈ ఉల్లంఘనల పై ఇప్పటికే వాదనలు పూర్తయ్యాయి. ఈ రోజు తీర్పు వస్తుందని అందరూ భావించినప్పటికీ, న్యాయమూర్తి దీనిని ఈ నెల 6వ తేదీకి వాయిదా వేశారు.

**కొత్త బెయిల్ పిటిషన్‌పై వాదనలు**

సాక్షులను బెదిరించిన కొత్త కేసులో అనంతబాబు ప్రస్తుతం జైల్లో ఉన్నారు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జరిగిన విచారణలో అనంతబాబు తరపు న్యాయవాదులు వాదిస్తూ.. సాక్షుల బెదిరింపుల కేసులో ఎమ్మెల్సీ ప్రమేయం ఏమీ లేదని, రాజకీయ ఉద్దేశాలతోనే తప్పుడు ఆధారాలతో కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. ఆయనను జైల్లో ఉంచాల్సిన అవసరం లేదని న్యాయస్థానానికి వివరించారు.

**కస్టడీ పిటిషన్ మరియు తదుపరి చర్యలు**

మరోవైపు, సాక్షుల బెదిరింపుల కేసులో అనంతబాబును తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కాకినాడ కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు ఇప్పటికే ముగియగా, ఈ నెల 4వ తేదీన కాకినాడ కోర్టు తన నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఈ అంశాన్ని అనంతబాబు న్యాయవాదులు రాజమహేంద్రవరం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అన్ని పరిణామాలను పరిశీలించిన రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టు జడ్జి, అటు బెయిల్ రద్దు పిటిషన్, ఇటు కొత్త బెయిల్ పిటిషన్ రెండింటిపై ఈ నెల 6న ఒకేసారి తీర్పు వెలువరిస్తామని స్పష్టం చేశారు. దీంతో మే 6వ తేదీన వెలువడబోయే తీర్పు ఎమ్మెల్సీ అనంతబాబు రాజకీయ మరియు న్యాయపరమైన భవిష్యత్తును నిర్ణయించనుంది.

# మే మాసంలో మూడున్నర కోట్ల పనిదినాలు పూర్తి చేయాలి

**హైదరాబాద్ వెలుతురు మే 01**







గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో డీఆర్డీఓలు, ఎంపీడీవోలు మరియు సంబంధిత అధికారులతో ములుగు నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ స్పెషల్ సీఎస్ దాన కిషోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మే మాసం ఉపాధి హామీ పథకం అమలులో అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఉపాధి కోరిన ప్రతి కుటుంబానికి పనిని కల్పించడం ప్రధాన లక్ష్యంగా సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి పనులపై డిమాండ్ అధికంగా ఉన్నందున, సాంకేతిక, ఇతర సమస్యలను అధిగమించి ప్రతి కూలీకి పని అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
మే మాసంలో కనీసం మూడున్నర కోట్ల పనిదినాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ఏప్రిల్ మాసంలో అధికారులు యజ్ఞంలా పనిచేసి కోటిన్నర పనిదినాలను పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం పంట కోతలు ముగియడంతో ఉపాధి కూలీ పనులకు డిమాండ్ మరింత పెరుగుతుందని, అర్హులైన అన్ని కుటుంబాలకు ఉపాధి కల్పించాలని స్పష్టం చేశారు.
ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పని ప్రాంతాల్లో కూలీలకు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ వంటి మౌలిక సదుపాయాలను తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. కూలీల ఆరోగ్యాన్ని కాపాడుతూ ఉపాధి పనులు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదే విధంగా, తీవ్ర ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు నిర్వహించేలా ప్లాన్ చేయాలని సూచించారు. అలాగే తక్కువగా ఉపాధి పనులు జరుగుతున్న మండలాలు, గ్రామ పంచాయతీలను స్వయంగా పర్యవేక్షించాలని, పనిదినాల లక్ష్య సాధనకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి హాబిటేషన్‌లో పనులు ప్రారంభించడం, ప్రతి ఉపాధి కోరుకునే వ్యక్తికి పని కల్పించడం, ప్రతి పని ప్రదేశంలో తగిన సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 20 ఉపాధి పనులను అందుబాటులో ఉంచడం, ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించడం, ప్రత్యేక అధికారులను నియమించి పనుల పురోగతిని మెరుగుపరచడం వంటి చర్యలను ఖచ్చితంగా అమలు చేయాలని మంత్రి సీతక్క సూచించారు. గ్రామ స్థాయిలో సర్పంచ్‌లతో కలిసి ఉపాధి కోరే కూలీలతో సమావేశాలు నిర్వహించి అవగాహన పెంచాలని, ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సమర్థవంతంగా సాధించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

# బుద్ధవనంలో ఆధ్యాత్మిక సౌరభం - ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు



- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు
- •బౌద్ధ వారసత్వానికి పూర్వవైభవం తెస్తాం: మంత్రి



**నాగార్జున సాగర్, వెలుతురు మే 1:**

ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధ వారసత్వ క్షేత్రం నాగార్జున సాగర్‌లోని 'బుద్ధవనం' ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. బుద్ధ పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం ఇక్కడ నిర్వహించిన ప్రత్యేక వేడుకల్లో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**బుద్ధ వనం చేరుకున్న వీరు ముందుగా బుద్ధ**

చరిత వనంలోని బుద్ధుడి పాదాల వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం వందన సమర్పణతో పుష్పాంజలి ఘటించారు. మహాస్తూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో బౌద్ధ సంప్రదాయబద్ధంగా ప్రార్థనలు నిర్వహించి ధ్యానం చేశారు. బుద్ధవనం విశేషాలను తెలియజేశారు.
శాంతి మార్గమే ప్రపంచానికి శరణ్యం: మంత్రి జూపల్లి ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గౌతమ బుద్ధుని బోధనలు ఎప్పటికీ ఆచరణీయమని కొనియాడారు. ప్రపంచానికి శాంతి, అహింసల మార్గాన్ని చూపిన మహనీయుడు బుద్ధుడు. ద్వేషం ఉన్న చోట ప్రేమను, అశాంతి ఉన్న చోట ప్రశాంతతను నెలకొల్పడమే బౌద్ధ ధర్మం యొక్క ప్రధాన ఉద్దేశ్యం అని చెప్పారు. తెలంగాణ గడ్డపై బౌద్ధ వారసత్వ సంపద పుష్కలంగా ఉందని, నాగార్జున సాగర్‌లోని బుద్ధవనాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ పర్యాటక కేంద్రంగా మరింత తీర్చిదిద్దుతామని, ఇక్కడికి వచ్చే పర్యాటకుల కోసం మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే కాకుండా, బుద్ధుని జీవిత విశేషాలను భావితరాలకు తెలియజేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తాం అని మంత్రి స్పష్టం చేశారు. బౌద్ధమత ప్రాశస్త్యాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రాంగణమంతా దీపాలతో అలంకరించడంతో బుద్ధవనం దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఈ వేడుకల్లో నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ (TGTDC) ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, టీజీటీడీసీ ఎండీ గౌతమి, డైరెక్టర్ ఆఫ్ టూరిజం లక్ష్మణ్ రంజిత్ నాయక్, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, ఇతర అధికారులు, బౌద్ధ భిక్షువులు పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా 'లేబర్ అడ్డా'

- ఏపీలో సరికొత్త సంస్కరణలకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- రాష్ట్రవ్యాప్తంగా లేబర్ అడ్డాల నిర్మాణం
- తొలిదశలో 15 నగరాల్లో ఏర్పాటు

**అమరావతి వెలుతురు మే 01:**



రాష్ట్రంలోని కార్మిక లోకానికి మహర్దశ పట్టించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటనలు చేశారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కార్మికుల సంక్షేమం మరియు నైపుణ్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్పష్టం చేశారు. కేవలం కూలీలుగానే కాకుండా, కార్మికులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే తన ఆకాంక్ష అని వెల్లడించారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా అత్యాధునిక 'లేబర్ అడ్డా'ల నిర్మాణంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**నైపుణ్యంతోనే కార్మికుల రాత మారుతుంది**

కార్మికుల పిల్లలు భవిష్యత్తులో పరిశ్రమలు స్థాపించే స్థాయికి ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యాధునిక పనిముట్లను తెప్పించి, లేబర్ అడ్డాలను కేవలం నిరీక్షణ కేంద్రాలుగా కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుతామన్నారు. తొలిదశలో రాష్ట్రంలోని 15 ప్రధాన నగరాల్లో ఈ లేబర్ అడ్డాలను ప్రయోగాత్మకంగా నిర్మిస్తామని, అక్కడ కార్మికులకు ఆధునిక పరికరాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలను 'నైపుణ్యం పోర్టల్'తో అనుసంధానించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నట్లు వెల్లడించారు.

**వైద్య రంగంలో భారీ మార్పులు**

రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని సీఎం అన్నారు. రాజధాని అమరావతిలో భారీ ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మించడంతో పాటు అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలు, శ్రీసిటీ, తిరుపతి ప్రాంతాల్లో కూడా కొత్త ఈఎస్ఐ ఆసుపత్రులను అందుబాటులోకి తెస్తామన్నారు. మహిళా సాధికారతపై మాట్లాడుతూ.. చట్టసభల్లో ఆడబిడ్డలకు 33 శాతం రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. మహిళలు చట్టసభల్లో ఉంటేనే ఆ సభలకు నిజమైన గౌరవం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు

**కృష్ణా జిల్లా అభివృద్ధికి సరికొత్త బాటలు**

కృష్ణా జిల్లా భవిష్యత్తును మార్చే దిశగా బందర్ పోర్టు నిర్మాణాన్ని వేగవంతం చేశామని సీఎం తెలిపారు. ఇప్పటికే 57 శాతం పనులు పూర్తయ్యాయని, డిసెంబర్ నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లాను ఆర్థికంగా బలోపేతం చేస్తామన్నారు. భారత్ మాలా ప్రాజెక్టులో భాగంగా మచిలీపట్నం బైపాస్ రోడ్డును 6 వరుసలుగా అభివృద్ధి చేస్తున్నామని, హైదరాబాద్ మచిలీపట్నం హైవేను ఎక్స్‌ప్రెస్ రోడ్డుగా తీర్చిదిద్దుతామని వివరించారు. కృష్ణా పుష్కరాల నాటికి జిల్లాలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని రైతులకు భరోసా ఇచ్చారు.

**పింఛన్ల పంపిణీలో ఏపీ నంబర్ వన్**

పేదల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఏటా రూ. 33 వేల కోట్లను పింఛన్ల కోసం ఖర్చు చేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత భారీ మొత్తాన్ని కేటాయించడం లేదని చంద్రబాబు గుర్తుచేశారు. దీనిని తాము భారంగా భావించడం లేదని, ఒక బాధ్యతగా స్వీకరిస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగానే తెలుగుదేశం పార్టీ జెండాలో నాగలి, కార్మికుడు, గుడిసెను చేర్చారని.. ఆ స్ఫూర్తితోనే తాము ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు

**ఎమ్మెల్యేలకు సీఎం హెచ్చరిక**

ప్రజాప్రతినిధుల పనితీరుపై ముఖ్యమంత్రి కఠినంగా వ్యవహరించారు. ఇకపై తాను నిర్వహించే ప్రతి సమావేశంలోనూ సంబంధిత ఎమ్మెల్యే పనితీరుపై ప్రజలనే అడుగుతానని చెప్పారు. ప్రజల నుంచి సానుకూల స్పందన రాని పక్షంలో ఆ ఎమ్మెల్యేకు అండగా ఉండబోనని కుండ బద్దలు కొట్టారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పనితీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడంతో ఆయన్ను వేదికపైనే అభినందించారు.

**విధ్వంసక రాజకీయాలపై విమర్శలు**

గత ప్రభుత్వ తీరును ఎండగడుతూ జగన్ నేతృత్వంలోని వైసీపీపై చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. అవకాశం వస్తే అందరినీ నాశనం చేయడం గొడ్డలి పార్టీ నాయకుడి నైజమని ఆరోపించారు. అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులను నాశనం చేశారని మండిపడ్డారు. ప్రజావేదికను నిర్మించిన రెండు గంటల్లోనే కూల్చివేసిన సంస్కృతి వారిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించి, ఆంధ్రప్రదేశ్‌కు పూర్వవైభవం తీసుకురావడమే తమ లక్ష్యమని, ఇందుకోసం ప్రజలందరూ సహకరించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు

# వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరకు రెక్కలు



**ఢిల్లీ వెలుతురు మే 01 :** దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. అంతర్జాతీయంగా ఇంధన ధరల పెరుగుదల నెపంతో చమురు సంస్థలు 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరను ఏకంగా రూ. 993 మేర పెంచేశాయి. ఈ పెంపుతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిరు వ్యాపారులపై పెను భారం పడనుంది. పోలింగ్ ముగిసిన మరుసటి రోజే ఈ నిర్ణయం తీసుకోవడంపై ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీని 'ద్రవ్యోల్బణ వీరుడు' (ఇన్‌ఫ్లేషన్ మ్యాన్) అంటూ కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రూ. 1,518 మేర ధర పెరగడం మోదీ మార్క్ వసూళ్లకు నిదర్శనమని విమర్శించింది.

నెలనెలా పెరుగుదల.. రికార్డు స్థాయిలో ధరలు

కేంద్ర ప్రభుత్వం ఒక వ్యూహం ప్రకారం నెలనెలా గ్యాస్ ధరలను పెంచుకుంటూ పోతోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ ఏడాది జనవరిలో రూ. 111, ఫిబ్రవరిలో రూ. 50, మార్చిలో రెండు విడతలుగా కలిపి రూ. 146, ఏప్రిల్‌లో రూ. 218 పెంచిన ప్రభుత్వం.. తాజాగా మే 1న ఏకంగా రూ. 993 పెంచిందని గణాంకాలతో సహా పోస్ట్ చేసింది. కేవలం 120 రోజుల వ్యవధిలోనే సిలిండర్ ధర రూ. 1,518 పెరగడం దేశ ఆర్థిక వ్యవస్థపై, చిన్న వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని కాంగ్రెస్ ఆవేదన వ్యక్తం చేసింది. ఏడాదిలో ఇంకా 8 నెలలు మిగిలి ఉన్నాయని, మోదీ 'ధరల బాదుడు' మున్ముందు ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేసింది.

పోలింగ్ ముగియగానే అసలు రంగు!

ఏప్రిల్ 29న పోలింగ్ ముగిసిన వెంటనే ఈ పెంపు నిర్ణయం వెలువడటంపై కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ఉద్దేశపూర్వక చర్యేనని ఆయన మండిపడ్డారు. ఓట్లు పడే వరకు ధరలను నియంత్రించి, పోలింగ్ అవ్వగానే ప్రజలపై భారం మోపడం బీజేపీ నైజమని విమర్శించారు. ఈ ధరల పెరుగుదల వల్ల సామాన్యుడు టీ తాగాలన్నా, హోటల్‌కు వెళ్లాలన్నా భయపడే పరిస్థితి వచ్చిందని ఆయన అన్నారు. పద్ధతి ప్రకారం ధరలను పెంచుతూ చిన్న వ్యాపారాలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు.

అఖిలేష్ యాదవ్ సెటైర్లు: సామాన్యుడి పళ్లెం ఖరీదైంది!

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కూడా ఈ ధరల పెంపుపై తనదైన శైలిలో స్పందించారు. గ్యాస్ సిలిండర్ ఖరీదు కావడం అంటే సామాన్యుడి పళ్లెంలోని రొట్టె ఖరీదు కావడమేనని ఆయన అన్నారు. "బీజేపీ ప్రభుత్వం ధరలను ఒకేసారి రూ. 1000 పెంచాల్సింది, ఆ ఏడు రూపాయల తగ్గింపు ఎవరి కోసం?" అంటూ ఎద్దేవా చేశారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణంపై బీజేపీ ఎప్పుడు చర్చ చేపడుతుందని ఆయన ప్రశ్నించారు. దొంగిలించి తినే వారికి లేదా ఇతరుల ఇళ్లలో తినే వారికి సామాన్యుడి కష్టాలు తెలియవని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

జెట్ ఇంధనం ధరలూ పైపైకి

గ్యాస్ ధరలతో పాటు విమాన ఇంధనం ధరలు కూడా వరుసగా రెండో నెల పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరల పెరుగుదల దృష్ట్యా ఏటీఎఫ్ ధరను 5 శాతం పెంచినట్లు చమురు సంస్థలు వెల్లడించాయి. ఢిల్లీలో కిలోలీటరుకు ఏటీఎఫ్ ధర 1511.86 డాలర్లకు చేరింది. దీనివల్ల రానున్న రోజుల్లో విమాన ప్రయాణ ఛార్జీలు పెరిగే అవకాశం ఉంది. అయితే గృహ వినియోగ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ ధరల్లో మాత్రం ప్రస్తుతానికి ఎలాంటి మార్పు లేదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్పష్టం చేసింది.

విండ్‌ఫాల్ పన్నులో మార్పులు

చమురు సంస్థలకు ఊరటనిస్తూ డీజిల్ మరియు ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ పన్నును కేంద్రం తగ్గించింది. డీజిల్ ఎగుమతులపై పన్నును లీటరుకు రూ. 23కు, ఏటీఎఫ్ ఎగుమతులపై రూ. 33కు కుదించింది. అంతర్జాతీయంగా పెరిగిన భారాన్ని తామే భరిస్తున్నామని ఐఓసీ చెబుతున్నప్పటికీ, వాణిజ్య సిలిండర్ ధరల పెంపు మాత్రం మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరగడానికి దారితీస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మేడ్చల్‌లో జిల్లాలో మిన్నంటిన మే డే సంబరాలు






**హైదరాబాద్ వెలుతురు మే 01 :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో శ్రామిక లోకానికి ఘన నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనూ చౌదరి కార్మికులకు శుభాకాంక్షలు తెలుపుతూ, సమాజ నిర్మాణంలో వారి పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ ఆర్థికాభివృద్ధికి పునాది అయిన కార్మికుల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. కార్మిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, శ్రామికుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు ఉద్ఘాటించారు. ఈ వేడుకల్లో భాగంగా విధుల్లో ప్రతిభ కనబరిచిన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అంజనేయులు, డా. కనక దుర్గాదేవి, ఐటీఐ ప్రిన్సిపాల్ హనుమా నాయక్, మనోహర్ రెడ్డిలను అధికారులు ఘనంగా సత్కరించారు. ముఖ్యంగా బాల కార్మికత్వం నుండి రక్షించబడి, ప్రస్తుతం చదువులో రాణిస్తున్న కుమారి మీనాను "బెస్ట్ చైల్డ్ సర్వైవర్"గా గుర్తించి సత్కరించడం అందరినీ ఆకట్టుకుంది. కార్మికులకు తమ హక్కులు, కొత్త కార్మిక చట్టాలపై అవగాహన కల్పించేందుకు మే 2 నుండి 10 వరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లేబర్ కమిషనర్ లక్ష్మీపతి, ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ రాధిక తదితరులు పాల్గొని నైపుణ్యాభివృద్ధి మరియు సంక్షేమ పథకాల ఆవశ్యకతను వివరించారు.

# మార్క్ ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులతో పంటల కొనుగోళ్లపై మంత్రి సమీక్ష

- పంటల కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు
- గన్నీ బ్యాగుల సమస్యకు త్వరలోనే పరిష్కారం
- ప్రతీ విషయాన్ని రాద్ధాంతం చేసి, రాజకీయ పబ్బం గడుపుతున్నారు అని ప్రతిపక్షాలు పై మండిపాటు
- పంటల కొనుగోళ్లపై ఈ రెండు సంవత్సరాల లెక్కలు , గత ప్రభుత్వ కొనుగోళ్ల చూసి మాట్లాడాలని ప్రతిపక్షాలకు హితవు.
- పంట కొనుగోళ్లలో తెలంగాణ దేశానికే ఆదర్శం
- దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని ప్రధాన పంటలను మద్ధతు ధరకు కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్ర ప్రభుత్వం మా ప్రజా ప్రభుత్వం
- PSS స్కీంలో కేంద్రం కొనే పప్పధాన్యాలు, నూనెగింజలలో పంటలలోనూ 25% కేంద్ర పరిమితికి మించి కొనుగోలు చేసి రైతులకు ఊరట కల్పిస్తున్నాము – మంత్రి తుమ్మల
- కేంద్రం కొనుగోలు చేయని జొన్న, మొక్కజొన్న పంటలను కూడా మద్ధతు ధర చెల్లించి, రైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నాము - మంత్రి తుమ్మల



హైదరాబాద్ వెలుతురు మే 01: పంట కొనుగోళ్లలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం దర్పంగా నిలిచిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రోజున సచివాలయంలో మార్క్ ఫెడ్ మరియు వ్యవసాయ శాఖ అధికారులతో పంటల కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ.. వరి, గోదుమ పంటలు కాకుండా ఇతర ప్రధాన పంటలకు మద్ధతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్న రాష్ట్రాలు దేశంలోనే ఒకటి, రెండు అనీ, అవి కూడా ఒకటి, రెండు పంటలు మాత్రమే కొనుగోలు చేస్తాయని.. కాని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులు నష్టపోకుండా ప్రభుత్వమే భారాన్ని భరించి మద్ధతు ధరకు పంటలను సేకరిస్తున్నట్టు వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం విధానాలతో రాష్ట్రంలో పంటల దిగుబడి గణనీయంగా పెరిగింది. ఇలాంటి సమయంలో కొనుగోళ్లు నిర్వహించి, రాష్ట్రానికి, రాష్ట్ర రైతాంగానికి అండగా ఉండాల్సిన కేంద్రం నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరిస్తుంది. కేవలం పంటలకు మద్ధతు ధర ప్రకటించి, చేతులు దులుపుకుంటుంది. అసలు ఆ మద్ధతు ధర రైతులకు అందుతుందా..? కేంద్రం కొనుగోలు చేయకుండా.. రైతులకు ఏ విధంగా మద్ధతు ధర లభిస్తుంది.? బహిరంగ మార్కెట్లో అమ్ముకుందామంటే, కేంద్రం ప్రకటించిన మద్ధతు ధర కంటే సగానికి పైగా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులను రైతులు ఎదుర్కోవలసి వస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు పడకూడదని కేంద్రం కొనుగోలు చేయకున్నా... రైతులు ఆర్థికంగా నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో.. గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాల మేరకు ప్రభుత్వమే మార్క్ ఫెడ్ ద్వారా మద్ధతు ధర చెల్లించి, రైతుల వద్ద నుండి ప్రధాన పంటలను సేకరిస్తుంది. రైతులపై మార్కెట్లో ధరల ప్రభావం మూలంగా నష్టాలు రాకూడదని.. ప్రభుత్వమే పంటల కొనుగోళ్ల కోసం యేటా 2000 నుండి 3000 కోట్ల భారాన్ని భరిస్తుంది. కేంద్ర ప్రభుత్వం మద్ధతు ధర ప్రకటనలకే పరిమితమవ్వడంతో, రైతుల ఇబ్బందులు అపరిమితంగా పెరుగుతున్నాయి. సోయాబీన్, కందులు, పొద్దుతిరుగుడు, శనగలు, వేరుశనగ, పెసళ్లు వంటి పంటలను కేంద్రం NAFED ద్వారా కొనుగోలు చేస్తున్నప్పటికి... మొత్తం ఉత్పత్తిలో 25 శాతం మాత్రమే అనే పరిమితులు పెట్టడంతో... రైతు పండించిన మొత్తం పంటలో మిగతా పంట మొత్తాన్ని ఎక్కడ అమ్ముకోవాలో దిక్కుతోచని స్థితికి చేరుకుంటున్నారు. బహిరంగ మార్కెట్లో అమ్ముకుందామంటే తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రాష్ట్రంలో రెండేళ్ల నుండి పంట దిగుబడులు 150% అధికం అయ్యాయి. అయినప్పటికి కేంద్రం నిబంధనలలో ఎలాంటి సడలింపులు ఇవ్వడం లేదు. కేంద్రం ఎకరానికి విధించే దిగుబడి పరిమితులు ఎత్తివేయాలని మరియు మొక్కజొన్న, జొన్న వంటి పంటలను కూడా కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రం దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా కేంద్రం పట్టించుకోకుండా చోద్యం చూస్తుంది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్రం విధించిన పరిమితులకు మించి పొద్దుతిరుగుడు, సోయాబీన్ పంటలను సేకరించాము. ఇక అసలే కొనుగోలు చేయనటువంటి జొన్న, మొక్కజొన్న పంటలను కూడా కొనుగోలు చేశాము. 202324 సంవత్సరంలో 299 కోట్లతో 93,900 మెట్రిక్ టన్నుల జొన్నలు, 202425 సంవత్సరంలో 521 కోట్లతో 1.54 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేశాము. 202526 వానాకాలంలో 903 కోట్లతో 3.77 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న, ఈ యాసంగిలో ఇప్పటివరకు 1044 కోట్లతో 4.35 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాము. త్వరలో జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, జొన్న పంటను కూడా రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా సేకరిస్తాము. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జొన్నలను కొనుగోలు చేస్తున్నప్పటికీ, పిడిఎస్ పథకం కింద పరిమితులకు లోబడే కొనుగోలు చేస్తున్నారు. బీజేపీ పాలిత మహారాష్ట్ర రాష్ట్రంలో కూడా పరిమితులకు మించి కొనుగోలు చేయడం లేదు. గత పదేళ్ళలో ఎన్నడూ లేని విధంగా వరి ధాన్యాన్ని కూడా గత రెండు సంవత్సరాలుగా సివిల్ సప్లై ద్వారా రికార్డు స్థాయిలో కొనుగోలు చేశాము. సివిల్ సప్లయిస్ వారు సేకరించిన వడ్లలో కూడా FCI వారు అనేక కొర్రీలు పెట్టి సేకరిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అరకొర కొనుగోళ్లు చేసి, చేతులు దులుపుకొన్న ఒక పార్టీ, అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పంట కొనుగోళ్లపై ఉసే ఎత్తని ఇంకోపార్టీ రైతులలో ఆందోళనను సృష్టించే ప్రయత్నము మానుకోవాలి. గతంలో 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పటికి పంటల కొనుగోలు చేయలేక వరి సాగు వద్దు, మొక్కజొన్న సాగు వద్దు, పత్తి సాగు వద్దు అన్న విషయాన్ని రైతులు మర్చిపోలేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ పంటలకు మద్ధతు ధర ప్రకటించి వ్యవసాయాన్ని ఉద్ధరిస్తున్నామన్న భ్రమల్లో ఉన్నారు. వారు ప్రకటించిన మద్ధతు ధరకు చట్టబద్ధత లేకపోవడం, వారు అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా మద్ధతు ధరకు పంటల కొనుగోలు చేస్తున్నారో ఆలోచించుకొని మాట్లాడితే రైతులు హర్షిస్తారు. అక్కడక్కడా గన్ని బ్యాగుల కొరత, డీజిల్ కొరతతో ఇబ్బందులు వస్తున్న మాట వాస్తవం. ముడి జూట్ ధరలు (MSP కంటే చాలా ఎక్కువగా) గణనీయంగా పెరగడం వల్ల మొత్తం వ్యయ నిర్మాణం పెరిగి, గన్ని బ్యాగుల కొరత ఏర్పడుతుంది. అదేవిధంగా ఒకసారి ఉపయోగించిన గన్నీ సంచుల ధరలు ఇటీవల గణనీయంగా పెరగడం, జూట్ సాగు మరియు ఉత్పత్తి తగ్గుదల, బంగ్లాదేశ్ నుండి సరఫరా పరిమితులు వంటి పలు కారణాలు కలిసి ప్రభావం చూపుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు ఈ సంచుల వినియోగం వైపు మళ్లడం, కొత్త గన్నీ సంచుల ఉత్పత్తి తగ్గిపోవడం, ఉన్న సంచులను మళ్లీ మళ్లీ వినియోగించడం వల్ల మార్కెట్లో లభ్యత తగ్గింది. రాష్ట్రాల మధ్య ధరల వ్యత్యాసాలు, వ్యాపారుల నిల్వ ధోరణి మరియు తాత్కాలిక లాజిస్టిక్ సమస్యలు కూడా ధరల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి. వీటిని అవకాశంగా తీసుకొని రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం ప్రతిపక్షపార్టీ మానుకోవాలి. పశ్చిమ బెంగాల్లో ఎన్నికలు మరియు డీజిల్, పెట్రోల్ కొరతలో ఇబ్బందులు ఈ రెండు రాష్ట్ర ఆధీనంలో లేనప్పటికీ అధికారులు, మా ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ అన్ని పంటల కొనుగోలు చేపడ్తున్నారు.

# అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా గుట్టు రట్టు

ముంబయి వెలుతురు మే 01:

దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ముంబయి కేంద్రంగా సాగుతున్న భారీ అంతర్జాతీయ డ్రగ్స్ నెట్ వర్క్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఛేదించింది. సుమారు రూ. 1,745 కోట్ల విలువైన 349 కిలోల అత్యంత నాణ్యమైన (హైగ్రేడ్) కొకైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భారీ విజయంపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత భారత్‌ను నిర్మించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని, స్మగ్లర్లను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తామని ఆయన హెచ్చరించారు. ఒక చిన్న క్లూ ఆధారంగా మొత్తం నెట్ వర్క్‌ను పట్టుకోవడం ఎన్‌సీబీ సమర్థతకు నిదర్శనమని ఆయన కొనియాడారు.

**బాటమ్-టు-టాప్ విధానంతో విజయం**

ఈ ఆపరేషన్ గురించి అమిత్ షా సోషల్ మీడియా వేదికగా వివరిస్తూ.. ఎన్‌సీబీ అనుసరించిన 'బాటమ్‌టుటాప్' వ్యూహాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఒక చిన్న డ్రగ్స్ కన్సైన్‌మెంట్‌ను పట్టుకున్న అధికారులు, దాని మూలాలను వెతుకుతూ వెళ్లి చివరకు అంతర్జాతీయ స్థాయిలో విస్తరించిన భారీ నెట్ వర్క్‌ను ఛేదించగలిగారు. "మాదకద్రవ్యాల ముఠాలను నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని ప్రభుత్వం నిశ్చయించుకుంది. ఈ విజయం అంతర్జాతీయ మాదకద్రవ్యాల ముఠాపై సాధించిన పెద్ద విజయం" అని ఆయన పేర్కొన్నారు. అత్యున్నత నాణ్యత కలిగిన కొకైన్‌ను సీజ్ చేయడం ద్వారా దేశంలోకి భారీగా డ్రగ్స్ సరఫరా కాకుండా అడ్డుకోగలిగారు.

**సలీం డోలా రాకతో పెరిగిన ఉత్కంఠ**

ముంబయిలో భారీగా డ్రగ్స్ పట్టుబడటానికి ముందే, మోస్ట్ వాంటెడ్ డ్రగ్ ట్రాఫికర్ సలీం డోలాను తుర్కియే ప్రభుత్వం భారత్‌కు అప్పగించడం గమనార్హం. అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంకు అత్యంత సన్నిహితుడైన సలీంపై ఇప్పటికే రెడ్ కార్నర్ నోటీసులు ఉన్నాయి. 'ఆపరేషన్ గ్లోబల్ హంట్'లో భాగంగా భారత నిఘా సంస్థల సమాచారంతో తుర్కియే పోలీసులు ఇస్తాంబుల్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తరలించిన సలీంను ప్రస్తుతం ఎన్‌సీబీ అధికారులు విచారిస్తున్నారు. గతేడాది యూఏఈలో పట్టుబడిన సలీం కుమారుడు తాహెర్ ఇచ్చిన సమాచారం ఆధారంగానే ఈ అంతర్జాతీయ ఆపరేషన్ విజయవంతమైనట్లు తెలుస్తోంది.

**తెలుగు రాష్ట్రాల్లోనూ డ్రగ్స్ కలకలం**

ఒకవైపు ముంబయిలో భారీ సీజ్ జరుగుతుండగా, మరోవైపు తెలంగాణలోనూ డ్రగ్స్ అక్రమ రవాణా కలకలం రేపింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో డీఆర్ఐ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రూ. 11.4 కోట్ల విలువైన 11.4 కిలోల క్రిస్టల్ మెత్ పట్టుబడింది. ట్రాలీ బ్యాగుల్లో అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరు మహిళలను తనిఖీ చేయగా ఈ భారీ మొత్తం బయటపడింది. వీరిని అరెస్ట్ చేసిన అధికారులు ముఠా మూలాల కోసం ఆరా తీస్తున్నారు.

**శంషాబాద్ విమానాశ్రయంలో గంజాయి పట్టివేత**

హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో కూడా విదేశాల నుంచి డ్రగ్స్ తరలిస్తున్న ఘటన వెలుగు చూసింది. బ్యాంకాక్ నుంచి ఎయిర్ ఆసియా విమానంలో వచ్చిన ఒక ప్రయాణికుడిపై అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా, 16 సీల్డ్ ప్యాకెట్లలో 6.15 కిలోల హైడ్రోఫోనిక్ గంజాయి లభ్యమైంది. దీని విలువ సుమారు రూ. 2.15 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయాల ద్వారా డ్రగ్స్ సరఫరా చేసే ముఠాల పట్ల అధికారులు నిరంతరం నిఘా ఉంచుతున్నారు.

**స్మగ్లర్లకు కేంద్రం కఠిన హెచ్చరిక**

డ్రగ్స్ మాఫియా కింగ్‌పిన్‌లకు ప్రపంచంలో ఏ మూలనా రక్షణ దొరకదని అమిత్ షా ఈ సందర్భంగా హెచ్చరించారు. సామాజిక భద్రతకు ముప్పుగా మారిన మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కేవలం డ్రగ్స్ పట్టుకోవడం మాత్రమే కాకుండా, ఈ దందా వెనుక ఉన్న ప్రధాన వ్యక్తులను పట్టుకుని కఠినంగా శిక్షించడం ద్వారా మాఫియా మూలాలను పెకిలించి వేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

# గ్యాస్ ధరల పెంపు దుర్మార్గపు నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

సామాన్యుడిపై కనికరం లేని కేంద్రం

వాణిజ్య సిలిండర్ ధరను ఏకంగా రూ. 993 పెంచడం ద్వారా కేంద్రం తన క్రూరత్వాన్ని చాటుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఒకేసారి గ్యాస్ ధరను సుమారు వెయ్యి రూపాయలు పెంచడం వల్ల చిరు వ్యాపారులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు మాత్రమే కాకుండా వీధి చివర బండి పెట్టుకుని బతికే చిరు వ్యాపారుల వంటగదుల్లో కూడా మంటలు పుడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పెంపు కేవలం గ్యాస్‌కే పరిమితం కాదని, దీని వల్ల ఆహార పదార్థాల ధరలు పెరిగి అంతిమంగా సామాన్య ప్రజల జేబులకు చిల్లు పడుతుందని ఆయన హెచ్చరించారు.



**ఎన్నికల వ్యూహం బయటపడింది**

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరల పెంపు విషయంలో అనుసరిస్తున్న రాజకీయ క్రమశిక్షణను ఉత్తమ్ ఎండగట్టారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన కేవలం 24 గంటల్లోనే ఈ భారీ పెంపును ప్రకటించడం వెనుక ఉన్న కుట్రను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఓట్ల కోసం ధరలను నియంత్రించి, ఎన్నికలు అయిపోగానే ప్రజలపై భారం మోపడం మోదీ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. ప్రజలను మభ్యపెట్టి అధికారం పొంది, ఆపై వారిపైనే ఆర్థిక దాడి చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ఆయన అభివర్ణించారు.

**చిరు వ్యాపారుల కుదేలు**

ఒక్కసారిగా 30 నుంచి 35 శాతం ధర పెరగడంతో వ్యాపార నిర్వహణ అత్యంత భారంగా మారిందని మంత్రి పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం వల్ల టిఫిన్ సెంటర్లు, స్వీట్ షాపులు నడుపుకునే వారు తమ ధరలను పెంచక తప్పదని, ఇది సామాన్యుల ఆహార అలవాట్లపై కూడా ప్రభావం చూపుతుందని చెప్పారు. మోదీ ప్రభుత్వం సామాన్యుల జీవన ప్రమాణాలను పెంచాల్సింది పోయి, ఉన్న ప్రమాణాలను తగ్గించేలా నిర్ణయాలు తీసుకోవడం శోచనీయమని ఉత్తమ్ మండిపడ్డారు. కేంద్రం జారీ చేసిన ఈ ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీలో సిలిండర్ ధర రూ. 3071 దాటిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ ధరల పెంపు నిర్ణయంపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు ఐక్యంగా పోరాడాలని, ప్రజల పక్షాన కేంద్రం మెడలు వంచాలని ఆయన పిలుపునిచ్చారు. పేదల వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న బీజేపీకి త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని ఉత్తమ్ హెచ్చరించారు.

# జూన్2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

హైదరాబాద్ వెలుతురు మే 01:-

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ తేదీనాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. శుక్రవారం నాడు సచివాలయంలోని తన ఛాంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్స్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్స్ , తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రిగారు సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి, అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై మంత్రిగారు సొసైటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ.. జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టు సంఘాలలో అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాలకు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని, ఇప్పుడు కూడా ప్రజా ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్లుగా పరిష్కారం కాని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల సమస్యను కొలిక్కి తీసుకువచ్చి రవీంద్ర భారతిలో జర్నలిస్టుల కుటుంబాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమి అప్పగించినప్పటికీ న్యాయవివాదాల కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గుర్తు చేశారు. జర్నలిస్ట్ ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని జూన్ 2వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు సానుకూల దృక్పథంతో ఉన్నారని ప్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్‌తో పాటే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారికి సూచన ప్రాయంగా వెల్లడించి సొసైటీలో ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. 18 సంవత్సరాల క్రితమే ఇంటి స్థలాల కోసం ప్రతిసభ్యుడు రెండు లక్షల రూపాయిల చొప్పున చెల్లించారని దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల స్థలాల కేటాయింపులో తమ సొసైటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సభ్యులు మంత్రిగారిని కోరారు. సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ జి. ముకుంద రెడ్డి, సిపీఆర్‌వో మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు కేంద్రం ఇచ్చిన ‘ఎన్నికల బిల్లు’

న్యూఢిల్లీ వెలుతురు మే 01:

దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరల పెంపుపై ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై ముప్పేట దాడికి దిగాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ పెంపును తీవ్రంగా ఖండించారు. ఎన్నికలు ముగియగానే ద్రవ్యోల్బణ సెగ మొదలవుతుందని తాను ముందే హెచ్చరించానని, ఇప్పుడు అది నిజమైందని ఆయన అన్నారు. ఒకే రోజు రూ. 993 పెంచడం సామాన్యుడి నడ్డి విరవడమేనని, ఇది ప్రజలపై కేంద్రం మోపిన ‘ఎన్నికల బిల్లు’ అని ఆయన అభివర్ణించారు. కేవలం మూడు నెలల్లోనే ధరలు 81 శాతం పెరగడం దారుణమని మండిపడ్డారు.

**వరుస బాదుడు..**

**సామాన్యుడి బతుకు భారమే**

వాణిజ్య సిలిండర్ ధరల పెరుగుదలపై రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా గణాంకాలను బయటపెట్టారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ధరలు ఏకంగా రూ. 1,380 పెరిగాయని గుర్తు చేశారు. ఈ పెరుగుదల ప్రభావం కేవలం హోటళ్లకే పరిమితం కాదని, సామాన్యుడి భోజన పళ్లెంపై కూడా పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీ స్టాల్స్, దాబాలు, బేకరీలు, స్వీట్ షాపులు నడుపుకునే చిన్న వ్యాపారస్తులు ఈ భారాన్ని మోయలేక కుదేలవుతారని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో ఉపశమనం ఇచ్చినట్లు నటించి, ఓట్లు పడగానే ధరల తాపాన్ని పెంచడం బీజేపీ నైజమని దుయ్యబట్టారు.

**రానున్నది పెట్రోల్, డీజిల్ వంతు!**

గ్యాస్ ధరల పెంపు కేవలం ఆరంభం మాత్రమేనని, త్వరలోనే పెట్రోల్, డీజిల్ ధరలు కూడా ఆకాశాన్ని తాకనున్నాయని రాహుల్ గాంధీ హెచ్చరించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగియగానే మోదీ ప్రభుత్వం తన అసలు రంగు బయటపెట్టిందని విమర్శించారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు వచ్చిన లాభాలను ప్రభుత్వం తన జేబులో వేసుకుందని, ఇప్పుడు ధరలు పెరగగానే ఆ భారాన్ని ప్రజలపై నెట్టేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. “ఎన్నికల విరామం ముగిసింది.. ద్రవ్యోల్బణ కాలం మొదలైంది” అంటూ ప్రజలను అప్రమత్తం చేశారు.

**ప్రజలకు వెన్నుపోటు: డీకే శివకుమార్**

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా కేంద్రం తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది దేశ ఓటర్లను మోసం చేయడమేనని, ప్రజలకు వెన్నుపోటు పొడవడమని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాల కోసం వేచి చూడకుండానే బీజేపీ ప్రభుత్వం తన బాదుడును మొదలుపెట్టిందని ఎద్దేవా చేశారు. ఈ ధరల పెంపును వెనక్కి తీసుకునే వరకు తాము విశ్రమించబోమని, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు.

**కార్మికులకు ఇచ్చే గౌరవం ఇదేనా?**

మే డే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) సందర్భంగా కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై సీపీఐ(ఎం) నాయకురాలు బృందా కారత్ నిప్పులు చెరిగారు. కార్మికుల వేతనాలు పెరగడం లేదు కానీ, గ్యాస్ ధరలు మాత్రం రూ. 3000కు చేరువవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఇచ్చే సబ్సిడీలు కేవలం అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకేనా? సామాన్య ప్రజలకు కాదా? అని ఆమె ప్రశ్నించారు. ఈ పెంపు వల్ల లక్షలాది మంది పేద కుటుంబాల బతుకులు ఛిన్నాభిన్నమవుతాయని ఆమె హెచ్చరించారు.



ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే, ఎన్నికల అనంతరం పెరుగుతున్న ధరలు సామాన్యుడిని కోలుకోలేని దెబ్బ తీసేలా ఉన్నాయి. విపక్షాలు ఏకతాటిపైకి వచ్చి ధరల పెంపును అడ్డుకోవాలని ప్రయత్నిస్తుండగా, ప్రభుత్వం మాత్రం అంతర్జాతీయ పరిస్థితులను కారణంగా చూపుతోంది. ఏదేమైనా, ఈ ‘ధరల తాపం’ రానున్న రోజుల్లో రాజకీయంగా మరిన్ని సెగలు పుట్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# "కార్పొరేట్ లాభాల కోసం కార్మిక హక్కుల త్యాగమా?"

భారతదేశ కార్మిక వర్గ చరిత్రలో ప్రతి దశ కూడా పోరాటాలతో, త్యాగాలతో, కష్టాలతో ముడిపడి ఉంది. 8 గంటల పని దినం నుంచి కనీస వేతనం వరకు, యూనియన్ హక్కుల నుంచి సామాజిక భద్రత వరకు—ఈ దేశంలో కార్మికులకు లభించిన ప్రతి హక్కు వారి దీర్ఘకాలిక పోరాటాల ఫలితం. అయితే ఇటీవలి కాలంలో కేంద్రంలో ఉన్న ప్రధానిగా నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు ఈ చారిత్రక విజయాలన్నింటినీ తిరస్కరించే దిశగా నడుస్తున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వాదనలు ఒకవైపు ఉంటే, కార్మిక సంఘాల అనుభవాలు, ఆందోళనలు మరోవైపు తీవ్ర వ్యత్యాసాన్ని చూపుతున్నాయి. ప్రభుత్వం చెప్పే కథనం ఏమిటంటే—29 వేర్వేరు కార్మిక చట్టాలను సరళీకరించి నాలుగు కోడ్లలో సమీకరించడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, వ్యాపార వాతావరణం మెరుగుపడుతుందని, చివరికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని. కానీ ఈ 'సరళీకరణ' అనే పదం వెనుక అసలు సారం ఏమిటన్నది పరిశీలిస్తే, ఇది కార్మిక హక్కుల క్షీణతకు దారితీసే మార్గమని విమర్శకులు చెబుతున్నారు.

మొదటగా, ఈ చట్టాల రూపకల్పన విధానం స్వయంగా ప్రజాస్వామ్య ప్రమాణాలపై ప్రశ్నలు లేవనెత్తింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన కార్మిక సంఘాలతో విస్తృత చర్చలు జరపకుండా, పార్లమెంటులో ప్రతిపక్షాల బలహీన పరిస్థితిని ఉపయోగించుకుని చట్టాలను ఆమోదించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పలువురు అభిప్రాయపడ్డారు. ఒక దేశంలో కార్మికుల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే ఇంత పెద్ద మార్పులను చర్చలేమీ లేకుండా అమలు చేయడం అనేది కేవలం విధానపరమైన లోపం కాదు—అది ఉద్దేశపూర్వకంగా విభేదాలను అణచివేయడమే అన్న భావనను కలిగిస్తుంది.

ఇక చట్టాల విషయానికి వస్తే, పారిశ్రామిక సంస్థలను మూసివేయడం, కార్మికులను తొలగించడం వంటి అంశాల్లో కొత్త కోడ్లు యాజమాన్యాలకు విస్తృత స్వేచ్ఛను కల్పిస్తున్నాయి. గతంలో 100 మందికి పైగా కార్మికులు ఉన్న సంస్థలను మూసివేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా ఉండేది. ఇప్పుడు ఈ పరిమితిని 300 మందికి పెంచడం వల్ల దేశంలోని పెద్ద శాతం కార్మికులు రక్షణ కోల్పోయే ప్రమాదం ఉంది. దీని అర్థం ఏమిటంటే—యాజమాన్యం ఎప్పుడైనా తమ వ్యాపార ప్రయోజనాల కోసం కార్మికులను తొలగించగలదు, సంస్థలను మూసివేయగలదు, మరియు దీనికి ప్రభుత్వ నియంత్రణ తక్కువగా ఉంటుంది.

సమ్మె హక్కు విషయంలో కూడా గణనీయమైన మార్పులు వచ్చాయి. సమ్మె అనేది కార్మికులకు ఉన్న చివరి ఆయుధం. సమస్యలు పరిష్కారం కాకపోతే వారు చివరకు ఆశ్రయించే మార్గం అది. అయితే కొత్త కోడ్ల ప్రకారం సమ్మెకు ముందు 60 రోజుల నోటీసు ఇవ్వాలి, మరియు వివిధ పరిమితులు విధించబడతాయి. ఈ నిబంధనలు ప్రాక్టికల్‌గా సమ్మెలను అసాధ్యంగా మారుస్తాయని కార్మిక సంఘాలు అంటున్నాయి. అంతేకాకుండా సమ్మెకు మద్దతు ఇచ్చిన నాయకులను కఠిన చట్టాల కింద కేసులు పెట్టే అవకాశాన్ని కూడా ఈ వ్యవస్థ కల్పిస్తుంది.

పని గంటల విషయంలో కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారికంగా 8 గంటల పని దినం కొనసాగుతుందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ప్రాక్టికల్ అమలు విధానం ద్వారా 12 గంటల వరకు పని చేయించే పరిస్థితులు ఏర్పడతాయని కార్మికులు భయపడుతున్నారు. ఇది కేవలం శారీరక శ్రమను పెంచడం మాత్రమే కాదు—కార్మికుల జీవన నాణ్యతను, కుటుంబ జీవనాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. బోనస్, వేతనాలు, మరియు ఇతర ఆర్థిక ప్రయోజనాల విషయంలో కూడా కోడ్లు స్పష్టత లేకుండా ఉన్నాయని విమర్శలు ఉన్నాయి. యాజమాన్యాలు తమ ఆర్థిక వివరాలను కార్మికులకు వెల్లడించాల్సిన అవసరం లేకపోవడం పారదర్శకతను తగ్గిస్తుంది. కాంట్రాక్ట్ కార్మికుల విషయంలో ప్రధాన యజమాని బాధ్యత తగ్గించడం వల్ల కార్మికులు మరింత అసురక్షిత స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంది.

ఈ మొత్తం మార్పులను ఒక పెద్ద దృశ్యంలో చూస్తే, ఇది కేవలం చట్టాల మార్పు కాదు—భారతదేశంలో కార్మికయజమాని సంబంధాల పునర్నిర్మాణం. ఈ పునర్నిర్మాణం ఎటు వైపు సాగుతోంది అన్నదే ప్రధాన ప్రశ్న. విమర్శకుల అభిప్రాయం ప్రకారం ఇది కార్మికులపై ఒత్తిడి పెంచుతూ, కార్పొరేట్ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లే దిశగా ఉంది. ఈ దృక్పథానికి మూలంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, వంటి సంస్థల ఆలోచనా విధానం ఉందని కూడా కొందరు పేర్కొంటున్నారు.

అయితే ప్రభుత్వం మాత్రం ఈ విమర్శలను ఖండిస్తూ, దీర్ఘకాలంలో ఈ సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తాయని వాదిస్తోంది. పెట్టుబడులు పెరిగితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తద్వారా కార్మికుల స్థితి కూడా మెరుగుపడుతుందని చెబుతోంది. కానీ ఈ వాదన ఎంతవరకు వాస్తవానికి దగ్గరగా ఉందో కాలమే నిర్ణయిస్తుంది.

ప్రస్తుత పరిస్థితిలో ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది—దేశంలో కార్మిక వర్గం ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. వారి హక్కులను కాపాడుకోవాలంటే సంఘటిత శక్తి అవసరం. రైతు ఉద్యమం చూపించినట్టు, దీర్ఘకాలిక పోరాటం ద్వారా మాత్రమే ప్రభుత్వాలను వెనక్కి తగ్గించవచ్చు అన్న భావన బలపడుతోంది.

చరిత్ర చెబుతున్న ఒక సత్యం ఏమిటంటే—కార్మికుల హక్కులు ఎప్పుడూ పై నుండి దానం చేయబడవు; అవి క్రింద నుండి పోరాడి సాధించాల్సిందే. ఈ నేపథ్యంలో లేబర్ కోడ్ల అమలు కేవలం ఒక చట్టపరమైన మార్పు కాదు; అది భారతదేశ సామాజికఆర్థిక నిర్మాణాన్ని ప్రభావితం చేసే పెద్ద పరిణామం. ఈ మార్పు కార్మికులకు అనుకూలమా, ప్రతికూలమా అన్నది వారి సంఘటిత చర్యలపై ఆధారపడి ఉంటుంది.అంతిమంగా, ఈ ప్రశ్న ప్రతి కార్మికుడి ముందుంది, హక్కులను కోల్పోయే మార్గంలో నిశ్శబ్దంగా నడవాలా, లేక వాటిని కాపాడుకునేందుకు పోరాటాన్ని ఎంచుకోవాలా? కార్మిక లోకం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మన్నారం నాగరాజు.
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

# జిల్లాలో నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు మే 01:**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లాకార్యాలయంలో ఈనెల 3న ఆది వారంనాడు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణను జిల్లాలో పకడ్బందీగా చేపట్టా లని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు 3నపరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ప్రా రంభమవుతుందని అభ్యర్థులు ఉదయం 11గంటల నుండి పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తారని మ ధ్యాహ్నం 1.30 గంటలకు కేంద్రాల గేట్లు మూయడం జరుగుతుందని అన్నారు నీట్ పరీక్షకు అభ్య ర్థుల హాజరును బయోమెట్రిక్ విధానంద్వారా తీసుకోవడం జరుగుతుందని బయోమెట్రిక్ సమ యంలో ఏదైనాసమస్య తలెత్తి ధృవీకరణ పూర్తి కాక పోయినా అభ్యర్థిని పరీక్షా గదిలోకి ప్రవేశించడానికి అనుమతిస్తారని అయితే అభ్యర్థులు ఒక లిఖితపూర్వక హామీ పత్రాన్ని సమర్పించాలని సూచించారు ఈ హామీ పత్రం యొక్క నమూనా పరీక్షా కేంద్రంలో అందించబడుతుందని తెలిపా రు పరీక్ష కేంద్రంలోనికి ఎలాంటి డిజిటల్ పరికరాలు అనుమతించడం జరగదని పరీక్ష రాసే అభ్య ర్థుల తనిఖీ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు ప్రశ్న పత్రాల రవాణాపై పోలీస్ రెవెన్యూ తపా లా శాఖల అధికారుల సమన్వయంతో రక్షణ చర్యలు చేపట్టాలని పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనల ప్రకారం బందోబస్తు ఏ ర్పాటు చేయాలని ఆదేశించారు కం ట్రోల్ రూమ్ పరీక్ష కేంద్రాలలో సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయాలని పరీక్ష ముగిసిన తరువాత ఓఎంఆర్ పత్రాల తరలింపు నిబంధన ల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు పరీక్షా సమయంలో ఎలాంటి అంతరాయం లేకుం డా విద్యుత్ సరఫరా చేయాలి వైద్యసిబ్బందిని నియమించి,ఓ.ఆర్.ఎస్ అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరుగు తెలిపారు దివ్యాంగ అభ్యర్థుల కొరకు సౌకర్యాలు కల్పించాలని తెలిపారు

# వడగాలులపై హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్



- **త్రాగునీరు సమస్య రాకుండా చూడాలి**
- **అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్ల సరఫరా**
- **ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగితే 15 రోజుల్లో నివేదికలు పంపించాలి**
- **హీట్ వేవ్‌పై 20 విభాగాలతో సమీక్షించిన**
- **రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**


**హైదరాబాద్ వెలుతురు మే 01:**

రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు, వడగాలుల నుంచి ప్రజలను రక్షించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆమేరకు సంబంధిత శాఖలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది 2026లో ఎండలు , వడగాలులు అధికంగా వీచే అవకాశం ఉందని, జూన్ 15 వరకు కూడా అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని , ఐఎండి హెచ్చరికల నేపధ్యంలో తీసుకోవలసిన చర్యలపై 20 సంబంధిత శాఖలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ, ఇండియన్ మెట్రాలాజికల్ శాఖ కలిసి సమగ్ర తెలంగాణ స్టేట్ హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్ (HAP)2026 ను రూపొందించాయని ఈ సందర్భంగా హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ 2026ను మంత్రి గారు విడుదల చేశారు.

సమావేశంలో మంత్రిగారు మాట్లాడుతూ ఈ 45 రోజుల్లో రాష్ట్రంలో గ్రామీణపట్టణప్రాంతాల్లో ఎక్కడకూడా త్రాగునీటి కొరత రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా మోటార్లు కాలిపోతే 24 గంటల్లో మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో డిమాండ్‌కు అనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని రోజుకు 14 గంటలు ఫిల్లింగ్ చేసి 15వేల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. అన్నిశాఖలు ముఖ్యంగా పంచాయితీ రాజ్, మున్సిపల్ ,ఫైర్, హెల్త్ సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకోవడానికి వీలుగా 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదికలను పంపించాలని అధికారులను ఆదేశించారు. వడగాలుల ప్రభావం సామాన్యప్రజలపై పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అయినా కూడా అనుకోని పరిస్థితులలో ఎవరైనా చనిపోతే మానవతా దృక్పధంతో వ్యవహరించి తక్షణం ఎక్స్‌గ్రేషియో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నల్గొండ మంచిర్యాల సూర్యాపేట పెద్దపిల్లి జగిత్యాల ఖమ్మం వరంగల్ కరీంనగర్ మహబూబాబాద్ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉంటుందని ఈ జిల్లాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ఆడుకుంటూ ప్రమాదాలకు గురౌతున్నారని అందువల్ల ఆయా ప్రాంతాలలో ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్, పోలీస్ , రెవెన్యూ విభాగాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలకు సంబంధించిన సమాచారం, అధిక ఉష్ణోగ్రతల వేళ ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, కూల్ వార్డుల ఏర్పాటు, ఆసుపత్రులలో ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహణ వంటి అంశాలపై చర్యలు చేపట్టాలని ప్రజా ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులలో ఓఆర్ఎస్ ప్యాకట్లను అందుబాటులో ఉంచాలని అదేవిధంగా వేడి ప్రదేశాలలో పనిచేసే కార్మికులను రెండు బృందాలుగా విభజించి కనీసం గంట లేదా రెండు గంటల విశ్రాంతి ఇచ్చేలా రొటేషన్ పద్దతి అవలంభించేలా పరిశ్రమలకు సూచించాలన్నారు. బస్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాలు, ప్రార్ధనా స్థలాల వంటి పబ్లిక్ ప్రాంతాలలో అవసరమైన షెల్టర్లు, త్రాగునీరు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పబ్లిక్ అడ్రస్ సిస్టమ్,ఎల్ ఇ డి స్క్రీన్ల ద్వారా ప్రచారం కల్పించాలని స్థానిక సంస్థలు, మున్సిపాల్టీలు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# తన గన్‌మెన్ లావుడియా సురేష్ - స్వర్ణ దంపతులను ఆశీర్వదించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హార్కర వేణుగోపాల్ రావు

**పెద్దపల్లి జిల్లా వెలుతురు మే 01:** శుక్రవారం రోజున పెద్దపల్లి జిల్లా ధర్మారం లో నిర్వహించిన రిసెప్షన్ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హార్కర వేణుగోపాల్ రావు హాజరై, తన గన్‌మెన్ శ్రీ లావుడియా సురేష్ - స్వర్ణ గారి రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఐశ్వర్య-సంపదలతో నిండియుండాలని ఆకాంక్షించారు.



# ఘనంగా చీకటి మామిడిలో మేడే దినోత్సవం

- **పాల్గొని జెండా ఆవిష్కరణ చేస్తున్న సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాసం.**

**మునుగోడు వెలుతురు మే 01:**



మునుగోడు నియోజకవర్గ రైతుల మే డే దినోత్సవం సందర్భంగా మునుగోడు మండలం చీకటి మామిడిగ్రామంలో శుక్రవారం రాత్రి సిపిఐ జెండా ఆవిష్కరణ చేస్తున్న మండల కార్యవర్గ సభ్యులు ఈధుల కంటి కైలాసం కార్యక్రమంలో పాల్గొన్న చీకటి మామిడి శాఖ కార్యదర్శి తాటికొండ సైదులు సహాయ కార్య దర్శి చింతల వెంకన్నగ్రామపంచాయతీ నాలుగో వార్డ్ మెంబర్ ఏర్కొండ భాగ్యలక్ష్మి నాగేష్ గ్రామ శాఖ నాయకులు మేడి చంద్రయ్య సభ్యులు కొలతరం పాపయ్య ఏర్కొండ యాదయ్య తదితరులు పాల్గొన్నారు

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com